మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 22 మంగళవారం | అక్టోబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 36

ANU FURNITURE®
HYDERABAD | BENGALURU
Call: +91 9100913033, 8688003033



## గ్రూప్-1 వాయిదాకు
# సుప్రీం నో



- గ్రూప్-1 పరీక్ష వాయిదాకు సుప్రీంలో పిటిషన్ వేసిన అభ్యర్థులకు చుక్కెదురు
- పరీక్షల నిర్వహణలో జోక్యం చేసుకోలేమన్న సుప్రీం కోర్టు ధర్మాసనం
- హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషన్లరకు సుప్రీం కోర్టు సూచన
- సుప్రీం కోర్టు తీర్పుతో యథావిధిగా గ్రూప్-1 పరీక్షలు మొదలు

2

**ఢిల్లీ-నవభూమిబ్యూరో:** గ్రూప్-1 పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన అభ్యర్థులకు చుక్కెదురైంది. పరీక్ష వాయిదాకు సుప్రీం కోర్టు నిరాకరించింది.

పరీక్షల నిర్వహణలో జోక్యం చేసుకోలేమని అత్యున్నత ధర్మాసనం స్పష్టం చేసింది.

గ్రూప్-1 పరీక్ష నిలిపివేయాలని స్టే ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ సమయంలో జోక్యం చేసుకోలేమని పిటిషనర్ తరపు న్యాయవాది కపిల్ సిబల్‌కు కోర్టు తేల్చి చెప్పింది. హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషన్లరకు సుప్రీం కోర్టు సూచించింది. గ్రూప్-1 ఫలితాల వెల్లడికి ముందే తుది తీర్పు ఇవ్వాలని హైకోర్టుకు సుప్రీం కోర్టు కీలక సూచన చేసింది.

సుప్రీం కోర్టు తీర్పుతో గ్రూప్-1 పరీక్షకు లైన్ క్లియర్ అయింది. సోమవారం (అక్టోబర్ 21, 2024) మధ్యాహ్నం 2 గంటలకు గ్రూప్-1 పరీక్షలు మొదలయ్యాయి. ఈ నెల 27 వరకు (అక్టోబర్ 27, 2024) కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు 31,383 మంది హాజరు కానుండగా, వారి కోసం 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 సెంటర్లున్నాయి. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎగ్జామ్స్ జరగనున్నాయి.

తొలి రోజు సోమవారం క్వాలిఫైయింగ్ టెస్ట్ ఇంగ్లిష్ జరిగింది. ఆ తర్వాత వరుసగా ఆరు వేర్వేరు సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు ఉంటాయి. ఆరు సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల ఆధారంగానే అభ్యర్థుల ర్యాంకింగ్ ఫైనల్ అవుతుంది. ప్రతి పేపర్‌కు 150 మార్కులు ఉంటాయి. అయితే, ఇంగ్లిష్ పేపర్ మినహా మిగిలిన అన్ని పేపర్లను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో రాసుకునేందుకు అభ్యర్థులకు అవకాశం ఉంది.

అభ్యర్థులు ఎంచుకున్న మీడియంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది. కొన్ని పేపర్లు ఒక మీడియంలో రాసి, మరికొన్ని వేరే మీడియంలో రాస్తే ఆ అభ్యర్థిని ఫలితాల్లో పరిగణనలోకి తీసుకోబోమని టీజీపీఎస్సీ ఇప్పటికే హెచ్చరించింది. ఒకే జవాబు పత్రంలో సగం ఒక మీడియంలో, మరికొంత మరో మీడియంలో రాసినా అది చెల్లుబాటు కాదని స్పష్టత ఇచ్చింది.

ముగిసిన తొలి రోజు గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష

తెలంగాణలో తొలి రోజు నిర్వహించిన గ్రూప్- 1 మెయిన్స్ పరీక్ష ముగిసింది. 31,383 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు క్వాలిఫై అయ్యారు. వీరిలో అత్యధికులు ఇవాళ పరీక్షకు హాజరయ్యారు.

ఈ నెల 27 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షలను వాయిదా

## దీపావళి నుంచి
# దీపం పథకం

- దీపం పథకం కింద ఉచితంగా సిలిండర్లు అందజేత
- ఏడాదికి మూడు సిలిండర్లు మాత్రమే ఉచితం
- ప్రభుత్వంపై రూ.2,684 కోట్ల భారం
- దీపం పథకం రాష్ట్ర చరిత్రలో గొప్ప మైలురాయి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దీపావళి పండగ సందర్భంగా మరో కీలక పథకం ప్రారంభించనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు.

పండగ సందర్భంగా మహిళలకు శుభవార్త చెప్పారు. దీపం పథకం కింద ఉచితంగా సిలిండర్లు అందజేస్తామని తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి.. ఆ రోజున దీపం పథకానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.

**ఏడాదికి ఎన్నంటే..**

ప్రభుత్వ మార్గ దర్శకాల మేరకు అర్హులైన వారికి దీపం పథకం కింద సిలిండర్లను అందజేస్తారు. ఏడాదికి మూడు సిలిండర్లు మాత్రమే ఫ్రీగా ఇస్తారు. ఇందుకోసం ప్రభుత్వంపై రూ.2,684 కోట్ల భారం పడనుంది. మహిళ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దీపం పథకం రాష్ట్ర చరిత్రలో గొప్ప మైలురాయిగా నిలుస్తోందని అభిప్రాయ పడ్డారు. ఆడపడుచులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

**ఎవరు అర్హులంటే..**

ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ పథకం ప్రయోజనం పొందేవారికి మాత్రమే దీపం పథకానికి అర్హులు. మిగతా వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.. ఉజ్వల గ్యాస్ లబ్దిదారులకు ఈజీగా దీపం పథకం అమలవుతుంది.

**అర్హతలు:** విధిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరులు కావాలి.

గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండాలి

ఆర్థికంగా వెనకబడిన వారైతే అర్హులు

బీపీఎల్ కుటుంబాలు దరఖాస్తు చేయాలి.

వైట్ రేషన్ కార్డు ఉన్న వారిని ప్రమాణికంగా తీసుకుంటారు.

## తెలుగు రాష్ట్రాల రాజధానులను కలుపుతూ
# బుల్లెట్ ట్రైన్!

2

- కేంద్రం ముందు ప్రతిపాదన చేసిన ఏపీ సీఎం
- తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో ఏపీని కలుపుతూ హైస్పీడ్ రైల్ కారిడార్ రావాలన్న ఏపీ సీఎం
- బుల్లెట్ ట్రైన్ కారిడార్‌కి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ని త్వరలోనే రెడీ చేస్తామన్న చంద్రబాబు



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

దేశంలో ప్రస్తుతం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు వేగవంతంగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం చైర్ కార్ కోచ్‌లతో నడుస్తుండగా త్వరలోనే స్లీపర్ కోచ్ వెర్షన్ వందేభారత్ ట్రైన్‌లు కూడా అందుబాటులోకి రానున్నాయి.

తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడులోనూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. అయితే, ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. దక్షిణ భారత అభివృద్ధే లక్ష్యంగా నాలుగు ప్రధాన నగరాలను కలుపుతూ 'బుల్లెట్ రైలు'ను తీసుకు రావాలని ప్రపోజల్ పెట్టారు. దీంతో పాటు ఏపీలో ఆర్థిక వృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ముఖ్య వ్యాఖ్యలు చేశారు. రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం ఏపీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి ట్రాక్‌లో పెట్టేందుకు సీఎం చంద్రబాబు నాయుడు వినూత్న ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా దక్షిణ

## త్వరలో కొత్త రేషన్
# కార్డుల జారీ

- రేషన్ కార్డుల సమస్యపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- రేషన్ కార్డుల్లో కొత్త కుటుంబ సభ్యుల పేర్లను చేర్చేందుకు ప్రభుత్వం సానుకూలం
- తెలంగాణలో ప్రస్తుతం ఫ్యామిలీ డిజిటల్ కార్డులను జారీ
- కుటుంబ యజమానిగా మహిళల్ని గుర్తించి కార్డుల జారీ



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఎదురు చూస్తున్న కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం తీపి కబురు అందించింది.

ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రాతిపదికగా ఉండటంతో కొత్త కార్డుల జారీ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డుల జారీపై ఇప్పటికే పలుమార్లు ప్రకటనలు వెలువడినా ఆచరణలో మాత్రం సాకారం కాలేదు.

కుటుంబాల విభజన, కొత్త సభ్యుల చేరికతో పాటు కొత్త రేషన్ కార్డుల మంజూరు విషయంలో కూడా స్పష్టత లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొత్తగా పెళ్లైన వారికి మెట్టినింట్లో కార్డుల్లో చేర్చకపోవడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి. రేషన్ కార్డుల సమస్యపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. రేషన్ కార్డుల్లో కొత్త కుటుంబ సభ్యుల పేర్లను చేర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది.

## వాలంటీర్ హత్యకేసులో
# మాజీ మంత్రి కుమారుడి అరెస్ట్

- వాలంటీర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు
- మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని
- అయినవిల్లిలో రెండేళ్ల క్రితం వాలంటీర్ హత్య
- భార్య ఫిర్యాదుతో కదిలిన పోలీసులు..మధురైలో చిక్కిన శ్రీకాంత్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

మాజీమంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. రెండేళ్ల క్రితం జరిగిన వాలంటీర్ హత్య కేసులో ఈయన ప్రధాన నిందితుడుగా ఉన్నారు.

కొన్ని రోజుల నుంచి గాలిస్తున్న ఖాకీలు రాత్రి అరెస్టు చేసినట్టు తెలుస్తోంది. తమిళనాడులోని మధురైలో శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అక్కడే కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై ఏపీకి తీసుకురానున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలనం నమోదు అయింది. వాలంటీర్ హత్య కేసులో ఏకంగా మాజీ మంత్రి కుమారుడు అరెస్టు కావడం కలకలం రేపుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అయినవిల్లిలో రెండేళ్ల క్రితం జరిగిందీ దుర్ఘటన. కోనసీమ అల్లర్ల టైంలో వాలంటీరు దుర్గాప్రసాద్ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు 2022 జూన్ 6న దుర్గాప్రసాద్‌ను హత్య చేశారు.

**ధర్మేశ్ అరెస్టుతో వెలుగులోకి వస్తున్న వాస్తవాలు**

దుర్గా ప్రసాద్‌ను హత్య కేసును దర్యాప్తు చేసిన పోలీసులు అప్పట్లోనే ఉప్పల గుప్తం మండలా నికి వడ్డి ధర్మేశ్‌ను నిందితుడిగా చేర్చారు. ఆ వ్యక్తి దుర్గాప్రసాద్‌కు సన్నిహితుడే కాకుండా వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా కూడా ఉన్నట్టు తెలుస్తోంది.

ఇన్ని రోజుల తర్వాత ఈ నెల 18న ధర్మేశ్‌ను అరెస్టు చేశారు. ఆ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో పినిపె శ్రీకాంత్‌తోపాటు ఈ మరో నలుగురి పేర్లను నిందితుల జాబితాలో చేర్చారు.


**ఇప్పటి వరకు పరారీలో ఉన్న శ్రీకాంత్ రాత్రి అరెస్టు**

ధర్మేశ్ అరెస్టు తర్వాత శ్రీకాంత్ సహా మిగతా నలుగురు పరార్ అయ్యారు. దుర్గా ప్రసాద్‌ను ఎలా హత్య చేశారనే విషయాన్ని పోలీసులకు పూసగుచ్చినట్టు ధర్మేశ్ చెప్పాడని తెలుస్తోంది. ధర్మేశ్ సహా నలుగురికి దుర్గప్రసాద్ హత్య బాధ్యతను అప్పగించినట్టు గుర్తించారు. స్థానికంగా ఉండే లాడ్జిలో హత్యకు కుట్ర జరిగిందని నిర్ధారించారు. స్నేహితుడైన ధర్మేశ్

## వైసీపీ అధినేత జగన్ అసెంబ్లీ
# సమావేశాలకు రావాలి

- వైసీపీ నేత జగన్‌కు ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆహ్వానం
- ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యేలు అందరూ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలి
- జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు సమావేశాలకు వస్తే చూడాలని ఉందన్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

వైసీపీ అధినేత జగన్ అసెంబ్లీ సమావేశాలకు వస్తే బాగుంటుందని ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఇప్పటికే తాను వైసీపీ అధినేత జగన్‌ను అసెంబ్లీ సమావేశాలకు ఆహ్వానించానని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు.

ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యేలు అందరూ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని, వాళ్ల నియోజకవర్గాల్లో ఏవైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు.

ప్రజా ప్రతినిధులు అసెంబ్లీకి రాకపోతే వాళ్ల నియోజక వర్గంలోని పనులు ఆగిపోతాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు. అసెంబ్లీ సమావేశాలకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలు తప్పకుండా హాజరు కావాలని, స్థానిక నియోజకవర్గాల ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి ఆ సమస్యలు పరిష్కారం అయ్యేలా ఎమ్మెల్యేలు పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రజాప్రతినిధులకు సూచించారు.

ఈ అసెంబ్లీ సమావేశాలకు జగన్ తో పాటు వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు అందరూ హాజరవుతారని అనుకుంటున్నారని, వారిని అసెంబ్లీలో చూడాలని తాను ఎదురుచూస్తున్నానని, అసెంబ్లీలోకి వారు వస్తే వారితో మాట్లాడాలని ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం నాతవరం మండలంలోని పెద్ద గొలుగుండ పేటలో జరిగిన పల్లెపండుగ వారోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడు

## అమరావతికి రూ. 11 వేల కోట్ల
# హడ్కో రుణం



- అమరావతి రాజధాని నిర్మాణానికి అడుగులు వేగంగా పడుతున్నాయి
- అమరావతికి రూ. 11 వేల కోట్ల హడ్కో రుణం
- ఢిల్లీలో ఆ సంస్థ అధికారులతో మంత్రి నారాయణ చర్చలు సఫలం
- సీఆర్‌డీఏకు రుణం ఇచ్చేందుకు హడ్కో సీఈఓ అంగీకారం

2

**అమరావతి,అక్టోబరు 21 నవభూమి:** అమరావతి రాజధాని నిర్మాణానికి అడుగులు వేగంగా పడుతున్నాయి. అమరావతిని నంబర్ వన్ రాజధానిగా తీర్చిదిద్దాలన్న సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యాలకు అనుగుణంగా అన్నివైపుల నుంచి సహకారం అందుతోంది. అమరావతి నిర్మాణానికి హడ్కో రూ.11 వేల కోట్ల రుణం అందించేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే ప్రపంచబ్యాంకు రూ. 15 వేల కోట్లు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దానికి సంబంధించిన ప్రక్రియ డిసెంబర్ కల్లా పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. రాజధాని నిర్మాణంలో ప్రభుత్వ భవనాల కాంప్లెక్, ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక వసతులు అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయం వంటి ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి మిగిలిన పనుల పూర్తికి రూ.50 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే వాటిలో మొదటి విడత పనుల పూర్తికి రూ. 26 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ నిధుల సమీకరణ కోసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దృష్టిసారించింది. ఇప్పటికే ప్రపంచబ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు కలిసి రూ.15 వేల కోట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపాయి. ఇక మిగిలిన రూ. 11 వేల కోట్ల నిధుల మంజూరుకు హడ్కో ఓకే చెప్పింది. సోమవారం ఢిల్లీలో పర్యటించిన మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ హడ్కో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో హడ్కో సీఈఓ సంజయ్ కుల్‌శ్రేష్ట, హడ్కో విజయవాడ రీజినల్ చీఫ్ బీఎసఎన్ మూర్తి పాల్గొన్నారు. అమరావతి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ ప్రతిపాదనలకు సంతృప్తి చెందిన హడ్కో సీఈఓ అమరావతి నిర్మాణం కోసం ఏపీసీఆర్‌డీఏకు రూ.11 వేల కోట్ల రుణం మంజూరుకు అంగీకారం తెలిపారు. ఈ విషయాన్ని నారాయణ ఎక్స్ వేదికగా తెలిపారు. దీంతో అమరావతి ఫేజ్-1 నిర్మాణానికి అవసరమైన మొత్తం రూ.26 వేల కోట్లు సర్దుబాటు అయినట్టయింది. ఈ నిధులు విడుదలైతే రాజధాని పనులు వేగంగా ముందుకు సాగనున్నాయి.

**పొత్తు వల్లే భారీగా గ్రాంట్లు: పెమ్మసాని**

బీజేపీతో పొత్తు పెట్టుకోవడంలోనే చంద్రబాబు ముందుచూపు, దార్శనికత కనిపిస్తోందని,




## బీఆర్ఎస్ నేతలు విద్యార్థులను రెచ్చగొట్టారు ... మంత్రి జూపల్లి ధ్వజం

**నిజామాబాద్:నవభూమి:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణపై చేసిన అప్పులకు నెలకు రూ. 6వేల కోట్లు వడ్డీ చెల్లిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వడ్డీలు ఎంత భారం అయినప్పటికీ తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వస్తుందని స్పష్టం చేశారు. నూడ ఛైర్మన్ కేశ వేణు ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, టిపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,ప్రభుత్వ సలహా దారులు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ...గ్రూప్-1 పరీక్షల విషయంలో బీఆర్ఎస్ నేతలు విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టను మసకబార్చే ప్రయత్నం చేశారని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు అభినందనీయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అని చెప్పారు. నిజామాబాద్ జిల్లాపై సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక మక్కువ ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు."జిల్లాకు అత్యధికంగా కేటాయించిన నామినేటెడ్ పోస్టులే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వంపై కొన్ని మీడియా సంస్థలు , సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ విష ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకోవాలి. గడిచిన పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అధ్వానంగా మార్చింది. కేసీఆర్ హయాంలో ఏ ఒక్క హామీ అమలు కాలేదు. కేసీఆర్ ఒక నియంతలా రాష్ట్రాన్ని పరిపాలించాడు కాబట్టే ప్రజలు సరైన బుద్ధి చెప్పారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీను గెలిపించాలి" అని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు.



## బండి సంజయ్‌పై ఓ రేంజ్‌లో ఫైర్ అయిన కడియం



**జనగామ-నవభూమి:**కేంద్రమంత్రి బండి సంజయ్‌పై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్ కేంద్రమంత్రి అని మరిచిపోయి సిగ్గు లేకుండా నడిరోడ్లపై దాడులు చేస్తున్నారని.. జ్ఞానం ఉందా అంటూ విరుచుకుపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేయాల్సింది పోయి రోడ్డు మీద కూర్చోవడం పద్ధతేనా అని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధిపై బీఆర్ఎస్‌కు, బీజేపీకి ప్రేమ లేదని.. అధికారం కోసం పోటీపడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి చక్కగా పరిపాలిస్తున్నారని అన్న ఎమ్మెల్యే.. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు.ఏడు లక్షల కోట్ల అప్పులలో రాష్ట్రం ఉందన్నారు. వడ్డీలు, జీతాలు, పెన్షన్లు, అభివృద్ధి కార్యక్రమాలకు మిగులుబాటు లేదని.. సర్దుబాటు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. రేవంత్ రెడ్డి సంకల్పానికి మనందరం సపోర్టుగా నిలవాలన్నారు. ఆయన ధైర్యంగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ మాయమాటలు నమ్మితే నష్టపోతామన్నారు. బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తోందని వ్యాఖ్యలు చేశారు. ఐదేండ్లలో కల్వకుంట్ల కుటుంబం దోపిడి చేసిందని ఆరోపించారు. 2014లో కేసీఆర్ కుటుంబం మొత్తం ఆస్తులు ఎంత.. ఇప్పుడు కేసీఆర్ ఆస్తులు ఎంత.. దమ్ముంటే ప్రజల ముందుకు చర్చకు రావాలని సవాల్ విసిరారు. హరీష్ రావు నిజాయితీ గురించి కేటీఆర్ మాట్లాడుతున్నారు సిగ్గుందా అంటూ మండిపడ్డారు. జనగామలో ప్రతాపరెడ్డి నాయకత్వంలో వచ్చే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని ఆకాంక్షించారు.10 ఏళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించని బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అమాయకులైన నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు, కేటీఆర్‌లు.. బీజేపీ పార్టీలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నారన్నారు. ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ముప్పేట దాడులు చేస్తున్నాయన్నారు. రేవంత్ రెడ్డి సంకల్పానికి ప్రతి ఒక్కరు అండగా నిలబడాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు.కాగా.. శనివారం (అక్టోబర్ 19) గ్రూప్-1 అభ్యర్థులు హైదరాబాద్‌లో నిర్వహించిన చలో సచివాలయం ముట్టడి ర్యాలీలో బండి సంజయ్ పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు ఉద్రిక్తత మధ్య జరిగిన ర్యాలీలో బండి సంజయ్‌ని పోలీసులు అదుపులో తీసుకొని.. బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలించారు. జీవో నెంబర్ 29ని రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరుద్యోగులు ఆందోళనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. వీరి నిరసనకు బండి సంజయ్ మద్దతు తెలిపారు. బండి సంజయ్‌తో పాటు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున అశోక్‌నగర్ చేరుకుని ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కేంద్రమంత్రిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. చివరకు తెలుగు తల్లి ఫ్లైఓవర్ వద్ద బండిసంజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అక్కడి నుంచి బీజేపీ కార్యాలయానికి కేంద్రమంత్రిని తరలించారు.

## మా సోషల్‌మీడియాను ఏదో చేయడం కాదు.. చేతనైతే శాంతి భద్రతలు కాపాడండి.. సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం

**హైదరాబాద్-నవభూమి:** జర్నలిస్టులను అవమానించానంటూ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జర్నలిస్టులకు పెద్ద ఎత్తున రాజకీయ అవకాశాలు కల్పించిందే బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో యాజమాన్యాలు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ.. జర్నలిస్ట్ లు తెలంగాణ కోసం ఎంతో కష్టపడ్డారని.. వారంటే బీఆర్ఎస్ కు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. జర్నలిస్టులను నేను అవమానించానని అంటే అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా అని వ్యాఖ్యానించారు.మా కళ్ల ముందే మూసీ పేరుతో ఇంత పెద్ద కుంభకోణం జరుగుతుంటే ప్రశ్నించవద్దా అని కేటీఆర్ నిలదీశారు. మూసీ విషయంలో మాకన్నా ఎక్కువ పోరాడాల్సిన బాధ్యత మీడియాదే అని స్పష్టం చేశారు. వానాకాలం రైతు భరోసాకు పైసలు లేవు కానీ మూసీలో రూ. లక్షా 50 వేల కోట్లు పోయటానికి డబ్బులున్నాయా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అటు పైన దామగుండంలో, ఇటు కింద అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులిచ్చి మూసీని సంపుతావ్. మళ్లీ మూసీ పునరుజ్జీవనం అంటే ఎలా నమ్మేదని మండిపడ్డారు. ఇంత పెద్ద కుంభకోణం జరుగుతుంటే నేను మాట్లాడవద్దా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంతూరులో ఇద్దరు మహిళా జర్నలిస్టులపై దాడి జరిగితే మిగతా జర్నలిస్టులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఉస్మానియాలో ఒక జర్నలిస్టు పై, శంకర్ అనే జర్నలిస్ట్ పై దాడి జరిగితే ఎందుకు జర్నలిస్ట్ సంఘాలు మాట్లాడలేదని అన్నారు. జర్నలిస్టులు అంటే తనకు ఎంతో గౌరవముందని. భవిష్యత్ లోనూ అలాగే ఉంటుందని స్పష్టం చేశారు..మూసీ లూటీని కవరప్ చేసేందుకు ప్రభుత్వం నానా తంటాలు పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. మూసీ విషయంలో ఎలాంటి లూటీ జరిగిన మేము పోరాటం చేస్తూనే ఉంటామని తెలిపారు. రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్ రహస్య స్నేహితుడు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని మంత్రులు కూల్చేస్తారంటూ బండి సంజయ్ బాధపడిపోతున్నాడని.. పొంగులేటి ఇంటి మీద రైడ్ జరిగి 20 రోజులైనా ఎవరూ మాట్లాడారని విమర్శించారు. కర్ణాటకలో మా ఎమ్మెల్యేలను బీజేపీ కొనుగోలు చేస్తుందని సిద్ధరామయ్య అంటాడు కానీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీజేపీ రహస్య స్నేహం కొనసాగుతుందని విమర్శించారు.కర్ణాటకలో జరిగిన అంత పెద్ద వాల్మీకి స్కామ్‌లో తెలంగాణ కాంగ్రెస్ పెద్దల హస్తం ఉంటే ఇప్పటివరకు ఎందుకు ఒక్క అరెస్టు జరగలేదని కేటీఆర్ ప్రశ్నించారు. అమృత్ స్కాం లో సీఎం బావమరిదికి కాంట్రాక్ట్ ఇచ్చి అవినీతి చేస్తున్నారని నేను కేంద్రమంత్రికి లేఖ రాసిన ఇప్పటికీ స్పందించలేదని తెలిపారు. ఎవరికీ ఎవరు దోస్తులో ప్రజలకు అన్ని తెలుసని అన్నారు. అవసరమైనప్పుడు అన్ని బయటపడుతాయని తెలిపారు.బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఒక్క మత ఘర్షణల సంఘటన కూడా జరగలేదని కేటీఆర్ తెలిపారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి సంఘటనపై ఖండిస్తే లా అండ్ ఆర్డర్ ఇష్యూ అని నా మీద సైబర్ క్రైమ్ వాళ్లు ట్విట్టర్‌కు ఫిర్యాదు చేశారని మండిపడ్డారు.

## కాంగ్రెస్, బీజేపీ నేతలవి రహస్య ఒప్పందాలు: కేటీఆర్



**హైదరాబాద్-నవభూమి:**సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌లు రహస్య మిత్రులని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్ కుర్చీ పోతుంటే బండి సంజయ్‌కు అంత బాధ ఎందుకని ప్రశ్నించారు. బండి సంజయ్ కామెంట్లపై స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలవి రహస్య ఒప్పందాలని.. ఖచ్చితంగా బయటకు వస్తాయని కేటీఆర్ అన్నారు.
ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి వార్షికోత్సవం జరుపుకోవాలని ఎద్దేవా చేశారు. ఇవాళ(సోమవారం) తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... ముత్యాలమ్మ గుడిపై దాడిని తాను ఖండిస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. తాను ట్వీట్ చేసినందుకు సైబర్ క్రైమ్ అధికారులు లేఖ పంపారని అన్నారు. రేవంత్‌రెడ్డి లాంటి దగుల్బాజీ ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరని విమర్శించారు. ఉద్యోగాల కల్పనపై సీఎం రేవంత్ అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. మూసీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ కంటే జర్నలిస్టులే ఎక్కువ ప్రశ్నించాలని కేటీఆర్ అన్నారు.
జర్నలిస్ట్‌లపై బీఆర్ఎస్ పార్టీకు ఎనలేని గౌరవం..రేవంత్ ప్రభుత్వం లక్షన్నర కోట్లు మూసీలో పోద్దామంటే చూస్తూ ఊరుకుందామా? అని నిలదీశారు. లక్షన్నర కోట్లు రేవంత్ జేబులో వేసుకుంటామంటే ఊరుకుంటామా? అని అడిగారు. జర్నలిస్ట్‌లపై బీఆర్ఎస్ పార్టీకి ఎనలేని గౌరవం ఉందని.. ఎన్నడూ తాను జర్నలిస్ట్‌లను అవమానించలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తమకంటే జర్నలిస్టుల పాత్ర ఎక్కువగా ఉందని చెప్పారు. మూసీ కోసం ప్రభుత్వం పెడుతున్న తంటాలు చూస్తుంటే బాధకలుగుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసంబద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం రాష్ట్ర పురోగతికి గొడ్డలి పెట్టు అని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఫిక్స్‌డ్ చార్జీలను రూ.10నుంచి రూ.50కు పెంచాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. ఇప్పటికే కరెంటు కోతలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.ఫాక్స్ కాన్ పరిశ్రమ తరలిపోయింది.."రేవంత్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పరిశ్రమలు తెలంగాణ నుంచి తరలిపోతున్నాయి. విద్యుత్ చార్జీలు పెంచి రూ. 18వేల 500కోట్ల రూపాయల అదనపు భారాన్ని ప్రజలపై ప్రభుత్వం మోపనుంది. చార్జీల పెంపునకు 9ప్రతిపాదనలను కాంగ్రెస్ ప్రభుత్వం విరమమించుకోవాలి. ఇళ్లల్లో వాడుకునే కరెంట్‌కు 300యూనిట్లు దాటితే 10రూపాయలు ఉన్న ఫిక్స్‌డ్ చార్జిను 50రూపాయలు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. పరిశ్రమల అన్నిటినీ ఒకటే కేటగిరి కిందకు తీసుకురావాలనుకోవటం దుర్మార్గం. కాంగ్రెస్ చేతకానితనంతో ఫాక్స్‌కాన్ పరిశ్రమ తెలంగాణ నుంచి తరలిపోయింది. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో విద్యుత్‌లో తెలంగాణ నంబర్ వన్‌గా ఉండేది. ఈనెల 23న ఈఆర్సీ నిర్వహిస్తోన్న పబ్లిక్ హియరింగ్‌కు బీఆర్ఎస్ బృందం హాజరవుతోంది. ప్రభుత్వాన్ని నడిపేవారికి పట్టువిడుపులు ఉండాలి" అని కేటీఆర్ పేర్కొన్నారు.
**సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం...**
"ప్రభుత్వం పట్టుదలకు పోవటంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. రిట్ ఫిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు నిర్ణయం తీసుకునే వరకు ఫలితాలు వెల్లడించవద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. రిట్ పిటిషన్‌పై వేగంగా వాదనలు విని నిర్ణయం తీసుకోమని సుప్రీం హైకోర్టుకు చెప్పింది. జీవో నెంబర్ 29కు వ్యతిరేకంగా హైకోర్టులో అభ్యర్థుల తరుపున కొట్లాడుతాం. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణలో అధికారంలోకి తీసుకువచ్చిందే నిరుద్యోగులు. లోకల్స్ కోసం కేసీఆర్ 95శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చారు. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రమాణికం కాదని చెప్పటం అన్యాయం. జీవో నెంబర్ 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు విఘాతం. గ్రూప్ - 1 అభ్యర్థుల తరుపున సుప్రీంకోర్టులో కేసు వేసిందే బీఆర్ఎస్. కపిల్ సిబల్ లాంటి ప్రముఖ న్యాయవాదిని తాము నియమించాం" అని కేటీఆర్ వెల్లడించారు.

## ఏపీ డిప్యూటీ సీఎంకు సిటీ సివిల్ కోర్టు నోటీసులు



**హైదరాబాద్-నవభూమి:**తిరుమల శ్రీవారి లడ్డూలో ఉపయోగించే కల్తీ నెయ్యి అంశం ఇంకా కాకరేపుతూనే ఉంది. పంది కొవ్వు ఉపయోగించారని తెలిసి శ్రీవారి భక్తులు ఆందోళనకు గురయ్యారు. తిరుపతి లడ్డూపై రాజకీయ నేతలు, పలువురు ప్రముఖులు కామెంట్స్ చేశారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా స్పందించారు. గత పాలక మండలి కల్తీ నెయ్యి ఉపయోగించిందని ఆరోపించారు. పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలతో చాలా మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇదే అంశంపై హైదరాబాద్‌కు చెందిన అడ్వకేట్ ఇమ్మనేని రామారావు సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.భక్తులకే కాదు.. అయోధ్యలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి కూడా తిరుపతి లడ్డూ పంపించారని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. పవన్ చేసిన కామెంట్లతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. తిరుమల లడ్డూ తయారీ కోసం జంతువులు కొవ్వు కలిపారని అనడం దారుణం. ఆ ఆరోపణలకు సంబంధించి ఫొటోలు, వీడియోలను కోర్టు ముందు ఉంచాం. లడ్డూ గురించి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రసారం చేసిన యూట్యూబ్ చానెళ్ల నుంచి ఆ కామెంట్లను తొలగించాలి అని' పిటిషనర్ సిటీ సివిల్ కోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.
హాజరుకండి..తిరుమల లడ్డూకు సంబంధించి ఇమ్మనేని రామారావు వేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి వై రేణుకతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. వచ్చే నెల 22వ తేదీన కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని సమన్లు జారీచేసింది. ఈ అంశంపై పవన్ కల్యాణ్ స్పందించాల్సి ఉంది. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించారని సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో తెలుగు రాష్ట్రాలతో రాజకీయ దుమారం నెలకొంది. ఆ అంశంపై సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ వేయడంతో.. న్యాయస్థానం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సమన్లు జారీ చేసింది.

## తెలుగు రాష్ట్రాల రాజధానులను కలుపుతూ బుల్లెట్ ట్రైన్!

**(1వపేజీ తరువాయి)** రైల్ కారిడార్‌ని తీసుకు రావాలని వెల్లడించారు. హైదరాబాద్, అమరావతి, బెంగళూరు, చెన్నై నగరాలతో ఈ బుల్లెట్ ట్రైన్ కారిడార్ కలవనుంది. దీంతో రీజినల్ కనెక్టివిటీలో విప్లవాత్మకమైన మార్పులు సంభవించి అభివృద్ధి, ఆర్థిక వృద్ధి జరుగుతుంది.
ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ కారిడార్‌కి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ని త్వరలోనే రెడీ చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. డీపీఆర్‌ని రెడీ చేశాక కేంద్ర ప్రభుత్వానికి సబ్మిట్ చేసి హై స్పీడ్ రైల్ కారిడార్‌ని మంజూరు చేయాలని కోరతామన్నారు. 2026లో ఈ ప్రాజెక్టుని మొదలు పెడతామని చెప్పారు. ఈ కారిడార్‌తో దక్షిణాదిన ప్రధాన నగరాలైన హైదరాబాద్, బెంగుళూరు, చెన్నైలకు ట్రాన్స్‌పోర్ట్ సులువు అవుతుంది. గూడ్స్ రవాణాతో పాటు ప్రయాణికులు సైతం సౌకర్యవంతంగా, త్వరగా రాకపోకలు సాగించొచ్చు. దీంతో పాటు ఇండస్ట్రియల్ యాక్టివిటీ బూస్ట్ అవుతుంది. క్రమంగా ఇది రాష్ట్ర ఆర్థిక పురోగతికి దోహదం చేస్తుంది.
**విజయవాడ- హైదరాబాద్ హైవే**
విజయవాడ, హైదరాబాద్ హైవేను ఎనిమిది లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. దీంతో పాటు పోర్టుకి కనెక్టివిటీని అందిస్తూ తెలంగాణలోని డ్రై పోర్టులను లింక్ చేసేందుకు మచిలీపట్నం, హైదరాబాద్ మధ్య మరో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేని ప్రతిపాదించారు.విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యపై కూడా సీఎం చంద్రబాబు నాయుడు క్లారిటీ ఇచ్చారు. ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోందన్నారు. ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.
**కేంద్రం ఫుల్ సపోర్ట్**
రాజధాని అమరావతి చుట్టూ 183 కిలోమీటర్ల పొడవైన ఔటర్ రింగ్ రోడ్డుతో సహా ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం ఫుల్ సపోర్ట్ ఇస్తోందని సీఎం చెప్పుకొచ్చారు. ఇండస్ట్రియల్ కారిడార్స్‌ని డెవలప్ చేయడానికి తీర ప్రాంతం వెంబడి 20 వేల ఎకరాల ఉప్పు భూముల కోసం కేంద్రాన్ని ఆశ్రయించగా ఇప్పటికే 5 వేల ఎకరాలను కేంద్రం మంజూరు చేసింది.

## కేబినెట్ విస్తరణకు మళ్లీ బ్రేక్..

**హైదరాబాద్-నవభూమి:** ప్రమాణస్వీకారం సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌తోపాటు మరో 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. కేబినెట్ విస్తరణ జరుగుతుంది.. ఇక తామంతా మంత్రులం అవుతున్నాం అని కలలు కంటున్న వారికి ఎప్పటికప్పుడు నిరాశలే ఎదురవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు అవుతోంది. కానీ.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మంత్రివర్గం కొలువుదీరలేదు. ప్రమాణస్వీకారం సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌తోపాటు మరో 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి మిగితా మంత్రివర్గాన్ని కూడా త్వరలోనే భర్తీ చేస్తామంటూ ఎప్పటికప్పుడు లీకులు ఇస్తున్నారు. ఇంకా మంత్రివర్గంలో ఆరుగురికి స్థానం ఉంది. దాంతో ఆశావహుల జాబితా కూడా రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. అయితే గత ఆరు నెలలుగా మంత్రివర్గ విస్తరణపై లీకులు వస్తూనే ఉన్నాయి. అందులోనూ ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా ఇక మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం జరిగింది. ఆయన అలా ఇప్పటికి 25సార్లు వెళ్లివచ్చారు. కానీ..ఇంతవరకూ మంత్రివర్గ విస్తరణ అంశం తేలలేదు. ప్రభుత్వం కొలువుదీరాక సంక్రాంతి ముహూర్తం అన్నారు.. ఆ తరువాత ఉగాది అన్నారు.. ఆ తరువాత ఏకాదశి అన్నారు.. వినాయకచవితి అన్నారు.. దసరా అన్నారు.. పండుగలన్నీ కూడా అయిపోయాయి. కానీ.. ఇంతవరకు కొలిక్కిరాలేదు. అయితే.. ఇటీవల నిర్వహించిన హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికలకు ముందే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం జరిగింది. ఆ ఎన్నికలు ముగిశాయి.. ఫలితాలు కూడా వెల్లడయ్యాయి. కొత్త ప్రభుత్వాలు సైతం కొలువుదీరాయి. ఈ క్రమంలో మళ్లీ రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. ప్రధానంగా మంత్రివర్గ విస్తరణ కోసమే ఆయన ఢిల్లీకి వెళ్లినప్పటికీ వారి నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రాలేదు.ఇక ఇప్పుడు మహారాష్ట్ర ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. దాంతో ఎన్నికలకు ముందే మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని అందరూ ఆశలు పెట్టుకున్నారు. కానీ.. తాజాగా అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశాలు విని అందరూ షాక్‌కు గురయ్యారు. ఇప్పటికే హర్యానా ఎన్నికల్లో దెబ్బ తిన్న కాంగ్రెస్ మహారాష్ట్ర ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇక్కడ బీజేపీకి అవకాశం ఇవ్వొద్దని కఠిన దీక్షతో ముందుకు సాగుతోంది. దాంతో అధిష్టానంలోని పెద్దలంతా మహారాష్ట్ర ఎన్నికలపైనే ప్రధాన దృష్టి సారించారు. ఈ క్రమంలో ఇప్పుడే మంత్రివర్గ విస్తరణ వద్దంటూ అధిష్టానం నుంచి రాష్ట్ర నాయకత్వానికి ఇండికేషన్లు వచ్చాయి. దాంతో మరోమారి మంత్రివర్గ విస్తరణ వాయిదాపడింది. అయితే..ఇక్కడ కూడా కాంగ్రెస్ పలు ఈక్వేషన్లను పరిగణలోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మాల్దీవుల్లో ఇక చెల్లేది మన 'యూపీఐ'నే తెలంగాణకు పక్కనే ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర. ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ చేపడితే ఆశావహుల్లో చాలా మందికి అవకాశాలు దక్కకపోవచ్చు. దాంతో వారు అసంతృప్తికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ అసంతృప్తి కాస్త బీజేపీకి అస్త్రంగా మారొచ్చన్న ఉద్దేశంతో వాయిదా వేసినట్లుగానూ తెలుస్తోంది. ముందుముందు మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో జరిగిన అన్యాయంపై కాంగ్రెస్‌ను కార్నర్ చేసే అవకాశాలు ఉన్నాయని.. అందుకే ఇప్పుడు వద్దని రాష్ట్ర నాయకత్వానికి సూచించినట్లు సమాచారం. దీంతో ఆశావహులంతా తమకు మంత్రి పదవి యోగం దక్కేది ఎప్పుడు అని నిరాశ నిస్పృహల్లో ఉండిపోయారు.

## గ్రూప్-1 వాయిదాకు సుప్రీం నో

**(1వపేజీ తరువాయి)**భారతంలో ఏపీని ఎకనామిక్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించారు. ముఖ్యంగా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో అమరావతిని కలుపుతూ హై స్పీడ్ వేయాలంటూ ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అన్ని కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ విధించారు. పరీక్ష గది, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలించారు. హైదరాబాద్ జిల్లాలో 5,613 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 4,896 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 87.23% హాజరైనట్టు ఆర్డీవో జైపాల్ రెడ్డి తెలిపారు.

## త్వరలో కొత్త రేషన్ కార్డుల జారీ

**(1వపేజీ తరువాయి)**తెలంగాణలో ప్రస్తుతం ఫ్యామిలీ డిజిటల్ కార్డులను జారీ చేస్తున్నారు. ప్రతి కుటుంబాన్ని యూనిట్‌గా గుర్తించేందుకు, కుటుంబ యజమానిగా మహిళల్ని గుర్తించి కార్డులను జారీ చేయాలని నిర్ణయించారు.
రేషన్ కార్డుల్లో అర్హులైన కుటుంబ సభ్యుల పేర్లను చేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు పౌరసరఫరాల శాఖ చెబుతోంది. ఉన్న కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చి కార్డులన్నింటిని క్రమబద్ధీకరించిన తర్వాత కొత్త రేషన్ కార్డులను జారీ చేసే యోచనలో ప్రభుత్వం ఉంది.
తెలంగాణలో రేషన్ కార్డులకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. రేషన్ కార్డుల్లో పేర్లను చేర్చాలని కోరుతూ ఇప్పటికే లక్షలాది కుటుంబాలు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నాయి. రాష్ట్రంలో లక్షల కుటుంబాలు మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నాయి.వినియోగంలో ఉన్న రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చడానికి ప్రభుత్వం అనుమతించకపోవడంతో అవన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి.
తెలంగాణలో అన్ని జిల్లాల్లో కలిపి దాదాపు 11.08 లక్షల దరఖా స్తులు పెండింగ్‌లో ఉన్నాయని పౌరసరఫరాల శాఖ లెక్కలు చెబుతున్నాయి. పాత దరఖాస్తులను పరిష్కరిస్తే ప్రతి నెల దాదాపు 9,890 టన్నుల బియ్యం అదనంగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీనికోసం ప్రతి నెల రూ.37.40 కోట్ల భారం పడుతుంది. ప్రతి ఇంటికి డిజిటల్ ఫ్యామిలీ కార్డులను జారీ చేసి రేషన్ కార్డుల్లో ఉన్న సమాచారాన్ని వాటితో అనుసంధానించాలని యోచిసక్తున్నారు. దీనికోసం పూర్తి స్థాయిలో సాఫ్ట్‌వేర్ సిద్ధం చేస్తున్నారు.
డిజిటల్ కార్డు ద్వారా రేషన్ దుకాణాల్లో ప్రతి ఇంటికి ఎంత సరుకులకు అర్హత ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. కార్డులను క్రమబద్ధీకరణ పూర్తైన తర్వాత కొత్త కార్డుల జారీ ప్రక్రియ చేపట్టనున్నారు.

## వైసీపీ అధినేత జగన్ అసెంబ్లీ సమావేశాలకు రావాలి

**(1వపేజీ తరువాయి)**తూ జగన్ అసెంబ్లీ సమావేశాలకు వస్తే ముచ్చటించుకుంటామని అన్నారు. పోలవరం పైన తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ అంచనా వ్యయం రూ. 2,900 కోట్లు అయ్యిందని, ఆ నిధులు విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని, ఈ ఇరిగేషన్ పూర్తి చేసి తాను స్థానిక ప్రజల రుణం తీర్చుకుంటానని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయిన పాత్రుడు అన్నారు. నర్సీ పట్నంలో ఇసుక అక్రమ రవాణాకు మాజీ ఎమ్మెల్యే బినామీలలు కారణమని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరోపించారు.

## వాలంటీర్ హత్యకేసులో మాజీ మంత్రి కుమారుడి అరెస్ట్

**(1వపేజీ తరువాయి)**నమ్మించి దుర్గా ప్రసాద్‌ను కోటిపల్లి రేవు వద్దకు తీసుకెళ్లాడు. వారిని మిగతా వాళ్లు ఫాలో అయ్యారు. రేవు వద్దే దుర్గాప్రసాద్ మెడకు ఉరి బిగించి హత్య చేశారు. ఏం తెలియనట్టు ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు.
**రెండేళ్లుగా ముందుకు సాగని దర్యాప్తు- భార్య ఫిర్యాదుతో కదలిన పోలీసులు**
తన భర్త కనిపించడం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతదేహం లభించడంతో హత్య కేసుగా మార్చారు. అంతే తప్ప విచారణ చేయలేదు. ప్రభుత్వం మారిన తర్వాత మంత్రి వాసంశెట్టి సుభాషను డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసిన దుర్గాప్రసాద్ భార్య న్యాయం చేయాలని వేడుకున్నారు. దీంతో దర్యాప్తు వేగం పెంచిన పోలీసులు ముందు ధర్మేశ్‌ను అరెస్టు చేశారు. అతన్ని విచారించంతో మిగతా వారి గుట్టు విప్పాడు. దీంతో మిగతా వారిని కూడా అరెస్టు చేస్తున్నారు.

## అమరావతికి రూ. 11 వేల కోట్ల హడ్కో రుణం

**(1వపేజీ తరువాయి)**అందువల్లే అతి తక్కువ సమయంలో, అద్భుత రీతిలో గ్రాంట్లు రాబట్టగలిగామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

## వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు.. పవన్ కల్యాణ్ హర్షం


**అమరావతి-నవభూమి:** మచిలీపట్నంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పేరు పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు.దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో ప్రజల్లో స్ఫూర్తి నింపేలా ఆయన మువ్వన్నెల జెండాను రూపొందించి జాతికి అందించారని కొనియాడారు. మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆ మహనీయుడి పేరు పెట్టడం ద్వారా ఆయన ఇచ్చిన స్ఫూర్తి భావితరాలకు అందుతుందని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు సీఎం చంద్రబాబు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు పవన్ ధన్యవాదాలు తెలిపారు.

## వెలిగొండ ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తాం: మంత్రి నిమ్మల

**అమరావతి-నవభూమి:** నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు. వెలిగొండ, హంద్రీ నీవా, పోలవరం, పోలవరం ఎడమ కాల్వ పనులపై సమీక్షించారు.ఈ వారం వెలిగొండ ప్రాజెక్టును సందర్శించి పనులు వేగవంతం చేస్తామన్నారు. హంద్రీనీవా ప్రధాన కాల్వ విస్తరణ, లైనింగ్ పనులకు సంబంధించి అధికారులను మంత్రి ఆరా తీశారు. నవంబర్‌లో పనులు మొదలుపెట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఈఎన్సీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ మంగళవారం 22 । అక్టోబర్ । 2024


## నవంబర్ 1 నుంచి 19 వరకూ ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దు.. పన్నూన్ బెదిరింపు






**న్యూఢిల్లీ-నవభూమి:** కెనడాలో ఉంటున్న ఖలిస్థానీ ఉగ్రవాది నిషేధిత సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) సంస్థ చీఫ్ గురుపత్వంత్ సింగ్ పన్నూన్ మరోసారి తీవ్ర బెదిరింపులకు పాల్పడ్డాడు. నవంబర్ 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని వార్నింగ్ ఇచ్చాడు.భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే నవంబర్ 1 నుంచి 19వ తేదీ వరకూ ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దంటూ ఓ వీడియో సందేశంలో తెలిపాడు. దేశంలో గత కొన్ని రోజులుగా విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పన్నూన్ హెచ్చరికలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.ఇక పన్నూన్ ఇలాంటి హెచ్చరికలు చేయడం ఇది మొదటి సారి కాదు. గతేడాది కూడా నవంబర్ నెలలోనే ఇలాంటి బెదిరింపులే చేశాడు. నవంబర్ 19న ఎయిర్ ఇండియా విమానాల్లో సిక్కులు ప్రయాణించొద్దని సూచించాడు. లేని పక్షంలో మీ ప్రాణాలకు ముప్పు ఉంటుందని హెచ్చరించాడు. 'నవంబర్ 19న ఎయిర్ ఇండియాలో ప్రయాణించవద్దని సిక్కు ప్రజలను కోరుతున్నాం. ఆ రోజు ప్రపంచ వ్యాప్తంగా ఎయిర్ ఇండియాను దిగ్బంధిస్తాం. నవంబర్ 19న ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించవద్దు. లేదంటే మీ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది' అని పేర్కొన్నాడు.

## పిల్లలతో వెళ్తున్న స్కూల్ బస్సు బోల్తా.. విద్యార్థులకు గాయాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** పిల్లలతో వెళ్తున్న స్కూల్ బస్సు ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆ బస్సులోని స్కూల్ విద్యార్థులు గాయపడ్డారు. ఇద్దరు పిల్లల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. రాజస్థాన్‌లోని కోటాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం మధ్యాహ్నం పిల్లలను ఇంటికి తరలిస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో రోడ్డు దిగువకు దూసుకెళ్లి బోల్తా పడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆ స్కూల్ బస్సు వద్దకు చేరుకున్నారు. అద్దాలు పగులగొట్టి అందులోని పిల్లలను బయటకు తెచ్చారు.కాగా, స్కూల్ బస్సులో ప్రయాణించిన సుమారు 50 మంది విద్యార్థులు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. ఒకరు మరణించగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన పిల్లలను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. స్కూల్ బస్సు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
వాస్తవాధీన రేఖ వద్ద పెట్రోలింగ్.. భారత్, చైనా మధ్య కుదిరిన డీల్
%ఝుఖ్రవతీఅ ఘుఝుఝునెష్ట్ర%: వాస్తవాదీన రేఖ వద్ద పెట్రోలింగ్ నిర్వహించే అంశంలో భారతీయ, చైనా అధికారుల మధ్య జరిగిన చర్చలు సఫలమైనట్లు తెలుస్తోంది. పెట్రోలింగ్ అంశంలో ఓ డీల్ కుదిరినట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి తెలిపారు.

## వాస్తవాధీన రేఖ వద్ద పెట్రోలింగ్.. భారత్, చైనా మధ్య కుదిరిన డీల్



**న్యూఢిల్లీ-నవభూమి:** తూర్పు లడాఖ్‌లోని వాస్తవాదీన రేఖ వద్ద పెట్రోలింగ్ నిర్వహించే అంశంలో భారతీయ, చైనా అధికారుల మధ్య జరిగిన చర్చలు సఫలమైనట్లు తెలుస్తోంది. పెట్రోలింగ్ అంశంలో ఓ డీల్ కుదిరినట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి తెలిపారు. రెండు దేశాల సరిహద్దుల మధ్య ఉన్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని వారాల నుంచి చర్చలు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. దీప్‌సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో నిర్వహించే పెట్రోలింగ్ అంశంలో అగ్రిమెంట్ కుదిరినట్లు తెలుస్తోంది. బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు రష్యాలోని కజాన్ సిటీకి మోదీ వెళ్తున్న నేపథ్యంలో.. చైనా, భారత్ సరిహద్దు అంశంలో డీల్ కుదరడం గమనార్హం. వాస్తవానికి ఆ డీల్‌కు సంబంధించి ఇప్పటి వరకు అధికారిక ప్రకటన లేదు. కానీ బ్రిక్స్ సమావేశాల్లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, భారత ప్రధాని మోదీ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

## నో ఫ్లై లిస్టులో బాంబు బెదిరింపు నిందితులు: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ విమానాలకు ఇటీవల బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. బాంబు బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పౌరవిమానయాన శాఖ మంత్రి కే రామ్మో హన్ నాయుడు తెలిపారు. నిందితులను నో ఫ్లై లిస్టులో చేర్చనున్నట్లు ఆయన వెల్లడించారు. గడిచిన వారం రోజుల్లో భారతీయ విమానాలకు సుమారు వందకుపైగా బాంబు బెదిరంపు కాల్స్ వచ్చాయి.ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. పౌరవిమానయాన భద్రతకు చెందిన రూల్స్‌లో సవరణలు తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. సివిల్ ఏవియేషన్ యాక్టు 1982 చట్టాన్ని కూడా మార్పు చేయనున్నట్లు చెప్పారు. విమానాలకు వస్తున్న బాంబు బెదిరింపుల విషయంలో కేంద్ర హోంశాఖతో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూర్టీ(బీసీఏఎస్) నిరంతరం టచ్‌లో ఉన్నట్లు ఆయన చెప్పారు.

## మణికట్టు కోసుకున్న ప్రియురాలు.. వీడియో చూసి స్పృహతప్పి ప్రియుడు మృతి

**న్యూఢిల్లీ-నవభూమి:** మణికట్టు కోసుకున్న వీడియోను ప్రియురాలు పంపింది. అది చూసి ఆమెను ఆసుపత్రికి తరలించిన ప్రియుడు అక్కడ స్పృహతప్పి మరణించాడు.ఆ వ్యక్తి గుండెపోటు వల్ల చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో 30 ఏళ్ల అరుణ్ నందా స్నేహితురాలు చేతి మణికట్టుపై కత్తితో కోసుకున్నది. ఈ వీడియోను అతడికి పంపింది.కాగా, ఈ వీడియో చూసి అరుణ్ షాక్ అయ్యాడు. అతడు వెంటనే ఆమె ఉన్న ఆనంద్ విహర్ ప్రాంతానికి చేరుకున్నాడు. ప్రియురాలిని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. అక్కడ ఆమె పరిస్థితి చూసి అరుణ్ స్పృహతప్పి పడిపోయాడు. పరిశీలించిన డాక్టర్లు అతడు మరణించినట్లు నిర్ధారించారు.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ హాస్పిటల్‌కు చేరుకున్నారు. అరుణ్ గుండెపోటు వల్ల చనిపోయినట్లు అనుమానిస్తున్నారు. అతడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ప్రైవేటు మద్యానికి 'అధికారిక' తూట్లు.. !



**విజయవాడ-నవభూమి:** రాష్ట్రంలో మద్యం వ్యాపారాన్ని ఏమాత్రం వినిపించుకోవడం లేదు. తమకు వాటాలు ప్రభుత్వ పరిధి నుంచి తప్పించిన కూటమి సర్కారు.. తద్వారా తమకు రిలీఫ్ దక్కిందని భావించింది. అంతేకాదు.. సర్కారు మద్యం వ్యాపారం చేయడాన్ని గతంలో తప్పుబట్టిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు తీసుకున్ననిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. అప్లికేషన్ల ద్వారా 2 వేల కోట్లు, వ్యాపారం ద్వారా 3 వేల కోట్లు ప్రస్తతం చేతికి అందడంతో ప్రభుత్వ పనులు కూడా సజావుగా సాగేందుకు ఉపయోగపడుతున్నాయి. ఇంత వరకు బాగానే ఉంది. కానీ, అసలు సమస్య.. ఇంకా తొలిగిపోలేదు. పదే పదే చంద్రబాబు చెబుతున్నా.. తమ్ముళ్లు కావాల్సిందేనని అధికారికంగానే హుకుం జారీ చేస్తున్నారు. సొంత నేతలపైనా వారు పెత్తనం చేస్తున్నారు. అవును తమ్ముడు.. నువ్వు వ్యాపారం చేసుకో. సంపాయించుకో. ఎవరు వద్దన్నారు. మాది మాకు ఇవ్వమనే కదా అడుగుతున్నాం. నీ వ్యాపారానికి అడ్డొచ్చామా? చెప్పు. అని చాలా లౌక్యంగా వాటాలను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారు. పోనీ.. ఇదేమన్నా 5 రూపాయాలు, పది రూపాయలుగా ఉంటే.. వ్యాపారాలు చేసుకునేవారు ఇచ్చేందుకు రెడీగానే ఉన్నారు. కానీ, 30 శాతం వాటాలు కావాలని పట్టుబడుతున్నారు. ఇస్తే సరే.. లేకపోతే నీఇష్టం అని మొహం మీదే చెబుతున్నారు. సీమలోని కర్నూలు, అనంతపురం ఈ జాబితాలో ముందున్నాయి. ఇక, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనూ తమ్ముళ్లు ఎక్కడా ఆగడం లేదు. పైగా.. వాటాలు ఇవ్వలేక పోతే.. లైసెన్సులు ఇచ్చేయాలని.. ఫీజు ఇస్తామని కూడా ఆఫర్లు ఇస్తున్నారు. మరీ ముఖ్యంగా విజయవాడలో అయితే.. కీలకమైన గాంధీనగర(సెంట్రల్ నియోజకవర్గం)లో ఇప్పటి వరకు ఒక్క షాపు తెరవలేదు. ఈ ఏరియాలో మొత్తం 18 షాపులకు ప్రభుత్వం లైసెన్సు ఇచ్చింది. ఇది జరిగి.. ఐదు రోజులు అయినా.. ఇప్పటి వరకు ఒక్క దుకాణానికి కూడా కొబ్బరికాయ కొట్టలేదంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక, గుంటూరులోని ప్రధాన నియోజకవర్గంలో(తొలిసారి గెలిచిన ఎమ్మెల్యే) 22 షాపులకు లైసెన్సులు తెచ్చుకుంటే.. కేవలం మూడు మాత్రమే ప్రారంభమయ్యాయి. దీనిని బట్టి.. అధికార నేతల ఒత్తిళ్లు.. ప్రైవేటు మద్యంపై ఎలా ఉన్నాయనేది స్పష్టమవుతోంది.

## కొత్తగా పెళ్లి చేసుకునే జంటలు..
# 16 మంది పిల్లల్ని కనాలి: ఎంకే స్టాలిన్




**చెన్నై-నవభూమి:** కొత్తగా పెళ్లి చేసుకునే జంటలు ఎక్కువ మంది పిల్లల్ని కనాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కోరారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా 16 రకాల సంపదలకు బదులుగా 16 మంది పిల్లలను కనాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ఆ రాష్ట్ర హిందూ మత, ధర్మాదాయ శాఖ సోమవారం సామూహిక వివాహ కార్యక్రమం నిర్వహించింది. సీఎం స్టాలిన్ సమక్షంలో 31 జంటలకు వివాహం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్తగా పెళ్లైన జంటలు ఎక్కువ మంది పిల్లలను కనాలని సూచించారు. 16 మంది పిల్లలను కనాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉందన్నారు.
కాగా, పూర్వ కాలంలో కొత్తగా పెళ్లైన జంటలు 16 రకాల సంపదలు పొందాలని పెద్దలు ఆశీర్వదించేవారని సీఎం స్టాలిన్ గుర్తు చేశారు. 'మీకు 16 కలిగి సుభిక్షంగా జీవించాలని పెద్దలు కోరుకునేవారు. అంటే 16 మంది పిల్లలు కాదు, 16 రకాల సంపదలను సూచిస్తుంది. వీటిని 'ఆవు, ఇల్లు, భార్య, పిల్లలు, విద్య, జిజ్ఞాస, జ్ఞానం, క్రమశిక్షణ, భూమి, నీరు, వయస్సు, వాహనం, బంగారం, ఆస్తి, పంట, ప్రశంసలు' అని రచయిత విశ్వనాథన్ తన పుస్తకంలో పేర్కొన్నారు' అని తెలిపారు.మరోవైపు పెళ్లైన కొత్త జంటలను 16 రకాల సంపదలు పొందాలని ఇప్పుడు ఎవరూ ఆశీర్వదించడం లేదని స్టాలిన్ అన్నారు. తగినంత సంతానం కలిగి సుఖంగా జీవించాలని మాత్రమే అనుగ్రహిస్తారని చెప్పారు. అయితే పార్లమెంటరీ నియోజక వర్గాలను తగ్గించే అవకాశం ఉన్నదని తెలిపారు. 'మీరు ఆశ్చర్యపోయేలా 16 మంది పిల్లలను మనం కలిగి ఉండాలన్న పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ విషయాన్ని మరచిపోవద్దు' అని అన్నారు.కాగా, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఇటీవల ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. జనాభా సమతుల్యతపై వృద్ధాప్య జనాభా ప్రభావంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కుటుంబాలు ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉండాలని చంద్రబాబు కోరారు. ఇద్దరు లేదా అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న వ్యక్తులు మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి అనుమతించే చట్టాన్ని తెచ్చేందుకు తమ ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నదని వెల్లడించారు.

## మోడీపై బీబీసీ డాక్యుమెంటరీ...
# సుప్రీంలో కీలక అప్ డేట్!




**న్యూఢిల్లీ-నవభూమి:** బీబీసీ డాక్యుమెంటరీ "ఇండియా: మోడీ క్వశ్చన్ " సిరీస్ ఓ హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. 2002 గుజరాత్ అల్లర్ల ఆధారంగా రెండు ఎపిసోడ్ ల డాక్యుమెంటరీ రూపొందించబడింది. అయితే... దీనిపై కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో ఈ నిషేధంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ సమయంలో విచారణ వాయిదా పడింది.
అవును... బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ "ఇండియా: మోడీ క్వశ్చన్" పై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేదాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఇందులో భాగంగా... 2025 జనవరికి వాయిదా వేసింది. కేంద్రం ఇచ్చిన కౌంటర్ అఫిడవిట్ ను ఇంకా నమోదు చేయకపోవడంతో ధర్మాసనం ఈ కేసును వచ్చే ఏడాదికి వాయిదా వేసింది.ఈ సందర్భంగా... కేంద్రం తరుపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేస్తామని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ లతో కూడిన ధర్మాసనానికి తెలిపారు.కాగా... 2002 గుజరాత్ అల్లర్లు దేశంలో ఎంత సంచలనంగా మారాయనేది తెలిసిన విషయమే. ఈ అల్లర్లలో సుమారు వెయ్యి మందికి పైగా మరణించగా.. సుమారు లక్ష మందికి పైగా ప్రజలు నిరాశ్రయులైనట్లు చెబుతారు! దీంతో.. ఈ అల్లర్ల ఆధారంగా రెండు ఎపిసోడ్ ల డాక్యుమెంటరీ రూపొందించబడింది! ఇది 2023 జనవరిలో ప్రసారం కావాల్సి ఉంది. అయితే.. ఈ డాక్యుమెంటరీని ప్రధాని మోడీని కించపరిచే విధంగా ఉందని భారత్ లో విడుదల చేయకుండా కేంద్రం నిషేధం విధించింది. దీనికి సంబంధించిన లింక్స్ ను షేర్ చేసుకునే సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లోనూ బ్లాక్ చేసింది!

## జమ్మూకశ్మీర్ ఎప్పటికీ పాకిస్థాన్‌లో భాగం కాదు..
# ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ఫరూక్ అబ్దుల్లా



**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్మూకశ్మీర్ లోని గందర్‌బల్ జిల్లాలో ఆదివారం జరిగిన ఉగ్రదాడిని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు. పాక్ ఉగ్రవాదాన్ని భారత్‌లోకి ఎగదోయడాన్ని ఆపేయాలని హెచ్చరించారు. ఢిల్లీతో సత్సంబంధాలు కావాలంటే ఉగ్రవాద చర్యలకు పాక్ స్వస్తి పలకాలని హితవు పలికారు.సోమవారం శ్రీనగర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'భారత్‌తో సత్సంబంధాలు కావాలంటే.. ఉగ్రవాదానికి ముగింపు పలకాలని నేను పాకిస్థాన్ నాయకత్వానికి చెప్పాలనుకుంటున్నాను. జమ్మూకశ్మీర్ ఎప్పటికీ పాకిస్థాన్‌లో భాగం కాదు. కశ్మీర్ ప్రజలుగా మేం గౌరవంగా బతికి.. విజయం సాధిస్తాం. 75 ఏళ్లుగా ఉగ్రవాదం లేని పాకిస్థాన్‌ను సృష్టించలేకపోతే.. ఇప్పుడు అది ఎలా సాధ్యం అవుతుంది? ఉగ్రవాదాన్ని అంతం చేసే సమయం వచ్చింది.లేకపోతే ఫలితాలు చాలా తీవ్రంగా ఉంటాయి. ఇలా అమాయక ప్రజలను చంపితే చర్చలు జరుగుతాయా..? ఈ దాడి చాలా దురదృష్టకరం. వలస వచ్చిన పేద కార్మికులు, ఒక వైద్యుడు తమ ప్రాణాలను కోల్పోయారు. దీని వల్ల ఉగ్రవాదులకు ఏం లాభం చేకూరుతుంది..? వారు కశ్మీర్‌ను పాకిస్థాన్‌లా మార్చాలని భావిస్తున్నారా.. ? కానీ, మేము ఉగ్రవాదాన్నే అంతం చేయడానికి ప్రయత్నిస్తున్నాం. తద్వారా మేము కష్టాల నుండి ముందుకు సాగొచ్చు' అని ఫరూక్ అబ్దుల్లా అన్నారు.కాగా, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. వలస కార్మికులే లక్ష్యంగా మళ్లీ కాల్పులకు తెగబడ్డారు. ఆదివారం సాయంత్రం గందేర్‌బల్ జిల్లా గగన్‌గిర్ వద్ద నిర్మాణరంగ కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఒక వైద్యుడు, మరో ఆరుగురు వలస కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పలువురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. రెండు రోజుల క్రితం కూడా సోఫియాన్ జిల్లాలో ఓ బీహారీ కార్మికుడ్ని ఉగ్రవాదులు కాల్చిచంపారు. తాజా ఘటనను సీఎం ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిరాయుధులైన అమాయక పౌరుల్ని హత్య చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## దేశ రాజధాని ఢిల్లీలో దారుణంగా పడిపోయిన గాలి నాణ్యత..!

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని నగరం ఢిల్లీలో గాలి నాణ్యత దారుణంగా పడిపోతున్నది. సోమవారం ఉదయానికి ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 349కి పడిపోయింది. దాంతో కాలుష్య నియంత్రణ మండలి ఈ పరిస్థితిని 'వెరీ పూర్ కేటగిరిగా వర్గీకరించింది. వాయు కాలుష్యం కారణంగా నగరంపై దట్టంగా పొగ మంచు కమ్మి ఉంటోంది. దాంతో ఉదయం పూట వాహనదారులు రోడ్లపై విజిబిలిటీ సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గాలి నాణ్యతలు క్షీణించడంతో ఢిల్లీ వాసులు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ సమస్యలు తీవ్రంగా పెరిగాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే బాణాసంచా వినియోగం, తయారీపై ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ప్రతి ఏడాది శీతాకాలంలో చల్లదనం కారణంగా ఢిల్లీలో గాలి నాణ్యత దెబ్బతింటున్నా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం లభించడంలేదు.

## కంబాలా రేస్‌ను ఆపండి : కర్నాటక హైకోర్టును కోరిన పెటా



**బెంగుళూరు-నవభూమి:** కర్నాటకలో జరిగే కంబాలా రేసింగ్( పోటీలను నిలిపివేయాలని కోరుతూ ఇవాళ రాష్ట్ర హైకోర్టును పెటా ఆశ్రయించింది. అక్టోబర్ 25వ తేదీన బెంగుళూరులో ఈ ఈవెంట్ జరగాల్సి ఉన్నది. ఆ రేస్‌ను ఆపేయాలని పిల్ వేశారు. జస్టిస్ ఎన్వీ అంజారియా, జస్టిస్ కేవీ అరవింద్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పిల్ తరపున సీనియర్ న్యాయవాది ధ్యాన్ చిన్నప్ప వాదించారు.దక్షిణ కన్నడ జిల్లాల్లో కంబాలా దున్నపోతల ఈవెంట్‌ను ఆర్గనైజ్ చేయడం అక్కడి సాంప్రదాయం. ఆ ఈవెంట్‌ను నిర్వహించేందుకు బెంగుళూరుకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన దున్నలను తీసుకువస్తారని చిన్నప్ప తన పిటీషన్‌లో వాదించారు. ఈ వెంట్‌ను నిర్వహించడమంటే.. జంతువుల్ని క్రూరంగా హింసించడమే అవుతుందని చిన్నప్ప కోర్టుకు తెలిపారు.ఈ ఏడాది జూలైలోనే పిల్ వేశామని, కానీ తమ కేసు లిస్టింగ్ కాలేదని పెటా తెలిపింది. జల్లికట్టు, కంబాలా లాంటి రేసులను నిర్వహించుకునేందుకు గత మే నెలలో సుప్రీంకోర్టు క్లియరెన్స్ ఇచ్చిన విషయం తెలిసిందే.

## తిరుమల శ్రీవారి ఆలయంపై చక్కర్లు కొట్టిన హెలికాప్టర్



**తిరుపతి-నవభూమి:** తిరుమల కొండపై సోమవారం ఉదయం ఓ హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. శ్రీవారి ఆలయానికి సమీపం నుంచే హెలికాప్టర్ వెళ్లడం తీవ్ర కలకలం రేపుతోంది. ఆగమ శాస్త్రం ప్రకారం.. తిరుమల కొండపై విమానాలు, హెలికాప్టర్లు ఎగరడం నిషిద్ధం. కానీ నిబంధనలకు విరుద్ధంగా కొండపై చాలా సార్లు విమానాలు, హెలికాప్టర్లు ఎగిరిన ఘటనలు ఇటీవలే అనేకం వెలుగు చూశాయి.తాజాగా మరోసారి అలాంటి ఘటనే చోటు చేసుకోవడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ హెలికాప్టర్ ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లిందనేదానిపై టీటీడీ అధికారులు ఆరా తీస్తున్నారు. నో ఫ్లై జోన్‌గా ఉన్న తిరుమల కొండపై హెలికాప్టర్ వెళ్లడంపై ఏవియేషన్ అధికారులకు టిటిడే అధికారులు ఫిర్యాదు చేశారు.

## బెంగళూరును ముంచెత్తిన భారీ వర్షం.. పాఠశాలలకు సెలవు



**న్యూఢిల్లీ-నవభూమి:** కర్ణాటక రాజధాని బెంగళూరు ను గత రెండు రోజులుగా భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. సోమవారం ఉదయం కూడా నగరంలో కుండపోత వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం ఇదే రీతిలో కొనసాగితే లోతట్టు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.మరోవైపు నేడు బెంగళూరులో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించింది . అదేవిధంగా పలు కంపెనీలు ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం అవకాశం కల్పించాయి.

## జమ్ముకశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం వెనుక లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ప్రమేయం



**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్ముకశ్మీర్ లోని గందర్‌బల్ జిల్లాలో ఆదివారం జరిగిన ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ఉన్నట్లు తెలిసింది. ఈ దాడికి లష్కరే ఉగ్ర సంస్థకు చెందిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ' బాధ్యత వహించినట్లు జాతీయ మీడియా పేర్కొంది. టీఆర్ఎఫ్ చీఫ్ షేక్ సజ్జాద్ గుల్ ఈ దాడికి ప్రధాన సూత్రధారి అని, అతడి ఆదేశానుసారం ప్రకారమే ఈ దాడులకు పాల్పడినట్లు సదరు కథనాలు నివేదిస్తున్నాయి. కాగా, టీఆర్ఎఫ్ కశ్మీర్‌లో చురుగ్గా ఉంది. గత సంవత్సర కాలంలో కశ్మీరీ పండిట్‌లు, సిక్కులు, స్థానికేతరులను లక్ష్యంగా చేసుకొని వరుస దాడులకు పాల్పడుతోంది.కాగా, జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. వలస కార్మికులే లక్ష్యంగా మళ్లీ కాల్పులకు తెగబడ్డారు. ఆదివారం సాయంత్రం గందేర్‌బల్ జిల్లా గగన్‌గిర్ వద్ద నిర్మాణరంగ కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఒక వైద్యుడు, మరో ఆరుగురు వలస కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పలువురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. రెండు రోజుల క్రితం కూడా సోఫియాన్ జిల్లాలో ఓ బీహారీ కార్మికుడ్ని ఉగ్రవాదులు కాల్చిచంపారు. తాజా ఘటనను సీఎం ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిరాయుధలైన అమాయక పౌరుల్ని హత్య చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



## నక్సల్ సమస్యకు పరిష్కారమెలా?

నక్సలైట్లపై పోరులో తన విజయాలను కేంద్రం ఇటీవల చాలా బిగ్గరగా ప్రకటిస్తోంది. కర్కశంగా మాట్లాడుతోంది. యుద్ధ సమాప్తికి చేరువయ్యామని కూడా గట్టిగా చెప్పుతోంది. హతులు, అరెస్టయినవారు, లొంగిపోయినవారి విషయమై కేంద్రం ఏకరువుపెడుతున్న గణాంకాలు ఉత్తేజకరంగా ఉన్నప్పటికీ నక్సలైట్ సమస్యను అవి పరిష్కరించగలవా అన్నది ప్రశ్నార్థకమే. ఈ నెల 7న నక్సల్ ప్రభావిత రాష్ట్రాల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో 85 శాతం వామపక్ష తీవ్రవాదులను, మావోయిస్టు పార్టీ అగ్రనాయకులు 14 మందిని నిర్మూలించామని వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటికే 237 మంది మావోయిస్టులు హతమయ్యారని, 812 మందిని అరెస్ట్ చేశామని, 732 మంది లొంగిపోయారని ఆయన తెలిపారు నక్సలైట్ల హింసాకాండ 2014-24 సంవత్సరాల మధ్య, 2004-14 సంవత్సరాల మధ్య కాలంతో పోలిస్తే 53 శాతం తగ్గిందని అమిత్ షా చెప్పారు.నక్సలైట్ల ఉద్యమం కచ్చితంగా వెనుకంజలో పడింది. అక్టోబర్ 4న బస్తర్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టు కార్యకర్తలు హతమవడం వారికి కోలుకోని నష్టమే. మార్చి 2026 నాటికల్లా మావోయిస్టు తీవ్రవాద కంటక భూతం నుంచి దేశాన్ని విముక్తం చేస్తామని కేంద్ర హోం మంత్రి తెలిపారు. 2010లోను, అప్పటి కేంద్ర హోంమంత్రి పి. చిదంబరం నక్సలైట్ల సమస్యను రాబోయే మూడేళ్లలో అధిగమించగలుగుతామని చెప్పడం గమనార్హం. చిదంబరం తడబడిన చోట అమిత్ షా సఫలమవుతారా? ఏ పరిస్థితులు నక్సలైట్ల ప్రభావ ప్రాబల్యాలకు కారణమవుతున్నాయనే విషయమై సమగ్ర అవగాహన కొరవడిన దృష్ట్యా పై ప్రశ్నకు ఇదమిత్థమైన సమాధానమివ్వడం కష్టం.గత ఆగస్టు 24న నక్సలైట్ల ప్రభావిత రాష్ట్రాల సమావేశానికి అధ్యక్షత వహించిన అమిత్ షా మాట్లాడుతూ వామపక్ష తీవ్రవాదాన్ని నిర్దాక్షిణ్యంగా తడిచిపెట్టాల్సిన సమయమాసన్నమయిందని అన్నారు. దృఢ సంకల్పం ప్రశస్తమే కాని మన సొంత ప్రజలతో కనికరం లేని రీతిలో వ్యవహరించడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. వామపక్ష తీవ్రవాదాన్ని చావుదెబ్బ తీయడంలో సఫలమయినట్టు భారత రాజ్య వ్యవస్థ ఇంతకు ముందు రెండుసార్లు విశ్వసించింది. తొలుత 1972లో చారు మజుందార్ మరణించిన తరువాత, రెండోసారి 1990ల నడిమి కాలంలో కొండపల్లి సీతారామయ్య నాయకత్వం బలహీనపడిన తరువాత. అయితే ఈ రెండు సందర్భాలలోను నక్సలైట్ ఉద్యమం మరింత శక్తితో, మరింత చురుగ్గా పునర్ విజృంభించింది.ఒక సంక్లిష్ట సమస్య పట్ల మన దృక్పథంలోని మౌలిక లోపాలను అక్టోబర్ 7 సమావేశం బయల్పరిచింది. సత్వర సత్ఫలితాలను సాధించేందుకు కేంద్ర హోం శాఖ భద్రతా దళాలపై పెద్ద ఎత్తున ఆధారపడుతోంది. కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సిఎపిఎఫ్) తనకు అప్పగించిన బాధ్యత నిర్వహణలో సమర్థంగా పనిచేస్తోంది. అయితే ఆ భద్రతా దళాలు చేయగలిగేదానికి ఒక పరిమితి ఉన్నది. భద్రతాదళాలు ఒకసారి ఒక ప్రాంతంలో నక్సల్స్‌ను ఏరిపారేసిన తరువాత, అక్కడి గిరిజనుల జీవితాలను మెరుగుపరిచే సదుపాయాలను అభివృద్ధిపరచడం ప్రభుత్వ బాధ్యత. దురదృష్టవశాత్తు ఇదే జరగడం లేదు. ఫలితంగా ఆ ప్రాంతాలను నక్సలైట్లు పునరాక్రమించుకుంటున్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకు అవసరమయిందేమిటి? సమస్య పరిష్కారానికి సమస్త ప్రభుత్వ విభాగాల సమష్టి సమన్వయ కృషి (హోల్ ఆఫ్ గవర్నమెంట్ అప్రోచ్). సరిగ్గా ఇవే కనిపించడం లేదు. మరో ముఖ్య లోపం రాష్ట్ర పోలీసు దళాలు సిఆర్‌పిఎఫ్‌కు సహాయక పాత్ర మాత్రమే వహించడం. అలా కాకుండా నక్సలైట్ల వ్యతిరేక పోరులో రాష్ట్ర పోలీసులు అగ్రస్థానంలో ఉండాలి. రాష్ట్ర పోలీసులు భూమి పుత్రులు. తాము పనిచేస్తున్న ప్రాంతం పట్ల వారికి సమగ్ర అవగాహన ఉంటుంది. అలాగే అక్కడి ప్రజల గురించి కూడా. కనుక నక్సల్ వ్యతిరేక పోరాటాలు ప్రారంభించేందుకు వారు మెరుగైన యోగ్యతలు కలిగివుంటారు. అయితే రాష్ట్రాల ప్రతినిధులు మరిన్ని కేంద్ర భద్రతా దళాలు కావాలని అభ్యర్థించడం నిరుత్సాహం కలిగిస్తోంది.అభివృద్ధి సాధనకు ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. ఇక్కడ ఒక హెచ్చరిక చేయవలసిన అవసరం ఉన్నది. అభివృద్ధి అనేది గిరిజనులకు మౌలిక అవసరాలు తీర్చుతూనే వారి సంప్రదాయ జీవనశైలిని చిందరవందర చేయకూడదు. ఇది చాలా ముఖ్యం. స్థానిక హస్తకళలను ప్రోత్సహించాలి. గిరిజన కళలు, సంస్కృతి, భాషలను అభివృద్ధిపరచాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పవచ్చు. అయితే అడవుల విధ్వంసానికి, ఆదివాసీలు నిర్వాసితులు కావడానికి దారితీసే మెగా ప్రాజెక్టుల నిర్మాణాన్ని అనుమతించకూడదు. ఆ ప్రాజెక్టుల వల్ల ఆదివాసీలు తమ భూములను కోల్పోవలసివస్తుంది. భూముల నుంచి దూరమయిన ఆదివాసులు అశాంతికి లోనవుతారు. పర్యావరణ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం ఏప్రిల్ 1, 2018 - మార్చి 31, 2023 మధ్య 88,903 హెక్టార్ల అటవీ భూమి అటవీయేతర ప్రయోజనాలకు మళ్లించబడింది. భూమిని కోల్పోవడమనేది గిరిజనులకు చాలా బాధాకరమైన విషయం. 'గిరిజనులు పూర్తిగా అలసిపోయారు, నిరుపేదలుగా కునారిల్లుతున్నారు, తీవ్ర మనోవ్యాకులతకు గురవుతున్నారు' అని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నివేదిక ఒకటి పేర్కొంది.

# ఆకలి.. అవమానం!



ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశం స్థానం కాస్తంత మెరుగుపడినందుకు సంతోషించాలో, పరిమాణంలోనూ, ఆర్థికంగానూ చిన్నవైన పొరుగుదేశాలతో పోల్చితే బాగా వెనుకబడి ఉన్నందుకు బాధపడాలో తెలియడం లేదు. శ్రీలంక, నేపాల్, మయన్మార్, బంగ్లాదేశ్‌లు ఈ సూచీలో భారత్‌కంటే మెరుగ్గా ఉన్నాయి. 127దేశాల జాబితాలో భారత్ ప్రస్తుతం 105వ స్థానంలో ఉంది. గత ఏడాది 125దేశాల్లో 111వస్థానంలో, అంతకుముందు 107లోనూ ఉన్నందున ప్రస్తుతానికి స్థానం కాస్తంత మెరుగుపడినట్టే. కానీ, తీవ్రమైన ఆకలిబాధ చవిచూస్తున్న దేశంగా ముద్ర పడటం అవమానకరం. పదేళ్ళలో దేశం అద్భుతంగా అభివృద్ధి చెందిందనీ, జీడీపీ హెచ్చిందనీ, అతిపెద్ద ఆర్థికవ్యవస్థ పరుగుపందెంలో ముందంజలో ఉన్నదని ప్రచారం చేసుకుంటున్న మన పాలకులను ఇటువంటి నివేదికలు కచ్చితంగా కలవరపెడతాయి. వాటిని విదేశీకుట్రగా ముద్రవేయడం, తప్పులతడక అంటూ తీసిపారేయడం వారికి ఎంతో సులువు.

ఆకలిబాధ ఆందోళనకర స్థాయిలో ఉన్న దేశాల్లో మనది కూడా ఒకటి. మరోలా చెప్పుకోవాలంటే, ఆ లెక్కన పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల సరసన భారత్ నిలిచింది. పోషకాహారలోపం, శిశుమరణాలు ఇత్యాది ప్రాతిపదికలమీద ఆకలిబాధను లెక్కగట్టే ఈ నివేదిక భారత్‌లో ఉన్న తీవ్రమైన పరిస్థితులను లోతుగా ప్రస్తావించింది. దాదాపు 14శాతం మంది పోషకాహారలోపాన్ని ఎదుర్కొంటున్నారు, ఐదేళ్ళలోపు పిల్లల్లో మూడో వంతుకంటే ఎక్కువమంది వయసుకు తగ్గ ఎత్తు ఎదగలేదు, సుమారు 19శాతం మంది ఎత్తుకు తగ్గబరువు లేరు. ఐదేళ్ళు నిండకుండానే కన్నుమూస్తున్న పిల్లల మూడుశాతం వరకూ ఉన్నారు. నాలుగు కీలకమైన అంశాలను తీసుకొని, పోషకాహారలోపం, శిశుమరణాలకు మూడోవంతు విలువ, మిగతా రెండింటికీ ఆరోవంతు విలువ ఇస్తూ మొత్తం స్కోరు లెక్కగట్టే ప్రక్రియలో భారత్ 27.3 పాయింట్లు దక్కించుకుంది. పోషకాహారం మాట పక్కనబెడితే, ఆహారం అందుబాటులో ఉండటమన్నది కూడా ఒక సమస్య అని ఈ నివేదిక తెలియచెబుతోంది. ఆర్థికసంక్షోభంలో కూరుకుపోయి అప్పులకోసం వెంపర్లాడుతున్న శ్రీలంక, రాజకీయ సంక్షోభంలో మునిగిన బంగ్లాదేశ్, నలుదిక్కులా పోరాటాలతో, అంతర్యుద్ధంతో తీసుకుంటున్న మయన్మార్ వంటి దేశాలు మనకంటే ఎంతో మెరుగైన స్థానంలో ఎలా నిలవగలిగాయన్నది అసలు ప్రశ్న. పౌష్టికాహారలోపం ఎదుర్కొంటున్న ప్రజల సంఖ్య ప్రపంచస్థాయిలో కూడా పెరుగుతున్నదని, యుద్ధాలు, అంతర్యుద్ధాలు, వలసలు, వాతావరణ మార్పులు వంటివి ప్రపంచ ఆకలిసూచీ స్కోరును పెంచేస్తున్నాయని ఈ నివేదిక అంటోంది.

గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌ను భారతదేశ పాలకులు ఒప్పుకోకపోవడం కొత్తేమీ కాదు. లోపభూయిష్టమైన పద్ధతుల్లో, విధానాల్లో ఈ లెక్కలు కడుతున్నారని, కొద్దిమందిని నమూనాగా తీసుకొని, ఆకలిని దేశవ్యాప్తంగా వర్తింపచేస్తున్నారని మన ప్రభుత్వం వాదన. ఈ నివేదికలో దేశాలన్నింటికీ వర్తించిన కొలమానాలే తప్ప మనకు వేరు లెక్కలంటూ ఏమీ ఉండవు. పైగా, నివేదిక తయారీలో వాడిన వివరాలు, గణాంకాలన్నీ ప్రపంచ ఆరోగ్యసంస్థ, యునిసెఫ్ తదితర ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల నుంచి సేకరించినవో, అవి ప్రచురించిన నివేదికలనుంచి తీసుకున్నవో అవుతాయి. గత నివేదికలను ప్రభుత్వం తిరస్కరించినప్పుడు కూడా భారత ప్రభుత్వ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేల వంటివి ఈ చేదునిజాలను ముందే చెప్పిన విషయాన్ని విపక్షాలు, మీడియా గుర్తుచేశాయి కూడా.

గత కొన్ని దశాబ్దాలుగా భారత్ స్కోరు మెరుగుపడినప్పటికీ, దేశంలో ఇంకా ఆకలికేకలు తగ్గలేదని ఈ సూచీ చెబుతున్నది. అంతర్జాతీయ సమాజం ముందు తలవంపులు తెచ్చే ఇటువంటి నివేదికలను తిరస్కరించడానికే పాలకులు ఉత్సాహపడటం సహజం. ఒప్పుకోనంత మాత్రాన నిజాలు అబద్ధాలు కావు. ప్రభుత్వం ఆధ్వర్యంలో సాగే సర్వేలు, వివిధ ప్రభుత్వశాఖలు సేకరించే గణాంకాలమీద ఇటీవలి కాలంలో పాలకులకు అయిష్టత పెరుగుతూ, వాటిని పూర్తిగా నిర్వహించకపోవడమో, వాయిదావేయడమో, సర్వేలు చేపట్టినా వివరాలు బహిర్గతపరచకపోవడమో జరుగుతోంది. కానీ, ప్రజలకు ఆహారాన్ని అందించే విషయంలో ఎంతో శ్రద్ధపెడుతున్నామంటున్నవారు, ఆశించిన లక్ష్యం నెరవేరుతున్నదీ లేనిదీ తెలుసుకోక తప్పదు. జాతీయ ఆహారభద్రతాచట్టం, ప్రధానమంత్రి అన్న యోజన, మాతృవందన, పోషణ్ వంటి అనేకానేక పథకాలతో ఆకలిని ఉపశమింపచేసి, పలు కార్యక్రమాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నామన్న ప్రభుత్వం వాదనను ఆకలిసూచీలో మన స్థానం సవాలు చేస్తున్నమాట నిజం.

# యువ పారిశ్రామికులకు తెరుచుకున్న ద్వారాలు!




తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) వెన్నెముక. ఎంఎస్ఎం ఈలను ప్రోత్సహించేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు పరిశ్రమ 4.0 పేరిట నూతన పాలసీని ఇటీవలనే సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ప్రకటించారు. సమ్మిళిత అభివృద్ధి, సమగ్ర ఉపాధి, మెరుగైన ఉత్పాదకత సాధించడానికి ఈ కొత్త విధానం దోహదపడనుంది.

భూమిని తక్కువ ధరకు ఇవ్వడం దగ్గరి నుంచి రుణాలు సులభంగా అందేలా చూడటం వరకు పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా పలు విధానాలు ఎంఎస్ఎంఈ నూతన విధానంలో ఉన్నాయి. గత దశాబ్ద కాలం నుంచి రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2014 నుంచి టీఎస్ ఐపాస్ ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నమోదు 11 నుంచి 15శాతం పెరుగుతూ వచ్చింది. సగటు పెట్టుబడి 2018లో కోటి రూపాయలు ఉండగా 2022కు రూ.2.15కోట్లకు పెరిగింది. రాష్ట్రంలో భౌగోళికంగా, ఇతర అంశాలపరంగా ఎన్నో సానుకూలమైన అంశాలున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పెట్టుబడులు రావడం లేదని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం తదనుగుణంగా నిర్ణయాలు తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన టీఎస్ ఐపాస్ ద్వారా బహుళజాతి కంపెనీలకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా విధానాలున్నాయని గుర్తించిన పరిశ్రమల శాఖ చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇస్తూ నూతన పాలసీని రూపొందించింది. కొత్త ఎంఎస్ఎంఈ పాలసీతో ఈ రంగానికి ఏకంగా రూ.4వేల కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో కొత్తగా 25,000కు పైగా ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దేశవ్యాప్తంగా పరిశ్రమలపరంగా తెలంగాణ ఆరో స్థానంలో ఉంది. అదే విధంగా పరిశ్రమల నుంచి సమకూరే స్థూల విలువ ఆధారిత అంశాల పరంగా 8వ స్థానంలో ఉంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పారిశ్రామికవాడల్లో ఎంఎస్ఎంఈలకు స్థలాలను కేటాయించే విధానం ఇప్పటి వరకు ఉంది. దీంతో ఆయా స్థలాలను గవర్నమెంట్ నుంచి కొనాల్సి ఉండటంతో పెట్టుబడి పెరిగేది. పెట్టుబడి రెట్టింపు కంటే అధికమై, పరిశ్రమల నిర్వహణ కూడా కష్టంగా మారేది. ఈ విధానానికి చెక్ పెడుతూ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానంలో లీజు పద్ధతిని ప్రవేశపెట్టింది. పరిశ్రమలు స్థాపించాలనుకున్న వారు 33ఏళ్ల వరకు లీజుకు తీసుకోవచ్చు. దీంతో పారిశ్రామికవేత్తలపై ఆర్థిక భారం తగ్గుతుంది.

చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవరోధంగా ఉన్న ఇతర అంశాలనూ పరిష్కరించేలా నూతన విధానంలో ఏర్పాట్లు చేశారు. ఇందులో ప్రధానంగా ఆరు విషయాలను పరిగణనలోకి తీసుకున్నారు. భూమి, రుణసాయం, ముడి సరుకులు, వ్యాపారపరమైన మెళకువలు, నూతన సాంకేతికత, మార్కెట్ సదుపాయం కల్పించడం వంటి వాటిపైనే ప్రధానంగా దృష్టి సారించారు. సంస్థల ఏర్పాటు దగ్గర నుంచి అమ్మకాల వరకు ప్రతి అంశంలోనూ ప్రభుత్వం చేదోడువాదోడుగా నిలవనుంది. దీనికోసం ప్రత్యేకంగా ఉన్నతస్థాయి పర్యవేక్షణ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. పరిశ్రమల మంత్రి, ముఖ్యకార్యదర్శి, పరిశ్రమల కమిషనర్, డైరెక్టర్, పారిశ్రామికవేత్తల నుంచి కొంత మంది ప్రతినిధులు ఈ కమిటీలో ఉంటారు. పారిశ్రామికవేత్తల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలుపర్చాలనే నివేదికను రూపొందించి వాటిని అమలు చేసేలా ఉన్నతస్థాయి పర్యవేక్షణ కమిటీ చూడనుంది. ఎంఎస్ఎంఈల రిజిస్ట్రేషన్ ఖర్చుతో కూడుకున్న పని అని పలువురు వెనకడుగు వేస్తున్నారు. భూమి, భవన నిర్మాణాల కోసమే 40 నుంచి 50 శాతం ఖర్చు చేయాల్సి వస్తోంది. తగిన వనరుల లేమి, భూమి ధర, శ్రామిక ఖర్చు ఎక్కువగా ఉండడం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ ఖర్చులు తగ్గించి, మార్కెటింగ్ సౌకర్యంతో పాటు సాంకేతిక తోడ్పాటు అందించే విధంగా ఉన్నతస్థాయి పర్యవేక్షణ కమిటీ పనిచేయనుంది.రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 35 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉండగా, వీటిలో 26 లక్షలకు పైగా సూక్ష్మ పరిశ్రమలే ఉన్నాయి. ఇందులో సుమారు 30 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. ఇవి కూడా తయారీ, సేవలు, రిటైల్, హోల్‌సేల్ విభాగాల్లో పని చేస్తున్నాయి. మధ్యతరహా పరిశ్రమలైతే వెయ్యి వరకే ఉన్నాయి. వీటి ద్వారా లక్షమందికి పైగా ఉపాధి లభిస్తోంది. ఆ తర్వాత ఆహార తయారీ, ఖనిజ, చెక్క ఆధారిత, ఇంజనీరింగ్, ఎఫ్ఎంసీజీ, టెక్స్‌టైల్స్, ఆటో విడిభాగాల రంగాలు పని కల్పిస్తున్నాయి.మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఉంది. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఒక మహిళా పారిశ్రామికవాడను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ఎంఎస్ఎంఈలను స్థాపించడానికి వచ్చే మహిళలకు మహిళా శక్తి స్కీం ద్వారా మరింత ప్రోత్సహిస్తారు. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయనున్నట్టుగా ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు చెప్తూ వస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో మహిళల జనాభా 1.88 కోట్లు. వీరిలో కేవలం 58వేల మంది మాత్రమే మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారు. ఇది జనాభాతో పోలిస్తే 3.1 శాతమే. నూతన విధానంలో ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా రాయితీలు కల్పించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు నిర్వహిస్తున్న వారిలో ఎస్సీలు 15శాతం, ఎస్టీలు 9శాతం, బీసీలు 28శాతంగా ఉన్నారు. సూక్ష్మ పరిశ్రమలతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు భారీగా ఏర్పాటయ్యేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. వీటి ద్వారా లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుంది.ప్రపంచంలో మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతను నిపుణులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఆలోచన చేశారు. స్కిల్ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో ట్రైనింగ్ ఇచ్చేందుకు దేశంలోని ప్రముఖ కార్పొరేట్ సంస్థలైన ఎస్‌బీఐ, న్యాక్, డాక్టర్ రెడ్డీస్, టీవీఏజీఏ, అదానీ, సీఐఐ లాంటి సంస్థలు భాగస్వాములు. ఇదే కాకుండా స్కిల్ యూనివర్సిటీలో దాదాపు 140 కంపెనీలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలను ఆధునిక నైపుణ్య కేంద్రాలుగా మార్చేందుకు వీలుగా మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. రాష్ట్రంలోని ఐటీఐ, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సైతం స్కిల్ వర్సిటీ కిందకే రానున్నాయి. రాష్ట్రంలోని 100 నియోజకవర్గాలలో ఐటీఐ లేదా ఏటీసీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. వర్సిటీతో పాటు ఐటీఐ, ఏటీసీలలో అన్ని రంగాలపై అనుభవంతో కూడిన నైపుణ్యాన్ని సాధించిన యువతకు ఎంఎస్ఎంఈలు వరంలాగా మారే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఉద్యోగాల కోసం ఎదురు చూసే యువత ఎంఎస్ఎంఈల వైపు ఆసక్తి చూపనున్నారు. వారు ఉపాధి పొందుతూనే ఎంతో మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం అసాధ్యం. అందుకే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సరికొత్త పాలసీతో పరిశ్రమల ఏర్పాటు ద్వారా 20శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. ఇదే కాకుండా ప్రత్యేకంగా 30శాతం ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలకే మెరుగైన అవకాశాలు లభించనున్నాయి.

భక్తి

# సద్గురువు ఉండే చోటు



పూర్వం ఒక రాజు ఉండేవాడు. అతనికి పాలనా వ్యవహారాలతో, ఎత్తుగడలతో, ఆడంబరమైన జీవితంతో విసుగు పుట్టింది. ప్రశాంతత కోసం ఆధ్యాత్మికతవైపు అడుగులు వెయ్యాలనుకున్నాడు. ఒక రోజు "ఇక ఆలస్యం చెయ్యకూడదు. ఎలాగైనా సద్గురువును ఆశ్రయించాల్సిందే" అని నిర్ణయించుకున్నాడు. అప్పుడు అతనికి కొంతకాలం క్రితం తనను కలిసిన ఒక వృద్ధుడు "సద్గురువు అంటే అసలైన జ్ఞాని. అలాంటి వ్యక్తి అత్యంత సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ ఉంటాడు" అని చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. వెంటనే... అలాంటి వ్యక్తికోసం రాజు అన్వేషణ మొదలుపెట్టాడు. ఎన్నో ఊర్లు తిరిగాడు, ప్రతి ఆలయాన్ని, ఆశ్రమాన్ని, మఠాన్ని గాలించాడు. ఎందరో ప్రసిద్ధ గురువులను కలిశాడు. కానీ వారిలో ఎవరూ తనకు జ్ఞానమార్గం చూపే సద్గురువుగా అతనికి అనిపించలేదు. ఎవరిలో చూసినా ఆడంబరం, అహంకారం కనిపించాయి. 'నాకు కావలసింది అహంకారంతో, ఆడంబరంగా మాట్లాడే పండితులు, శాస్త్రకోవిదులు కాదు. జ్ఞానజ్యోతిని దర్శించి, సత్యాన్నే మాట్లాడే సద్గుణ సంపన్నుడైన వ్యక్తి. అలాంటి వారు ఎక్కడా లేరు" అనుకొని, తిరిగి రాజధానికి చేరుకున్నాడు.

అంతకుముందు తనకు బోధ చేసిన వృద్ధుణ్ణి కలుసుకొని "మీరు మీ మాటలతో నన్ను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు. మీ మాటలు నమ్మి ఏళ్ళ తరబడీ రాజ్యమంతా గాలించాను. సద్గురువులా అనిపించేవారు ఒక్కరూ కనబడలేదు" అన్నాడు. %అప్పుడు ఆ వృద్ధుడు "మహారాజా! మీరు ఏయే ప్రాంతాల్లో వెతికారో వివరంగా చెబుతారా?" అని అడిగాడు. రాజు తను వెతికిన మఠాలు, మందిరాలు, ఆశ్రమాల గురించి చెప్పాడు. అవన్నీ పేరు ప్రఖ్యాతులు కలిగిన గురువులు నివసించే స్థలాలే. అంతా శ్రద్ధగా విన్న ఆ వృద్ధుడు "మహారాజా వెతకరాని చోట వెతికి... విలువైన మీ సమయాన్ని వృథా చేసుకున్నారు. నిజమైన సద్గురువులు అతి సామాన్యులుగా ఉంటారని చెప్పాను కదా! వాళ్ళు అలాంటి వైభవోపేతమై ప్రదేశాల్లో ఎందుకుంటారు? ఏ వీధి మూలనో, పాడుబడిన ఇంటి సమీపంలోనో, చెత్తను పారేసే ప్రదేశాల దగ్గరలోనో ఉంటారు. ఎవరి నుంచీ ఎలాంటి ప్రత్యేక గౌరవాన్నీ ఆశించరు. దొరికిన తిండి తింటూ, అరకొర వస్త్రాలు ధరిస్తూనో, ధరించకుండానో జీవిస్తూ ఉంటారు" అన్నాడు.ఆ వృద్ధుడి మాటలనే రాజు తలచుకుంటూ మరుసటి రోజు ఉదయం తన మందిరం మేడ మీద కూర్చున్నాడు. వీధిలో వస్తూ, పోతూ ఉండేవారిని చూస్తున్నాడు. ఇంతలో ఒక యాచకుడు వచ్చాడు. రాజ భవనం ప్రధాన ద్వారం ముందు నిలిచి భిక్ష అడుగుతున్నాడు. అతని నడకలో, మాటలో, చూపులో రాజుకు ఏదో ప్రత్యేకత కనిపించింది. మెట్లు దిగి వచ్చాడు. యాచకుడి ముందు నిలబడి, పలకరించాడు. ఇద్దరి మ?ధ్య సంభాషణ నడిచింది. తను వెతుకుతున్న సద్గురువు అతనేననే జ్ఞానం రాజుకు కలిగింది. నిజానికి ఆ యాచకుడు రోజూ రాజమందిరం ముందుకు వస్తూనే ఉన్నాడు. ఇంతకాలం అధికార దర్పం, అహంకారం రాజు కళ్ళను కప్పేశాయి. ఆ యాచకుడిలోని జ్ఞానిని గుర్తించకుండా చేశాయి. ఒక సందర్భంలో ఈ కథను భగవాన్ రజనీశ్ (ఓషో) చెబుతూ" అహంకారాన్ని వదులుకొని, జ్ఞానం కోసం తపించిన రోజున సద్గురువు తనంతట తానే మన ముందుకు వచ్చి దర్శనమిస్తాడు. మన జ్ఞాన దాహాన్ని తీరుస్తాడు" అని వివరించారు.

నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

5 | హైదరాబాద్ మంగళవారం 22 । అక్టోబర్ । 2024


## ఆరోగ్యానికి ఆరోగ్యం రుచికి రుచి



ఈ మధ్యకాలంలో ఆరోగ్యకరమైన ఆహారాన్ని మాత్రమే తినాలనుకొనే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అలాంటి వారి కోసం కొన్ని వంటలు అందిస్తున్నాం.. ఆస్వాదించండి..

**క్యాబేజీ దాల్ పరోటా**

కావాల్సిన పదార్థాలు: గోధుమ పిండి – ఒక కప్పు, క్యాబేజీ తురుము– ఒక కప్పు, పెసరపప్పు– మూడు స్పూనులు, సోంపు– ఒక టేబుల్ స్పూను, సన్నటి ఉల్లిపాయ ముక్కలు– అర కప్పు, తరిగిన పచ్చి మిర్చి ముక్కలు– ఒక టేబుల్ స్పూను, సన్నగా తరిగిన పుదీనా– రెండు స్పూనులు, పసుపు– పావు స్పూను, నూనె– తగినంత, నీళు – తగినన్ని

తయారీ విధానం

పరాటా కోసం : గోధుమ పిండిలో ఒక స్పూను నూనె, కొద్దిగా ఉప్పు వేసి – నీళ్లు పోసి కలపాలి. ఈ పిండి పలుచగా ఉండకూడదు. అలాగని పూరీ పిండిలా బాగా గట్టిగా కూడా ఉండకూడదు. దీనిని ఒక బేసిన్‌లో పెట్టి తడిగుడ్డ కప్పి 15 నిమిషాలు ఉంచాలి.

స్టఫింగ్ కోసం

ఒక మూకుడులో నూనె వేసి సోంపు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా వేయించాలి. ఆ తర్వాత దానిలో పచ్చి మిర్చి ముక్కలు, క్యాబేజీ వేసి మూత పెట్టి మగ్గనివ్వాలి.

ఆ తర్వాత పెసరపప్పు, పుదీనా, పసుపు కూడా వేసి మగ్గనివ్వాలి. మధ్యలో కొద్దిగా నీళ్లు చల్లాలి. బాగా మగ్గిన తర్వాత చల్లార్చాలి.

# చలికి చెదరని అందం



చలి కాలం చర్మం పొడిబారి, నిర్జీవంగా మారుతుంది. మరి ఇలాంటి వాతావరణంలో మేకప్ ఎలా చేసుకోవాలి? తెలుసుకుందాం!

**మాయిశ్చరైజింగ్ మాస్క్:** చలి కాలంలో మాయిశ్చరైజర్ వాడకం పెంచాలి. చర్మం తేమగా మారడం కోసం మాయిశ్చరైజింగ్ మాస్క్‌లను మేక్‌పకు అరగంట ముందు అప్లై చేసుకుంటూ ఉండాలి. అలాగే ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత, మాయిశ్చరైజర్ అప్లై చేసి, అది చర్మంలో పూర్తిగా ఇంకిన తర్వాత మేకప్ మొదలుపెట్టాలి.

**వాటర్‌ప్రూఫ్ మస్కారా:** చలి కాలం చల్లని గాలులు సోకినప్పుడు కళ్లు తడిగా మారతాయి. దాంతో మస్కారా, కాటుకలు చెదిరిపోకుండా ఉండడం కోసం చలి కాలంలో తప్పనిసరిగా వాటర్‌ప్రూఫ్ మస్కారా, కాజల్ అప్లై చేసుకోవాలి.

**ఫౌండేషన్:** పౌడర్ ఫౌండేషన్లను చర్మం పీల్చుకోలేదు. కాబట్టి ఈ కాలంలో లిక్విడ్ ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. వాలైతే మాయిశ్చరైజర్, ఫౌండేషన్ రెండూ కలిపి వాడుకోవచ్చు.

షాడో: ఐ షాడో కోసం

# సమకాలీన సమస్యలపై మరో కొత్త ప్రయోగం



'రాజసింహ' మన పురాణాల్లోని నరసింహుడు. దుష్ట శిక్షకుడు. చెడును చీల్చిచెండాడే ఉగ్రరూపుడు. విష్ణుమూర్తి అవతారం. ఆ నరసింహుడుపై ఎన్నో ఏళ్ల క్రితం ప్రజాకవి కాళోజి రాసిన కవిత వసంత కన్నబిరాన్‌కి స్ఫూర్తినిచ్చిం ది. అదే ఆమెను 'రాజసింహ' న ృత్య రూపకాన్ని రచించేలా చేసింది. నరసింహుడులోని దుష్టసంహార విశ్వరూపం సమకాలీన సమస్యల పరిష్కార మార్గంగా.. నయా కోణంలో వసంత కన్నబిరాన్ అక్షరీకరించారు. వసంత కన్నబిరాన్ ఇంగ్లీషులో రాసిన ఈ రూపకానికి భరతనాట్యంలో కొరియోగ్రఫీ చేసారు ప్రముఖ న ృత్యకారిణి రాజేశ్వరి సాయినాథ్. 'రాజసింహ' ఆంగ్ల నృత్య రూపకాన్ని నేడు తొలిసారిగా రవీంద్రభారతిలో ప్రదర్శించనున్నారు.

**విముక్తికి స్ఫూర్తి నరసింహుడు....** ఈ బ్యాలెట్‌లో నరసింహుడుని 'విముక్తి'కి ప్రతీకగా చూపారు. మానవ వినాశనానికి కారణమవుతున్న ప్రభుత్వాల పాలన, అవినీతి, పర్యావరణం అసమతుల్యత, అడవులను హరించడం, బహుళజాతి కంపెనీల ప్రవేశం, ప్రక ృతి, భూమి వినాశనమవుతుండడం, దురాశకరపోకడలు లాంటి ఎన్నో సమస్యల నుంచి నేటి సమాజంలోని మానవాళిని రక్షించడానికి మరోసారి ఈ భూమ్మిదకు నరసింహుడు తిరిగి రావాలంటారు రచయిత్రి. వీటివల్ల ప్రజలు బతకలేకపోతున్నారని అందులో ఆమె ఆవేదన వ్యక్తంచేస్తారు. వీటి నుంచి మానవాళిని రక్షించకపోతే రానున్న తరాల భవిష్యత్తు నిలువ నీడ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తంచేస్తారామె. భూమితల్లిని కాపాడాలంటారు. ప్రక ృతిని పరిరక్షించాలంటారు. అడవులను ఆదుకోవాలంటారు. అత్యాచారాలకు మహిళలు బలవకుండా నరసింహుడు నిలబడాలంటారు. అంతేకాదు ఆదివాసులను ఆదుకోవాలంటారు. వరదలు, సునామీలు, భూకంపాలు, తుఫానులు, అగ్నిపర్వతాల వినాశనాల్ని నుంచి ప్రజల్ని రక్షించాలంటారు. దానితోపాటు రాబోయే తరాలకు పచ్చని భవిష్యత్తుని అందివ్వాలంటారు. భూగోళాన్ని వినాశనం చేసే శక్తులపై విజ ృభించాలంటారు. అంతేకాదు అడవులలో ఉండే ఆదివాసీలను తరిమికొడుతున్న పరిస్థితి, అది స ృష్టించే తీవ్ర పరిణామాల గురించి కూడా రచయిత్రి ఇందులో చెప్పారు. భూమి వినాశనం అవుతున్న తీరు పట్ల ఆందోళన వ్యక్తంచేస్తూ అధికారం, అథారిటీ , అవినీతి, న్యాయం వంటి అంశాలను ఈ సందర్భంగా లేవనెత్తారు. స్వేచ్ఛలోని వైవిధ్యాన్ని చెపుతూ అధికారాన్ని, నమ్మకాన్ని దుర్వినియోగం చేయని సిసలైన స్వేచ్ఛను ప్రజలు అనుభవించాలంటారామె. నరసింహుడు మానవాళికి అలాంటి ఒక గొప్ప మార్గాన్ని, నమ్మకాన్ని, భవిష్యత్తుపై ఆశను రేకెత్తించే, దారి చూపే శక్తిగా, పాజిటివ్ సింబల్‌గా 'రాజసింహ' న ృత్యరూపకంలో చూపే ప్రయత్నం చేశారు.

**కాళోజి గళం నుంచి ఎన్నో సార్లు విన్నా...** కాళోజి గళం నుంచి ఎన్నో సార్లు విన్న 'నరసింహస్వామి' కవిత్వంను మరిచిపోలేనంటారు వసంత. 1966లో యాదగిరిగుట్టలో నరసింహస్వామి మీద కాళోజి రచించి, చదివిన పద్యంపై రూపకం రాయాలనే ప్రగాఢ వాంఛ గత కొన్నాళ్ల నుంచీ తనను వెన్నాడుతూ వచ్చిందని ఆమె తెలిపారు. ఎనిమిదిమంది కళాకారులతో ఒక గంటపాటు సాగే ఈ న ృత్య రూపకం పూర్తిగా భరతనాట్యంలో కొరియోగ్రఫీ చేశారని తెలిపారు. 'న ృత్యంలోని శాస్త్రీయత 'స్పిరిట్' ఏమాత్రం దెబ్బతినకుండా అభినయం సాగడమే కాకుండా న ృత్యరూపకంలోని రాడికల్ ఆలోచనలకు అనుసంధానమయ్యేలా ప్రదర్శనను 'ఇంటర్‌ప్రెట్' చేయడం, ఆవిష్కరించడమే మా ఉద్దేశం. నాకు ఈ రూపకాన్ని రాయడానికి రెండు మూడు నెలలు పైగా పట్టింది. నాకు న ృత్యం గురించి తెలియదు. దీని న ృత్య సారథి రాజేశ్వరి సాయినాథే' అని చెప్పారు వసంత. గతంలో 'మేనక,' 'అహల్య', 'గాంధారి' వంటి పురాణ స్త్రీపాత్రలకున్న స్టీరియోటైపని బ్రేక్ చేస్తూ ఆ పాత్రలను మెటాఫర్స్‌గా ఉపయోగిస్తూ నృత్యరూపకాలు రాసారు. ఎప్పుడూ కొత్తదనాన్ని అన్వేషించే ఆమెలోని ఈ లక్షణమే 'రాజసింహ' ప్రయోగానికి కూడా పూనుకునేట్టు చేసింది. అలాగే 'రాజసింహ'ను కూడా కొత్త కోణంలోంచి చాలా రాడికల్‌గా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

# ఆ జానర్ ఎప్పటికీ ఈ జానకిదే!

బుల్లితెరపై తన నటనతో ప్రేక్షకులను ఏడిపించే జానకి.. కెమెరా ఆఫ్ అయితే మాత్రం సరదా కబుర్లు, జోక్‌లతో అందరిలో హుషారు నింపే జయశ్రీ. రీల్‌కి, రియల్‌కి ఏమాత్రం పొంతన లేకుండా ఉంటుందామె. అప్పుడే ఏడిపిస్తుంది, అంతలోనే కడుపు చెక్కలయ్యేలా నవ్విస్తుంది. పన్నెండేళ్ల ప్రాయంలో తెరకు పరిచయమైన ఈ కన్నడ కస్తూరి కన్నడ, మలయాళం, తమిళం, ఒడియా, హిందీతోపాటు తెలుగులోనూ పలు సినిమాలు, సీరియల్స్‌లో నటించి ప్రేక్షకులను అలరించింది. జీ తెలుగు 'పడమటి సంధ్యారాగం' జానకిగా తెలుగువారికి బాగా దగ్గరైన జయశ్రీ రాజ్ జిందగీతో పంచుకున్న ముచ్చట్లు..




'పడమటి సంధ్యారాగం' సీరియల్లో నా ఫస్ట్ షాట్ ఇప్పటికీ గుర్తుంది. సోలో షాట్.. సెంటిమెంట్ సీన్. నిజానికి నాకు బాగా నచ్చే జానర్ అది. సెంటిమెంట్ సీన్ అంటే నేనే కనబడాలి అనుకుంటా. పన్నెండేళ్ల వయసులోనే పరిశ్రమకు వచ్చాను. నా మొదటి సీరియల్ వెయ్యికిపైగా ఎపిసోడ్స్‌తో సక్సెస్‌ఫుల్‌గా ప్రసారమైంది. ఆ వయసులో నాకు యాక్టింగ్ గురించి అంతగా తెలియదు. కానీ, ఒకసారి కెమెరా ముందుకు వచ్చాక నటనపై ఇష్టం పెరిగింది. దాన్నే కెరీర్‌గా మలుచుకోవాలని డిసైడ్ అయ్యా. ఇప్పటికి దాదాపు 50 సీరియల్స్‌లో హీరోయిన్‌గా చేశాను. కన్నడలో నలభై దాకా సినిమాల్లో నటించాను. తెలుగులో ఇప్పటివరకు నాలుగు సీరియల్స్‌తోపాటు ఒక సినిమా చేశా. మంచి అవకాశాలు వస్తున్నాయి. పాజిటివ్, నెగెటివ్ అనే తేడా లేకుండా రకరకాల పాత్రలు పోషించాను. పలు అవార్డులూ అందుకున్నాను.

మాది సంప్రదాయ కుటుంబం. అన్నయ్య, నేను ఇద్దరమే అవడంతో నేను చాలా గారాబంగా పెరిగాను. మా తల్లిదండ్రులు అన్ని విషయాల్లో మాకు స్వేచ్ఛ ఇచ్చారు. ఆ విషయంలో ఎప్పటికీ వారికి రుణపడి ఉంటాను. అంతేకాదు మా కుటుంబంలో నేనే మొదటి నటిని. నా కెరీర్ ఆరంభం నుంచీ మా అమ్మానాన్నల మద్దతు ఉంది. చిన్న వయసులోనే కెరీర్ ప్రారంభించడంతో వరుస ప్రాజెక్ట్స్‌తో చదువుకోవడానికి సమయం ఉండేది కాదు. దీంతో స్కూల్‌కి, కాలేజీకి సరిగ్గా వెళ్లేదాన్ని కాదు. అయితే, చదువును నిర్లక్ష్యం చేయలేదు. ఓపెన్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ చేశా.

నేను ఏ ప్రాజెక్ట్ ఒప్పుకొన్నా ఆ పాత్రలో ఇమిడిపోవడానికి ప్రయత్నిస్తా. రెండో షాట్ తీసుకోవడం నాకు నచ్చదు.



ఇప్పటివరకు అలాంటి సందర్భం రాలేదు. అందుకే సెట్‌లో అందరూ నన్ను సింగిల్ టేక్ ఆర్టిస్ట్ అంటారు. ఏ విషయాన్నయినా తొందరగా నేర్చుకుంటాను. అది దేవుడిచ్చిన వరమే అని భావిస్తాను. మొదటిసారి తెలుగులో అవకాశం వచ్చినప్పుడు భాష రాదని ఒకింత కంగారుపడ్డాను. కానీ, మా ఆయన ధైర్యం చెప్పడంతో ఓకే అన్నాను. షూటింగ్ మొదలయ్యాక దర్శకుడు, సహనటులు, ప్రొడక్షన్ టీమ్ ఆదరణ చూసి ఆశ్చర్యపోయా. గొప్పగా అనిపించారు. సీరియల్ ప్రసారమయ్యాక ప్రేక్షకులు రిసీవ్ చేసుకున్న తీరు నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడికి వెళ్లినా.. 'పడమటి సంధ్యారాగం.. జానకి' అంటూ ప్రేమగా పలకరిస్తారు. నాకు తెలుగులో మొదటి అవకాశం ఇచ్చిన మల్లెమాల ప్రొడక్షన్స్‌కి థ్యాంక్స్.

కన్నడలో నా మొదటి సీరియల్ 'మాయామృగ'. అందులో నా పాత్ర పేరు శారద. ఇప్పటికీ కన్నడిగులు 'శారద' అనే పిలుస్తారు. కన్నడ ప్రేక్షకులు తమ అభిమానాన్ని లైవ్‌లో చూపిస్తారు. అంటే వాళ్లను కలిసినప్పుడు ఆ అభిమానం తెలుస్తుంది. కానీ, తెలుగు ప్రేక్షకులు ప్రత్యేకం. సోషల్ మీడియాలో వాళ్లు కురిపించే అభిమానం చాలా సంతోషాన్నిస్తుంది. నిజానికి నేను సోషల్ మీడియా పర్సన్‌ని కాదు. నా పర్సనల్ లైఫ్‌కి సంబంధించిన ఏ విషయాలూ పంచుకోను. నా కుటుంబానికీ ప్రైవసీ ఉండాలని కోరుకుంటా. కానీ, నా అభిమానులు మాత్రం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా లేకపోయినా ప్లీజ్ మేడమ్ అప్‌డేట్‌గా ఉండండి, రీల్స్ పెట్టండి అని కామెంట్స్ పెడుతూ ఉంటారు. ఇందరి అభిమానం పొందడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. మరిన్ని మంచిపాత్రలతో మిమ్మల్ని అలరిస్తాను.

**నటన చూసే అవకాశాలు**

నా కెరీర్ ఆరంభం నుంచీ అవకాశం కోసం ఎవరినీ అడగలేదు. ఇప్పటివరకు కనీసం ఫొటో షూట్ కూడా చేయలేదు. నా నటన చూసే నాకు అవకాశాలు ఇచ్చారు. మా ఆయన కూడా పరిశ్రమకు చెందినవా రే! దీంతో పెండ్లి తర్వాత కూడా కెరీర్ కొనసాగించాను. మావారు, పాప నాకు చాలా సపోర్ట్ చేస్తారు. మాకు నిర్మాణ సంస్థ ఉంది. కన్నడలో కొన్ని సినిమాలు, సీరియల్స్ నిర్మించాం. నటిగానే కాకుండా నిర్మాత, వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్తగానూ బాధ్యతలు పోషిస్తున్నా. రాజకీయాల్లోనూ చురుగ్గా ఉంటాను. బిజీ షెడ్యూల్స్ వల్ల నా కుటుంబానికి సమయం ఇవ్వలేక పోతున్నానే బాధ ఉంది.

## పైల్స్ సమస్యను తగ్గించే చిట్కా..!

పైల్స్... ఈ సమస్య ఎవరికైనా వచ్చిందంటే చాలు. అప్పుడు కలిగే బాధను మాటల్లో చెప్పలేం. కాలక ృత్యాలు తీర్చుకుంటానికి వెళ్లినప్పుడల్లా టాయిలెట్‌లో నరక యాతన అనుభవించాల్సిందే. ఆ తరువాత కూడా మంట, నొప్పితో సతమతం అవ్వాల్సిందే. అయితే పైల్స్ అనేవి రావడానికి ఎన్నో కారణాలు ఉంటాయి.

మలబద్ధకం, థైరాయిడ్, డయాబెటిస్, మాంసం, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తినడం, ఎక్కువగా కూర్చుని ఉండడం.. వంటివి దాని వెనుక ఉన్న కొన్ని కారణాలు. ఈ క్రమంలో ఏ కారణం వల్ల పైల్స్ సమస్య వచ్చినా అది ఓ పట్టాన తగ్గదు. అయితే కింద ఇచ్చిన కొన్ని చిట్కాలు పాటిస్తే దాంతో పైల్స్ సమస్య నుంచి విముక్తి పొందవచ్చు. మరి ఆ చిట్కాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందామా..!

1. ఒక పాత్రలో కొద్దిగా నీటిని తీసుకుని అందులో కొన్ని బిర్యానీ ఆకులు (బే లీవ్స్), మూడు వెల్లుల్లి రెబ్బలు వేయాలి. అనంతరం ఆ నీటిని 10 నిమిషాల పాటు బాగా మరిగించాలి. మిశ్రమం మరిగాక దాన్ని చల్లార్చి సమస్య ఉన్న ప్రదేశంలో రాయాలి. ఇలా రోజుకు 3 సార్లు చేస్తుంటే పైల్స్ బాధించవు.
2. చమోమిల్ (తెల్ల చామంతి) పూవును తీసుకుని దాన్ని నీటిలో వేసి డికాక్షన్ కాయాలి. ఆ డికాక్షన్‌ను చల్లార్చి సమస్య ఉన్న ప్రదేశంలో రాస్తే ఫలితం ఉంటుంది.
3. చిన్న గ్లాస్‌లో కొద్దిగా యాపిల్ సైడర్ వెనిగర్ తీసుకుని అందులో కొన్ని కాటన్ బాల్స్ వేసి నానబెట్టాలి. కొద్ది సేపు ఆగాక వాటిని తీసి సమస్య ఉన్న ప్రదేశంలో రాస్తే పైల్స్ నుంచి ఉపశమనం లభిస్తుంది.
4. కలబంద (అలోవెరా) ఆకులను తీసుకుని వాటిని మధ్యలోకి చీల్చి వాటి నుంచి గుజ్జును సేకరించాలి.

# చురుకుదనానికి చిట్కా



ఒక్కోసారి ఏం చేసినా విసుగ్గా అనిపిస్తుంది. ఏ పనీ ఎంతకీ ముందుకు కదలదు. దీనికి కారణం ఒత్తిడే కావొచ్చు. దాన్ని అదుపులో ఉంచుకోవాలంటే ముందు మన జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. అవెలాంటివంటే...

– మెదడు చురుగ్గా, ప్రశాంతంగా ఉండాలంటే ఒత్తిడిగా ఉన్నప్పుడు ఓ పావుగంటైనా సరే! ఒంటరిగా కూర్చోవాలి. చక్కని ఆలోచనలు వస్తాయట. ఆ సందర్భంలోనే కాదు...రోజూ ఓ అరగంట సమయాన్ని ధ్యానం కోసం కేటాయించి చూడండి. మీతో మీరు మాట్లాడుకోండి.మానసికంగా ద ృఢంగా ఉండగలుగుతారు. పనిలో చురుగ్గానూ ఉంటారు.

– ఆలస్యంగా నిద్రలేవడం, హడావుడిగా వంటింట్లోకి పరుగులు తీయడం మనలో చాలామందికి అలవాటే. దీనివల్ల మెదడూ, శరీరం యాంత్రికంగా పనిచేయడానికి అలవాటు పడిపోతాయి. అందుకే మీరు మీ పని మొదలుపెట్టడానికి కనీసం గంట ముందైనా నిద్రలేవండి. చిన్నచిన్న స్ట్రెచింగ్ వ్యాయామాలు, నడక, జాగింగ్, యోగా వంటివేవైనాసరే కాసేపైనా చేయాలి. ఇవి మెదడునీ, శరీరాన్ని సమన్వయం చేస్తాయి. అలాగే గ్రీన్ టీ అలవాటు చేసుకుంటే ఒత్తిడి దరిచేరదు. శరీరం ఉత్సాహంగా ఉంటుంది.

## నిమ్మరసంతో నిగనిగ



ఎక్కువ సేపు బయట తిరిగినప్పుడు ఎండ ప్రభావం వల్ల ముఖం, చేతులూ, పాదాలు నల్లగా మారతాయి. ఇంట్లో ఉండే పదార్థాలతోనే ఆ నలుపు ఎలా వదిలించుకోవాలోచూద్దాం.

–రెండుమూడు చెంచాల పెరుగులో కొద్దిగా పసుపు కలపాలి. ఐదు నిమిషాలయ్యాక ఈ మిశ్రమాన్ని చేతులకు రాసి మర్దన చేయాలి. ఇది పూర్తిగా ఆరాక కడిగేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా కనీసం రెండు వారాలు రాసుకొని చూడండి. నలుపు తగ్గుతుంది.

– ఒక పెద్ద పాత్రలో గోరువెచ్చని నీళ్లు తీసుకుని అందులో రెండు నిమ్మకాయల రసం కలపాలి. అందులో ఓ అరగంటపాటు పాదాలు ఉంచాలి. నలుపు సమస్య ఎక్కువగా ఉందనుకుంటే నిమ్మరసాన్ని నీళ్లలో కలపకుండా నేరుగా పాదాలకే రాసుకోవచ్చు. ముఖ్యంగా మోచేతి నలుపు తగ్గించడానికి ఈ చిట్కా పనిచేస్తుంది.

– రెండు చెంచాల కీరా రసంలో, ఒక చెంచా నిమ్మరసం, చిటికెడు పసుపు కలపాలి. దీన్ని చేతులకు పట్టించి, ఆరిపోయాక కడిగేయాలి. దీనికి బదులుగా సమస్య ఉన్న ప్రాంతంలో తాజా కీరదోస ముక్కల్ని కూడా రాసి చూసుకోవచ్చు.

– ముఖం నల్లగా మారితే సెనగపిండి పూత ప్రయత్నించి చూడొచ్చు. రెండు పెద్ద చెంచాల సెనగపిండిలో చిటికెడు పసుపూ, ఒక చెంచా పాలు కలపాలి. చల్లదనం కోసం కొన్ని గులాబీనీళ్లు కూడా వాడొచ్చు. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసుకుని పూర్తిగా ఆరిపోయాక చల్లటి నీళ్లతో కడిగేసుకుంటే చాలు..శరీరం చురుగ్గా పనిచేయాలన్నా, మెదడు సరిగ్గా ఆలోచించాలన్నా కూడా అవసరమైన శక్తి ఆహారం ద్వారా అందాలి. ముందు అల్పాహారం ఎట్టిపరిస్థితుల్లోనూ మానేయకూడదు. గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అంటే ఎక్కువ మొత్తంలో పీచు, సమపాళ్లలో కొవ్వు, మాంసక ృత్తులు ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం ఆకుకూరలూ, కూరగాయలూ, చేపలూ, పాలూ, పెరుగూ, పప్పుధాన్యాలు వంటివాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. అవసరమైన పోషకాలను శరీరానికి అందిస్తాయి. మానసిక శారీరక ఆరోగ్యానికి కారణం అవుతాయి. రాత్రిపూట తినే ఆహారం తేలికగా, స్వల్పంగా ఉండేలా చూసుకుంటే నిద్రలేమి బాధించదు. ఈ జాగ్రత్తలూ మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచుతాయి.

# మెంతి కూరతో కలిగే లాభాలివే..!



మెంతి ఆకులను అనేక మంది కూరగా చేసుకుని తింటారు. కొందరు పలు వంటకాల్లో దీన్ని వేస్తారు. అయితే ఎలా వండుకుని తిన్నా మెంతి ఆకుల వల్ల మనకు అనేక అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయి. పలు అనారోగ్య సమస్యలు నయమవుతాయి. శరీరానికి కావల్సిన పోషకాలు కూడా అందుతాయి. ఈ క్రమంలోనే మెంతి ఆకు వల్ల మనకు ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

. లివర్ సమస్యలను తొలగించడంలో మెంతికూర బాగా పనిచేస్తుంది. లివర్‌ను ఇది శుభ్రం చేస్తుంది. గ్యాస్, పేగుల్లో ఏర్పడే సమస్యలు తొలగిపోతాయి. డయేరియాకు చక్కని మందుగా పనిచేస్తుంది. శ్వాసకోశ సమస్యలు మాయమవుతాయి.

మెంతికూర ఆకులు రక్తంలోని లిపిడ్ లెవల్స్‌పై మెరుగైన ప్రభావం చూపుతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సమర్థవంతంగా పనిచేస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. మెంతి ఆకులను కొంత నీటిలో రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని వడకట్టి తాగితే చక్కని ఫలితం ఉంటుంది.

యాంటీ డయాబెటిక్ గుణాలను మెంతి కూర కలిగి ఉంది. రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. టైప్ 2 డయాబెటిస్‌ను నయం చేయడంలో బాగా పనిచేస్తుంది.

మెంతికూరలోని ఔషధ కారకాలు రక్తం గడ్డకట్టకుండా చూస్తాయి. హార్ట్ అటాక్, ఇతర గుండె సంబంధ వ్యాధులు రాకుండా అడ్డుకుంటాయి. అద్భుతమైన యాంటీ ఆక్సిడెంట్లు మెంతి కూరలో ఉన్నాయి. ఇవి శరీర కణజాలాన్ని రక్షిస్తాయి.

చర్మాన్ని ప్రకాశవంతంగా చేయడంలో మెంతి కూర బాగా ఉపయోగపడుతుంది. ప్రధానంగా ముఖంపై ఏర్పడే మచ్చలు తొలగిపోతాయి. మెంతి ఆకులను పేస్ట్‌గా చేసి జుట్టు కుదుళ్లకు పట్టించి కొంత సేపటి తరువాత తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యవంతంగా మారుతుంది. తరచూ ఇలా చేయడం వల్ల వెంట్రుకలు గట్టిపడి ప్రకాశవంతంగా తయారవుతాయి.

# బిజినెస్




## జస్ట్ రూ.10 వేల పెట్టుబడితో వ్యాపారం.. నెలకు రూ. 50 వేలకుపైగా ఆదాయం..



**న్యూఢిల్లీ–నవభూమి:** మీరు ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగంతో విసిగిపోయారా. ఏదైనా వ్యాపారం చేయాలని ఆలోచిస్తున్నారా. అయితే తక్కువ పెట్టుబడితో చేసే ఓ బిజినెస్ గురించి ఇక్కడ తెలుసుకుందాం. ఈ వ్యాపారంలో మీరు నెలకు 50 వేలకుపైగా సంపాదించుకోవచ్చు. ఆ విశేషాలేంటో ఇక్కడ చుద్దాం.మీరు తక్కువ డబ్బుతో వ్యాపారం చేయాలని భావిస్తున్నారా. అయితే ఈ వార్త మీ కోసమే. ఎందుకంటే ఇక్కడ చెప్పబోయేది కూడా తక్కువ పెట్టుబడితో చేసే బిజినెస్. అదే వ్యర్థ పదార్థాలను రీసైక్లింగ్ చేసే వ్యాపారం. చెత్త బిజినెస్ అని తక్కువగా అంచనా వేయకుండి. ఎందుకంటే ప్రస్తుతం ఈ వ్యాపారానికి మార్కెట్లో ఫుల్ డిమాండ్ ఉంది. స్క్రాప్ రీసైక్లింగ్ వ్యాపారం స్పెషల్ ఏమిటంటే, దీనిలో అవసరమైన పెట్టుబడి కూడా చాలా తక్కువగా ఉంటుంది. మీరు ఈ వ్యాపారంలో దాదాపు 10 నుంచి 15 వేల రూపాయలు పెట్టుబడి పెడితే చాలు. మంచి లాభాలను ఆర్జించవచ్చు. అయితే ఈ వ్యాపారం ఎలా ప్రారంభించాలి, అందుకోసం ఏం చేయాలి, లాభాలు ఎలా ఉంటాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 2 బిలియన్ టన్నుల కంటే ఎక్కువగా స్క్రాప్ ఉత్పత్తి అవుతుంది. ఇక భారతదేశం విషయానికి వస్తే ఇక్కడ కూడా ప్రతి సంవత్సరం 277 మిలియన్ టన్నులకు పైగా స్క్రాప్ ఉత్పత్తి అవుతుంది. ఈ క్రమంలో మీరు ఈ స్క్రాప్ నుంచి మీకు వచ్చిన వస్తువులను ఎంపిక చేసుకుని వాటి నుంచి అనేక రకాల వస్తువులు తయారు చేసుకోవచ్చు.

## ఆల్ట్రాటెక్ సిమెంట్ షాక్.. సెప్టెంబర్ త్రైమాసికంలో 36 శాతం తగ్గిన నికర లాభం..!




**న్యూఢిల్లీ–నవభూమి:** దేశంలోకెల్లా అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థ అల్ట్రాటెక్ సిమెంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో షాక్ ఇచ్చింది. 2024–25 ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంతో పోలిస్తే 36 శాతం నికర లాభాలు తగ్గిపోయాయి. ఆపరేషన్ల ద్వారా ఆదాయం పడిపోయిందని అల్ట్రాటెక్ సిమెంట్ వెల్లడించింది. సెప్టెంబర్ త్రైమాసికం నికర లాభాలు రూ.820 కోట్లకు పరిమితమైందని పేర్కొంది. సంస్థ ఆదాయం గతేడాదితో పోలిస్తే 2.4 శాతం తగ్గి రూ.15,634.73 కోట్లకు పడిపోయిందని తెలిపింది. ఆదాయం సమకూర్చుకోవడంలో మార్కెట్ వర్గాలను అధిగమించినా నికర లాభాల్లో మాత్రం మిస్ అయింది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో నికర లాభం 52 శాతానికి, ఆదాయం 13 శాతానికి పడిపోయాయి.ఎడతెరిపి లేని వర్షాలు కుస్తున్నా గతేడాది సేల్స్ 68 శాతం పెరిగాయని అల్ట్రాటెక్ సిమెంట్ తెలిపింది. ఇంధన వ్యయం 14 శాతం తగ్గింది. ఫ్లైయాష్, స్లాగ్ కాస్ట్ పెరిగితే, ముడి సరుకు ఖర్చు తగ్గిందని తెలిపింది. ఇక ఆర్థిక ఫలితాల వెల్లడి నేపథ్యంలో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో అల్ట్రాటెక్ సిమెంట్ షేర్ విలువ 0.91 శాతం నష్టంతో ముగిసింది. ఆదాయం తగ్గుతుందన్న అంచనాల మధ్య షేర్ నష్ట పోయింది.

## పీవోఎంఐఎస్ భళా





నెలనెలా ఆదాయాన్ని ఆశించేవారు, సురక్షిత పెట్టుబడులపట్ల ఆసక్తిగలవారు పోస్టాఫీస్ మంత్లీ ఇన్కమ్ స్కీం (పీవోఎంఐఎస్)ను పరిశీలించవచ్చు. ఈ కేంద్ర ప్రభుత్వ పథకం ఆకర్షణీయ వడ్డీరేటును అందిస్తున్నది. అక్టోబర్–డిసెంబర్కు 7.40 శాతం వడ్డీరేటు వస్తున్నది. ఇతర చిన్నమొత్తాల పొదుపు పథకాల వడ్డీరేట్ల మాదిరిగానే ఈ పీవోఎంఐ స్కీం వడ్డీరేటును కూడా మూడు నెలలకోసారి సవరిస్తారు. ఇక ఈ పథకం కచ్చితమైన రాబడులను మదుపరులకు అందిస్తుంది. డెట్ ఇన్వెస్ట్మెంట్ల కంటే అవి ఉత్తమంగానే ఉంటాయి. స్కీం మెచ్యూరిటీ కాలవ్యవధి ఐదేండ్లు. గరిష్ఠంగా రూ.9 లక్షలు పెట్టుబడిగా పెట్టవచ్చు. ఇద్దరు లేదా ముగ్గురితో కలిసి కూడా స్కీంలో చేరవచ్చు. అప్పుడు పెట్టుబడి పరిమితి రూ.15 లక్షలు. ఇక 10 ఏండ్లు దాటిన పిల్లల పేరుతో కూడా స్కీంను తీసుకోవచ్చు.

## దిగిరానున్న నోట్బుక్స్, సైకిల్స్, బాటిల్ వాటర్ ధరలు..! జీఎస్టీ కౌన్సిల్కు మంత్రుల బృందం కీలక సూచనలు..

**న్యూఢిల్లీ–నవభూమి:** కేంద్రం త్వరలో కీలక నిర్ణయం తీసుకోనున్నది. ఈ నిర్ణయంతో రాబోయే రోజుల్లో బాటిల్ వాటర్, సైకిల్స్, నోట్బుక్స్ రేట్లు తగ్గే అవకాశం ఉన్నది. ఆయా వస్తులపై జీఎస్టీ రేటును తగ్గించాలని కేంద్ర ప్రభుత్వ మంత్రుల బృందం సిఫారసు చేసింది. అదే సమయంలో సౌంధర్య సాధనాలు, లగ్జరీ వాచ్లు, బూట్ల ధరలపై జీఎస్టీని పెంచాలని విజ్ఞప్తి చేసింది. జీఓఎం సమావేశానికి హాజరైన సభ్యులు జీఎస్టీ కౌన్సిల్కు ఈ సూచనలు చేశారు. వచ్చే నెలలో జరిగే సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నేతృత్వంలోని జీఎస్టీ కౌన్సిల్ దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది. 20 లీటర్లు అంతకంటే ఎక్కువగా ఉండే బాటిల్ వాటర్పై జీఎస్టీని 18శాతం నుంచి 5శాతానికి తగ్గించాలని మంత్రుల బృందం కోరింది. అలాగే, రూ.10వేలలోపు ఉన్న సైకిల్స్పై జీఎస్టీని 12శాతం నుంచి 5శాతానికి తగ్గించాలని సిఫారు చేసింది.అలాగే, ప్రాక్టీస్ నోట్బుక్కులపై జీఎస్టీని 5శాతానికి తగ్గించాలని సూచించగా.. ఈ ప్రతిపాదనకు జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తెలిపితే.. ధరలు తగ్గే అవకాశం ఉన్నది. ఇక రూ.15వేలు, అంతకన్నా ఎక్కువ ఖరీదు చేసే బూట్లు, రూ.25వేలకు మించి ఉండే లగ్జరీ వాచ్లపై జీఎస్టీ రేటును 18శాతం నుంచి 28శాతానికి పెంచాలని మంత్రుల బృందం సూచించింది. అలాగే, కాస్మోటిక్, హెయిర్ డ్రైయర్స్, హెయిర్ కలర్స్పై సైతం జీఎస్టీని పెంచాలని సూచించింది. అయితే, ప్రతి వర్గానికి చెందిన వారికి ఉపశమనం కలిగించేందుకు మంత్రుల బృందం చొరవ తీసుకుంటుందని గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్లో భాగమైన బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లపై సైతం ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. సిఫారసులపై జీఎస్టీ కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. జీఎస్టీ కౌన్సిల్కు నివేదిక సమర్పించే ముందు ప్యానెల్ మరోసారి సమావేశమవుతుందన్నారు.ప్యానెల్లో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, గోవా, గుజరాత్, మేఘాలయ, పంజాబ్, తమిళనాడు, తెలంగాణకు చెందిన మంత్రులు సైతం ఉన్నారు. అక్టోబర్ నెలాఖరులోగా ప్యానెల్ తన నివేదికను జీఎస్టీ కౌన్సిల్కు సమర్పించాల్సి ఉంటుంది. జీఎస్టీ కోసం ఏర్పాటు చేసిన ఆరుగురు సభ్యుల మంత్రుల బృందం లో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, కేరళ ఆర్థిక మంత్రులు సురేష్ కుమార్ ఖన్నా, గజేంద్ర సింగ్, కృష్ణ బైరే గౌడ, చంద్రిమా భట్టాచార్య, కేఎన్ బాలగోపాల్ ఉన్నారు. ప్రస్తుతం జీఎస్టీలో నాలుగు శ్లాబులు ఉన్నాయి. వీటిలో 5శాతం, 12శాతం, 18శాతం, 28శాతం స్లాబ్స్ ఉన్నాయి. ముఖ్యంగా రోజువారీ, అవసరమైన వినియోగానికి సంబంధించిన వస్తువులు 5శాతం రేటులో ఉంటాయి.

# రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు పెడుతున్నారా.. ఈ సంగతి మరవద్దు!

**న్యూఢిల్లీ–నవభూమి:** రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు పెడుతున్నప్పుడు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పరిశీలించడం చాలాచాలా ముఖ్యం. భవిష్యత్తులో ఆయా వస్తూత్పత్తులు, సేవల ధరల్లో చోటుచేసుకునే పెరుగుదలనే ఈ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా రిటైర్మెంట్ పెట్టుబడులు పెట్టినట్లైతే ఆ వచ్చే సొమ్ము పెరిగిన ధరలకే పోతుంది తప్ప.. మీ అవసరాలకు మాత్రం చాలదు. దీనివల్ల మీ పదవీ విరమణ అనంతరం జీవితం కూడా ఆశించిన స్థాయిలో ఆనందంగా ఉండదు. అందుకే ఇప్పటి ద్రవ్యోల్బణం స్థాయి, అప్పటి ద్రవ్యోల్బణం లెక్కల్ని అంచనా వేసి, దానికి తగ్గట్టుగానే పెట్టుబడులకు వెళ్తే లాభదాయకం.

**పొదుపుపై ధరల దెబ్బ**

రిటైర్మెంట్ సేవింగ్స్పై ద్రవ్యోల్బణం ప్రభావం నిజంగా చెప్పాలంటే చాలా ఎక్కువే. ఎంతోమంది వృద్ధులు వారి పెన్షన్, రిటైర్మెంట్ ఫండ్స్పైనే ఆధారపడి జీవిస్తూంటారు. అయితే పెరిగే ధరలు వారి రిటైర్మెంట్ సేవింగ్స్ వాస్తవ విలువ క్షీణతకు దారితీస్తాయి. దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులు.. సాధారణ వ్యక్తులు, వేతన జీవులనే అధికంగా ప్రభావితం చేస్తుంటాయి. పదవీ విరమణ అనంతరం పెన్షన్ ఆదాయంపై జీవించేవారికీ ద్రవ్యోల్బణం కష్టాలు తప్పవు. అందువల్ల కాబట్టి ముందుగానే ద్రవ్యోల్బణం అంచనాలతో పెట్టుబడులకు దిగితే ఆ ఇబ్బందులను వృద్ధాప్యంలో అధిగమించవచ్చు. లేకపోతే చాలీచాలని ఆదాయంతో సమస్యల్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.

**ఇదీ సంగతి..**

రిటైర్మెంట్ సేవింగ్స్ను ద్రవ్యోల్బణం ఏవిధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం. ఉదాహరణకు.. నేడు మీ ఖర్చులు రూ.5,000 లుగా ఉన్నాయి. అయితే 6 శాతం ద్రవ్యోల్బణం ప్రభావంతో భవిష్యత్తులో ఈ ఖర్చు రూ.5,300లకు పెరిగిందనుకుంటే, వచ్చే 30 ఏండ్లలో.. అది దాదాపు రూ.28,700లను తాకగలదు. దీన్నిబట్టి ఒక్కసారి ఆలోచించండి.. మీరు ఈరోజు బాగానే పొదుపు చేస్తున్నామనుకుంటున్న మొత్తాలు, అప్పటికి ఎంతమేరకు మీ ఖర్చుల్ని భరించగలవోనని.

**అధిక నిధి ఎలా?**

ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి మీ రిటైర్మెంట్ ఫండ్స్ రక్షణకు ఈ విధంగా ప్రయత్నించవచ్చని కొందరు నిపుణులు సలహా ఇస్తున్నారు. వాటి ప్రకారం..

**ఈక్విటీల్లో పెట్టుబడులు**

ద్రవ్యోల్బణాన్ని మించి ఆకర్షణీయ రాబడులను అందుకోవాలంటే.. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పరిశీలించడం ఉత్తమం. దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున ఆదాయం లేదా లాభాలను పొందాలంటే ఈక్విటీ ఇన్వెస్ట్మెంట్స్ సరి అని చెప్పవచ్చు. నిజానికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్తో కూడుకున్నవి. అయితే షార్ట్–టర్మ్ ఇన్వెస్టర్లకే ఈ రిస్క్ ఉంటుందని కూడా గుర్తుంచుకోవాలి. రోజూ చూస్తున్న ఒడిదొడుకులు వీరినే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. లాంగ్–టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది తక్కువే. అందుకే స్వల్పకాల లక్ష్యాలతో ఈక్విటీల్లో పెట్టుబడులకు దిగవద్దు. అందుకు భిన్నంగా ముందుకెళ్తే.. ద్రవ్యోల్బణాన్ని మేనేజ్ చేసే ఆకర్షణీయ రిటర్న్స్ను సొంతం చేసుకోవచ్చు. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకున్నట్లైతే మరింతగా సత్ఫలితాలుంటాయి.

**పెట్టుబడుల వర్గీకరణ**

పెట్టుబడుల వర్గీకరణ వాటికున్న రిస్కుల్ని తగ్గించగలదు. అందుకే మీ పోర్ట్ఫోలియోలో రకరకాల పెట్టుబడి సాధనాలను చేర్చుకోండి. నిపుణుల సూచనల ప్రకారం.. స్టాక్స్లో 30 శాతం, బాండ్లలో 30 శాతం, రియల్ ఎస్టేట్లో 30 శాతం, నగదు–బంగారంపై మిగతా 10 శాతం పెట్టుబడులు పెడితే లాభదాయకంగా ఉంటుంది. ఇలా చేస్తే ఆయా రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు. ఒకట్రెండు రంగాల్లో నష్టాలు వాటిల్లినా.. మిగతా రంగాల్లోని లాభాలతో వాటిని భర్తీ చేసుకోవచ్చు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఈ పెట్టుబడులు కలిసొస్తాయి. అందుకే ఒకే రంగంపై దృష్టి పెడుతూ అందులోనే మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెడితే పెద్దగా వృద్ధికి ఆస్కారం ఉండదు. పైగా సదరు రంగం కుదేలైతే మనమూ మునిగిపోతాం.

**ఫ్లోటింగ్–రేట్ బాండ్లు, ఫండ్లు**

ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్వల్ప కాలంలో మంచి రాబడులను అందుకోవడానికి ఈ ఫండ్లు చక్కగా దోహదం చేయగలవు. సాధారణంగా ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, వడ్డీరేట్లూ ఎక్కువగానే ఉంటాయి. ధరల్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పెంచేస్తుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లూ పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లోటింగ్–రేట్ బాండ్లు, ఫండ్లలో ఇన్వెస్ట్మెంట్లు లాభదాయకం. కాబట్టి ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతున్నప్పుడు ఈ ఫండ్లలో ఇన్వెస్ట్మెంట్లకు దిగితే అదనపు ఆదాయం అందుకోవచ్చు.

**గుర్తుంచుకోండి**

ధరలు పెరుగుతున్నప్పుడు రోజువారీ అవసరాల కోసం పెట్టే ఖర్చులూ పెరుగుతూపోతుంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతూ ఉంటుంది. కనుక ప్రతీ నెలా ఖర్చులు ఏవి? అన్నదానిపై స్పష్టత ఉంచుకుంటే ఎక్కడ అదనపు ఖర్చులుంటున్నాయో గుర్తించవచ్చు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ల ద్వారా కూడా పెట్టుబడులకు దిగి స్టాక్ మార్కెట్లో ప్రవేశించవచ్చు. సురక్షితమైన పెట్టుబడుల కోసం ఎఫ్డీ, ప్రభుత్వ పథకాలు బెటర్. పోస్టాఫీస్ స్కీములూ లాభదాయకమే. ఐటీ మినహాయింపులూ ఉంటాయి.


## కరణ్ జోహార్ ధర్మా ప్రొడక్షన్స్లో 50 శాతం వాటాలు కొనుగోలు చేసిన సీరమ్ సీఈవో



**న్యూఢిల్లీ–నవభూమి:** కరణ్ జోహార్ .. ఈ పేరు గురించి పెద్దగా పరిచయం అక్కర్లేదు. 'కుచ్ కుచ్ హోతా హై' లాంటి బ్లాక్ బస్టర్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన కరణ్ జోహార్.. అతి తక్కువ సమయంలోనే హిందీ చిత్ర పరిశ్రమలో బిగ్గెస్ట్ ఫిల్మ్ మేకర్స్లో ఒకరిగా ఎదిగారు. దర్శకుడిగానే కాదు నిర్మాతగానూ చాలా సినిమాలు చేశారు. తన సొంత నిర్మాణ సంస్థ ధర్మా ప్రొడక్షన్ ద్వారా.. పలు దక్షిణాది సినిమాల్ని హిందీలో రిలీజ్ చేసి.. డిస్ట్రిబ్యూషన్ రంగంలోనూ తన మార్క్ చూపించారు. అయితే, గత కొన్ని రోజులుగా తన నిర్మాణ సంస్థను కరణ్ జోహార్ అమ్మకానికి పెట్టినట్లు తెగ వార్తలు వస్తున్నాయి.

ఈ క్రమంలోనే ధర్మా ప్రొడక్షన్స్ ను రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ సంస్థ కొనుగోలు చేసే అవకాశం ఉందని కూడా వార్తలు వినిపించాయి. అయితే, చివరికి టీకాల తయారీ సంస్థ అయిన సీరం ఇన్స్టిట్యూట్ అధినేత అదర్ పూనావాలా కు ఈ అవకాశం వరించింది. ఈ ధర్మా ప్రొడక్షన్లో పూనావాలా ఏకంగా రూ.వెయ్యి కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నారు. తద్వారా ధర్మా ప్రొడక్షన్లోని 50 శాతం వాటాను అదర్ పూనావాలా నేతృత్వంలోని సెరెన్ ప్రొడక్షన్స్ దక్కించుకోనుంది. ఈ మేరకు ఒప్పందం కూడా చేసుకున్నారు. ఇక ఈ డీల్ తర్వాత ధర్మా ప్రొడక్షన్స్ విలువ ఏకంగా రూ.రెండు వేల కోట్లకు పెరుగుతుందని సెరీన్ ప్రొడక్షన్ పేర్కొంది.ఇకపై ధర్మా ప్రొడక్షన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్గా కరణ్ జోహార్ సినిమా నిర్మాణం చూసుకుంటారని, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా అపూర్వ మెహతా పొడక్షన్ ఆపరేషన్స్ చూసుకుంటారని స్పష్టం చేసింది. భారతీయ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న నేపథ్యంలో, ప్రేక్షకుల అభిరుచి మేరకు హై–క్వాలిటీ కంటెంట్ను క్రియేట్ చేయడంపై తమ ప్రొడక్షన్ దృష్టిసారిస్తుందని

## క్రెడిట్ కార్డ్ బిల్లుల భారం తగ్గాలంటే ఇలా చేయండి..



**న్యూఢిల్లీ–నవభూమి:** క్రెడిట్ కార్డ్ బకాయిల చెల్లింపులకు దారులివీ..

%జతీవఎత్ ఋతీస దీఱశ్రీశ్రీం% ఎ క్రెడిట్ కార్డుల్ని సవ్యంగా వినియోగిస్తే వాటితో ఎన్నో లాభాలుంటాయి. ఆర్థిక పరిస్థితుల నిర్వహణలో వీటి పాత్ర ఎంతో ప్రభావవంతం. కానీ దురదృష్టవశాత్తూ చాలామంది ఈ క్రెడిట్ కార్డుల వాడకంతో మితిమీరిన ఖర్చుల వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలోనే బిల్లులను చెల్లించలేని దుస్థితికి చేరుకుంటున్నారు. అయితే భారమైన క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులకు కొన్ని మార్గాలున్నాయి. వాటిలో..

ఈఎంఐల్లోకి మార్చడం

చాలా క్రెడిట్ కార్డు సంస్థలు బకాయిలను ఈఎంఐల్లోకి మార్చుకునే సౌకర్యం వినియోగదారులకు ఇస్తున్నాయి. నిజానికి మెజారిటీ బ్యాంకులు ఈ సదుపాయాన్ని ఉచితంగానే కార్డుదారులకు అందిస్తున్నాయి. దీనివల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో నగదును సమకూర్చుకునే భారం తప్పుతుంది. అయితే క్రెడిట్ కార్డు బిల్లులను ఈఎంఐల్లోకి మార్చుకునే ముందు కనిపించని చార్జీలు ఏమైనా ఉన్నాయా?, ప్రాసెసింగ్ ఫీజులుంటాయా? అన్నది జాగ్రత్తగా చూసుకోవడం మంచిది.

బిల్లింగ్ విధానంపై అవగాహన

క్రెడిట్ కార్డు వినియోగదారులు తప్పక తమ క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ సైకిల్ను తెలుసుకోవాలి. బ్యాంకులు క్రెడిట్–ఫ్రీ పీరియడ్ను కల్పిస్తాయి. ఇందులో బకాయిల చెల్లింపునకు 30 రోజుల స్టేట్మెంట్ సైకిల్, దానిపై 15 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటాయి. ప్రతి నెలా బిల్లింగ్ సైకిల్ ఏ తేదీన మొదలవుతుందో చూసుకోవాలి. ఆ తేదీ తర్వాత కొంటే మనకు పేమెంట్కు ఎక్కువ సమయం ఉంటుంది. ఉదాహరణకు మీ క్రెడిట్ కార్డు బిల్లు డ్యూ డేట్ ఆగస్టు 4న ఉన్నది. ఆ బిల్లు స్టేట్మెంట్ జూలై 18న వచ్చింది. అయితే జూలై 19న మీరు మీ క్రెడిట్ కార్డు ద్వారా ఓ వస్తువును కొన్నారు. అప్పుడు అది తర్వాతి బిల్లు స్టేట్మెంట్లో ఉంటుంది. దాన్నిబట్టి సెప్టెంబర్ 4వరకు మీరు దాని చెల్లింపునకు వ్యవధి ఉంటుందన్నమాట. ఒకవేళ జూలై 17న కొంటే ఆగస్టు 4కల్లా చెల్లించాల్సిందే. రెండ్రోజులు ఆగి కొనడం వల్ల ఇంత లాభం ఉంటుంది. సమయం ఎక్కువగా ఉండటం వల్ల నగదు సర్దుబాటుకు వీలుంటుంది.

పర్సనల్ లోన్

క్రెడిట్ కార్డు బకాయిలపై పడే వడ్డీరేటు కన్నా.. వ్యక్తిగత రుణాలపై పడే వడ్డీరేటు తక్కువ. కాబట్టి ఎక్కువగా ఉన్న క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించేందుకు పర్సనల్ లోన్ల సహాయం తీసుకోండి. మీ క్రెడిట్ స్కోర్ బాగుంటే వడ్డీరేటు ఇంకా తగ్గుతుంది. అలాగే మినిమం కంటే ఎక్కువగా క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లిస్తే మంచిది. అధిక వడ్డీ బకాయిలను ముందుగా చెల్లించాలి. తక్కువ మొత్తాలను తీర్చడానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. అంతకన్నా ముందు అనవసరపు కొనుగోళ్లను తగ్గిస్తే బిల్లుల భారం తగ్గుతుంది.

## అప్రమత్తత అవసరం.. ఈ వారం దేశీయ మార్కెట్లు ఎలా ఉంటాయంటే?



**న్యూఢిల్లీ–నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. ప్రతికూల పరిణామాల మధ్య మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణలకే పెద్దపీట వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 156.61 పాయింట్లు లేదా 0.19 శాతం క్షీణించి 81,224.75 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 110.20 పాయింట్లు 0.44 శాతం పతనమై 24,854.05 దగ్గర ఆగింది.

ఈ క్రమంలో ఈ వారం కూడా అమ్మకాల ఒత్తిడికే ఎక్కువగా వీలున్నట్టు అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) ద్వితీయ త్రైమాసికానికి (జూలై–సెప్టెంబర్)గాను కార్పొరేట్ కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు గత వారం మాదిరే ఈ వారం కూడా మార్కెట్ ట్రేడింగ్ను ప్రభావితం చేయనున్నాయి మరి. అందుకే మదుపరులు అప్రమత్తంగా ఉండాలని, ఇన్వెస్ట్మెంట్లపై ఆచితూచి స్పందించడం ఉత్తమమని మెజారిటీ ఎక్స్పర్ట్స్ అభిప్రాయం.ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిస్థితులు, డాలర్తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈసారీ భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. సెల్లింగ్ ప్రెషర్ భారీగా ఉంటే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,300–25,500 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

## స్టైలిష్గా బజాజ్ పల్సర్ ఎన్125.. ఇవీ డిటెయిల్స్..!



**న్యూఢిల్లీ–నవభూమి:** ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ బజాజ్ ఆటో తన బజాజ్ పల్సర్ ఎన్125 మోటారు సైకిల్ త్వరలో భారత్ మార్కెట్లో ఆవిష్కరించనున్నది. న్యూ పల్సన్ ఎన్125 మోటారు సైకిల్ అగ్రెసివ్ స్టైలింగ్తో వస్తోంది. ఎల్ఈడీ హెడ్ లైట్ తోపాటు ముందు ప్లాస్టింగ్ క్లాడింగ్ ఉంటుంది. బజాజ్ ఎన్150 నుంచి వీల్స్, బజాజ్ ఫ్రీడం 125 నుంచి డిస్ ప్లే ఇండికేటర్ ఉంటాయి. అంటే బజాజ్ ఎన్125 మోటారు సైకిల్ ప్రాథమికంగా ఇన్ బిల్ట్ బ్లూటూత్ కనెక్టివిటీ ఫీచర్తో వస్తోంది.

బజాజ్ పల్సర్ ఎన్125 మోటారు సైకిల్ స్ప్లిట్ సీట్, సైడ్ ప్యానెల్, టెయిల్ సెక్షన్ మీద కొన్ని నూతన గ్రాఫిక్స్ ఉంటాయి. టీవీఎస్ రైడర్, హీరో ఎక్స్ ట్రీం 125 ఆర్ వంటి మోటారు సైకిళ్ల మాదిరిగా స్ప్లిట్ సీట్ కలిగి ఉంటుంది. దీని ధర రూ.90 వేల నుంచి రూ.1.10 లక్షల మధ్య (ఎక్స్ షోరూమ్) పలుకుతుందని భావిస్తున్నారు.

## ఎంజీ ఆస్టర్ కారు ధర కాస్ట్లీ.. నాలుగు నెలల్లో రెండోసారి..!

**న్యూఢిల్లీ–నవభూమి:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఎంజీ మోటార్స్ తన కంపాక్ట్ ఎస్యూవీ ఎంజీ ఆస్టర్ (%వీ+ ౠర్శతీ%) ధర రూ.27 వేలు పెంచేసింది. ఈ ఏడాదిలోనే భారత్ మార్కెట్లో ఎంజీ మోటార్స్ తన ఎంజీ ఆస్టర్ ఫేస్ లిఫ్ట్ కారు ఆవిష్కరించింది. 49 పై చిలుకు సేఫ్టీ ఫీచర్లతోపాటు 14 లెవల్–2 అడాస్ ఫీచర్లు, పర్సనల్ ఏఐ అసిస్టెంట్తో వస్తోంది. ఎంజీ మోటార్స్ తన కంపాక్ట్ ఎస్యూవీ కారు ధర పెంచడం నాలుగు నెలల్లో రెండోసారి కావడం గమనార్హం.ఎంజీ ఆస్టర్ సావీ ప్రో 1.3 టర్బో ఏటీ (సాంగ్రియా రెడ్) వేరియంట్, సీవీటీ (ఐవోరీ), 1.5 సీవీటీ (సాంగ్రియా రెడ్) మోడల్ కార్ల ధరలు రూ.27 వేలు పెరుగుతాయి. మరోవైపు షార్ప్ ప్రో 1.5 లీటర్ల సీవీటీ (ఐవోరీ) ధర రూ.26 వేలు పెరుగుతుందని ఎంజీ మోటార్స్ తెలిపింది. ఇక సెలెక్టెడ్ 1.5 సీవీటీ (ఐవోరీ) ధర రూ.21 వేలు, షార్ప్ ప్రో 1.5 లీటర్ల మాన్యువల్ ట్రాన్స్ మిషన్ (ఐవోరీ) వేరియంట్ రూ.24 వేలు వృద్ధి చెందుతాయి.ఇంకా సెలెక్ట్ 1.5 లీటర్ల మాన్యువల్ ట్రాన్స్మిషన్ (ఐవోరీ), షైన్ 1.5 లీటర్ల మాన్యువల్ ట్రాన్స్ మిషన్ (ఐవోరీ) వేరియంట్ ధరలు రూ.20 వేలు పెరుగనున్నది. ఈ ఏడాది జూన్ లో ఎంజీ ఆస్టర్ కారు ధర రూ.26,800 పెంచింది. ఎంజీ ఆస్టర్ కారు ధర రూ.9.98 లక్షల నుంచి రూ.18.35 లక్షలు (ఎక్స్ షోరూమ్) మధ్య పలుకుతుంది. కియా సెల్టోస్, హ్యుండాయ్ క్రెటా, మారుతి గ్రాండ్ విటారా, టయోటా హై రైడర్, హోండా ఎలివేట్, ఫోక్స్ వ్యాగన్ టైగూన్, స్కోడా కుషాక్ వంటి కార్లకు గట్టి పోటీ ఇవ్వనున్నది ఎంజీ ఆస్టర్.న్యూ ఎంజీ ఆస్టర్ కారు ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు, ఆటో డిమ్మింగ్ ఐఆర్వీఎం అండ్ వైర్ లెస్ ఫోన్ చార్జర్ వంటి పలు కొత్త ఫీచర్లతో వస్తోంది. 14 లెవల్–2 సేఫ్టీ ఫీచర్లు, 49o సేఫ్టీ ఫీచర్లతోపాటు 360–డిగ్రీ అరౌండ్ వ్యూ కెమెరా, 10.1 అంగుళాల ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ విత్ స్మార్ట్ 2.0 యూఐ వంటి ఫీచర్లు ఉంటాయి. వాతావరణం, వార్తలు, క్యాలికులేటర్, జియో వాయిస్ రికగ్నిషన్ సిస్టమ్ తోపాటు వాయిస్ కమాండ్స్, వైర్ లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లే కనెక్టివిటీకి మద్దతుగా ఇన్ ఫో టైన్ మెంట్ సిస్టమ్ పని చేస్తుంది.ఇంకా ఎంజీ ఆస్టర్ కారులో ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, పనోరమిక్ సన్ రూఫ్, 6–వే పవర్ అడ్జస్టబుల్ డ్రైవర్ సీట్ తోపాటు 6– ఎయిర్ బ్యాగ్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ అసెంట్, డీసెంట్ కంట్రోల్, హీటెడ్ ఓఆర్వీఎంతోపాటు అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, ఫార్వర్డ్ కొల్లిషన్ వార్నింగ్, ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్, లేన్ కీపింగ్ / డిపార్చర్ అసిస్ట్, బ్లైండ్ స్పాట్ డిటెక్షన్ వంటి అడ్వాన్స్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ (అడాస్) ఫీచర్లు ఉంటాయి. ఇక ఎంజీ ఆస్టర్ కారు 1.5 లీటర్ల నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ (110 పీఎస్ విద్యుత్, 144 ఎన్ఎం టార్క్), 1.3 లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్ (140 పీఎస్ విద్యుత్, 220 ఎన్ఎం టార్క్) కలిగి ఉంటుంది. రెండు ఇంజిన్ ఆప్షన్లలోనూ 6–స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్, 6–స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్, సీవీటీ ఆప్షన్లు ఉంటాయి.

# సరిహద్దుల వివాదంలో కీలక పురోగతి.. భారత్-చైనా మధ్య ఒప్పందం






**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్, చైనా మధ్య వాస్తవాధీన రేఖ వెంబడి గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న ప్రతిష్టంభన, దీనిపై ఇరుదేశాల మధ్య జరుగుతున్న చర్చల్లో కీలక పురోగతి కనిపించింది. దీనిపై ఇరుదేశాలు ఒక ఒప్పందానికి వచ్చాయి. వాస్తవాధీన రేఖ వెంబడి పెట్రోలింగ్‌ను పునరుద్ధరించాలని ఇండియా-చైనా నిర్ణయించినట్టు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి తెలిపారు. సోమవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత కొన్ని వారాలుగా దౌత్య, సైనిక స్థాయిలో భారతదేశం-చైనా మధ్య చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. ఫలితంగా ఎల్ఏసీ వెంబడి పెట్రోలింగ్ ఏర్పాట్లపై ఒక అవగాహన కుదిరిందని తెలిపారు. బలగాల ఉపసంహరణ, పరిస్థితిని చక్కదిద్దేందుకు పెట్రోలింగ్ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. రష్యాలో జరుగనున్న బ్రిక్స్ సదస్సుకు ప్రధానమంత్రి మోదీ వెళ్తున్న నేపథ్యంలో ఈ తాజా పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, చైనా ప్రధాని జిన్‌పింగ్ ద్వైపాక్షిక చర్చలు జరిపేందుకు సమావేశమవుతారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



# ఇంకా 15 దేశాలకు బ్రిటన్ 'రాజు'.. ఆస్ట్రేలియాలో మాత్రం ఆగ్రహం



**న్యూఢిల్లీ-నవభూమి:** రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం.. ఈ పేరు వినివిని అందరికీ వెగటు పుట్టింది. కచ్చితంగా చెప్పాలంటే ఇప్పుడు అసలు ఆ బ్రిటిన్ దేశమే ముక్కలయ్యే పరిస్థితి వచ్చింది. కానీ, ఆశ్చర్యకరం ఏమంటే.. బ్రిటన్ రాజు ఇప్పటికీ 15 దేశాలకు రాజుగా కొనసాగుతున్నారు. రెండేళ్ల కిందటి వరకు ఎలిజబెత్ రాణి ఉండగా.. ఆమెనే ఈ దేశాలన్నిటికీ రాణిగా కొనసాగింది. బ్రిటిష్ సామ్రాజ్యం విచ్ఛిన్నమై.. ఏ దేశానికి ఆ దేశం స్వతంత్రంగా, గణతంత్రంగా మారినప్పటికీ పలు దేశాలకు బ్రిటన్ రాజు లేదా రాణిలే అధికారిక రాజు లేదా రాణి. కారణం కామన్వెల్త్.. కామన్వెల్త్.. ఒకప్పుడు బ్రిటన్ పాలనలో ఉన్న దేశాలన్నిటినీ కలిపి కామన్వెల్త్ దేశాలుగా పేర్కొంటారు. వీటిలో కొన్నింటికి ఇంకా బ్రిటన్ రాజ వంశమే రాజు/రాణి. భారత్ మాత్రం స్వాతంత్ర్యం తర్వాత గణతంత్ర రాజ్యంగా మారింది. బ్రిటన్ రాజ కుటుంబాన్ని గౌరవ రాజు/రాణిగా అంగీకరించేది లేదని తేల్చిచెప్పింది. మరోవైపు ఇదే అంశం (ఎలిజబెత్ ను రాణిగా పరిగణించడం)పై భారత్ తో కెనడా కొన్ని దశాబ్దాల కిందట తీవ్రంగా విభేదించింది. అయితే, ఆస్ట్రేలియా వంటి పెద్ద దేశానికి సైతం బ్రిటన్ రాజు లేదా రాణి (అనధికారిక) రాజుగా ఉండడం గమనార్హం. అప్పుడు రాణి.. ఇప్పుడు రాజు.. వాస్తవానికి ఆస్ట్రేలియా 100 ఏళ్లకు పైగా బ్రిటిష్ పాలనలో ఉంది. ఈ సమయంలోనే అక్కడి ఆదివాసులను తుడిచిపెట్టేశారనే ఆరోపణలున్నాయి. చివరకు 1901లో ఆస్ట్రేలియా స్వాతంత్ర్యం పొందింది. గణతంత్రం (రిపబ్లిక్)గా మాత్రం ఏర్పడలేదు. అందుకే మొన్నటివరకు ఎలిజబెత్ రాణి, ప్రస్తుతం ఆమె కుమారుడు చార్లెస్- 2 రాజుగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి ఎలిజబెత్ ఉన్నప్పుడే ఆమెను ఆస్ట్రేలియా రాణి హోదా నుంచి తప్పించాలని ప్రయత్నాలు సాగాయి. ఆమె స్థానంలో ఎంపీలు ఎన్నుకున్నవారిని రాజు లేదా రాణిగా నియమించాలనే 1999లో ఓటింగ్ నిర్వహించారు. అయితే, అప్పట్లో స్వల్ప మెజారిటీతో ఈ తీర్మానం వీగిపోయింది. ఆస్ట్రేలియాలో ఆదివాసీ కన్సల్టేటివ్ అసెంబ్లీ ఏర్పాటుకు తీర్మానాన్ని కూడా 2023లో పార్లమెంట్ భారీ మెజారిటీతో తిరస్కరించింది. చార్లెస్ ప్రస్తుతం ఆస్ట్రేలియా, సమోవా దేశాల్లో పర్యటిస్తున్నారు. చార్లెస్ నువ్విక మా రాజు కాదు.. చార్లెస్ కు ఆస్ట్రేలియా పార్లమెంటులో అనూహ్య షాక్ తగిలింది. సోమవారం ఆస్ట్రేలియా పార్లమెంటులో ఆయన ప్రసంగిస్తుండగా.. ఆదివాసీ సెనెటర్ లిడియా థోర్పే గళం విప్పారు. రాజరికానికి వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేశారు. 'ఇది మా భూమి. దీనిని తిరిగిచ్చేయండి. మీరు మా రాజు కాదు. దోచుకున్న సొమ్ము మొత్తం వెనక్కివ్వండి. మా ఆదివాసీలను యూరప్ వలసదారులు దారుణంగా హతమార్చారు" అంటూ నిమిషం పాటు కేకలు వేశారు. బ్రిటన్ రాజరికానికి ఇప్పుడే కాదు.. థోర్పే ఎప్పుడూ వ్యతిరేకినే. రెండేళ్ల కిందట ప్రమాణ స్వీకార సమయంలో ఎలిజిబెత్-2ను వలస రాజ్య పాలకురాలు అని పేర్కొన్నారు.

## దూసుకొస్తున్న దానా తుఫాన్.. ఏపీ, ఒడిశాలకు భారీ వర్షసూచన



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడనం వాయవ్య దిశగా దూసుకొస్తోంది, క్రమంగా బలపడి వాయుగుండంగా, ఆ తర్వాత తుఫాన్ గా మారనుందని పేర్కొంది. ఈ తుఫానుకు దానా తుఫాన్ గా నామకరణం చేశారని వెల్లడించింది. ఈ దానా తుఫాన్ పూరీ సమీపంలో తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది. తుఫాన్ ప్రభావంతో రాగల మూడు నాలుగు రోజులు ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాబట్టి ఈ నెల 24 వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

## సలాం పోలీసన్నా.. నీ సేవలు వెలకట్టలేనివి



**హైదరాబాద్- నవభూమి:** "కనిపించే మూడు సింహాలు నీతికి న్యాయానికి ధర్మానికి సంకేతాలైతే.. కనిపించని నాలుగో సింహమేరా పోలీస్"... ఇది ఓ సినిమాలో హీరో చెప్పే డైలాగ్. కొందరి పోలీసులను చూస్తే ఇది నిజమే అనిపిస్తుంది. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రపంచమంతా నిద్రపోతున్నా తాను మాత్రమే మేల్కొని డ్యూటీ చేసేది ఒక్క పోలీసు మాత్రమే. కుటుంబాన్ని, పండగలు పబ్బాలను సైతం త్యజించి... ప్రజల కోసం పనిచేసే రక్షక భటుల సేవలు అనిర్వచనీయం. ఒక్కోసారి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సి వస్తదని తెలిసినా వెనుకడుగు వేయని ధీరులు. అసలు పోలీసులు లేని వ్యవస్థను ఊహించలేం. ప్రజల రక్షణ కోసం పనిచేస్తూ విధి నిర్వహణలో ఎందరో అమరులైన సంఘటనలు ఉన్నాయి. సమాజంలో శాంతి భద్రతలను కాపాడడమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తారు. 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటారు. దేశ సరిహద్దుల్లో సైనికులు దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం అర్పిస్తారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు తమ ప్రాణాలను అర్పిస్తున్నారు. దేశవ్యాప్తంగా అనేక మంది పోలీసులు నేరాలను అదుపు చేసే క్రమంలో ప్రాణాలు కోల్పోయారు. నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

1959 అక్టోబర్ 21న భారత జవాన్‌లు జమ్ముకాశ్మీర్ రాష్ట్రం లడక్ జిల్లాలోని లెహ్ ప్రాంతంలో బందోబస్తులో ఉన్నారు. చైనా సైనికులు భారత జవాన్‌లపై దాడి చేయడంతో 11 మంది జవాన్‌లో మృతిచెందారు. వారి మృతదేహాలను తీసుకువచ్చే వీలు లేకపోవడంతో జవాన్‌ల మృతదేహాలను అక్కడే ఖననం చేశారు. కుటుంబీకులు వారిని కడసారి చూపునకు సైతం నోచుకోలేదు. అసువులు బాసిన జవాన్‌ల ఆత్మలకు శాంతి కలగాలని ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**తెలుగు రాష్ట్రాల్లో పోలీసుల సంస్మరణ కార్యక్రమాలు..**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం నుంచి ఈ నెల 31 వరకు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఓపెన్ హౌజ్ నిర్వహించి పోలీసు విధులు, త్యాగాలు, సాంకేతిక వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. ఆన్‌లైన్‌లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నారు. బెల్లంపల్లిలో డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. కానిస్టేబుల్ నుంచి ఎఎస్ఐ స్థాయి అధికారి వరకు పోలీసులకు వ్యాసరచన పోటీలు (సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగు పర్చడం), ఎస్ఐ స్థాయి నుంచి ఆపై అధికారులకు (ధృడమైన శరీరంలో ధృడమైన మనసు) వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. బెల్లంపల్లి జిల్లా వ్యాప్తంగా ఆయా సబ్ డివిజన్‌లు, పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు, అమరులకు నివాళులర్పించనున్నారు. ఏపీలోనూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోలీసు కళాబృందాలతో ఈ నెల 31 వరకు ప్రధాన కూడళ్ల వద్ద కళాజాత చేపట్టనున్నారు. ఒక్కోసారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టాల్సి వస్తుందని తెలిసినా వెనుకడుగు వేయని ధీరులు పోలీసులు. వారు లేని వ్యవస్థను ఊహించలేం. ప్రజల రక్షణ కోసం పనిచేస్తూ విధి నిర్వహణలో ఎందరో అమరులయ్యారు. నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా వారి సేవలను స్మరించుకుంటూ నివాళులర్పిద్దాం.

## భారత్‌కు తిరిగి వెళ్లిపోండి!




**న్యూఢిల్లీ- నవభూమి:** కెనడాలో నివసించే భారతీయులపై విద్వేష నేరాలు పెరిగిపోతున్నాయని భారత సంతతికి చెందిన కెనడా పౌరుడు అశ్విన్ అన్నామలై ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి 'ఎక్స్'లో ఆయన ఒక వీడియోను షేర్ చేశారు. అందులో అశ్విన్‌ను భారతీయుడిగా భావించిన ఒక మహిళ జాత్యాహంకార వ్యాఖ్యలు చేసింది. ఈ అనుభవం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఇటువంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.

## ఫడ్నవిస్‌ను ఉద్ధవ్ థాకరే కలిశారంటూ ఆసక్తికర ప్రచారం



**న్యూఢిల్లీ-నవభూమి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 'మహా వికాస్ అఘాడి'కూటమి పొత్తుల్లో ప్రతిష్ఠంభన కొనసాగుతుండటంతో తాజాగా ఓ ఆసక్తికర అంశం తెరపైకి వచ్చింది. ఎంవీఏలో కీలక పార్టీగా ఉన్న శివసేన సారథి ఉద్ధవ్ థాకరే ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ను కలుసుకున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ఇటీవల ముంబై వచ్చినప్పుడు థాకరే, ఫడ్నవిస్ సమావేశమైనట్టు ఈ కథనాల సారాంశం. ఈ ప్రచారాన్ని శివసేన యూబీటీ కీలక నేత సంజయ్ రౌత్ ఆదివారంనాడు తోసిపుచ్చారు. అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు. ఇదే సమయంలో మహారాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని త్యాగాలకు సిద్ధం కావాలంటూ ఎంవీఏ పొత్తుల్లో తలెత్తిన ప్రతిష్ఠంభనపై పరోక్షంగా కాంగ్రెస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

త్యాగాలకు సిద్ధపడాలి..ఎంవీఏ మధ్య సీట్ల షేరింగ్‌పై రౌత్ మాట్లాడుతూ.. "ప్రతి ఒక్కరూ కొన్ని త్యాగాలకు సిద్ధపడాలి. ఒక అడుగు వెనక్కి వేయాలి" అని అన్నారు. చాలా ఏళ్లుగా తామంతా రాజకీయాల్లో ఉన్నామని, అందువల్లే ప్రతి పార్టీ తమ కార్యకర్తలను అభ్యర్థులుగా నిలబెట్టాలని అనుకుంటుందని అన్నారు. అయితే ఇప్పుడు కూటమిగా ఏర్పడినందున, ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయం చెప్పుకునే హక్కు ఉంటుందని, అయితే సీట్ల షేరింగ్ విషయానికి వచ్చేసరికి కొన్ని సర్దుబాట్లు, త్యాగాలు చేయాల్సి వస్తుందన్నారు.

దేశం కోసం, మహారాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రత్యర్థులను ఓడించాలనే కారణంతోనే గత ఎన్నికల్లో (లోక్‌సభ) సీట్ల షేరింగ్ విషయంలో తాము పెద్దమనసు చూపించామని చెప్పారు. "ఇవాళ మహారాష్ట్రలో మమ్మల్ని అధికారంలోంచి తొలగించారు. అవినీతి ప్రభుత్వం అధికారంలో ఉంది" అని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్ల కోసం పట్టుబడుతున్న నేపథ్యంలో సంజయ్ రౌత్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

## 427 కిలోల డ్రగ్స్ పట్టివేత.. పోలీసుల అదుపులో ఓ వ్యక్తి



**న్యూఢిల్లీ- నవభూమి:** దేశంలో గత కొన్ని నెలలుగా పెద్ద ఎత్తున డ్రగ్స్ దందా వెలుగులోకి వస్తుంది. ఇటివల దేశ రాజధాని ఢిల్లీలో 5 వేల కోట్ల విలువైన డ్రగ్స్ దొరికిన ఘటన మరువక ముందే, తాజాగా మరోకటి వెలుగులోకి వచ్చింది. గుజరాత్‌లోని భరూచ్ జిల్లాలోని అంక్లేశ్వర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ ఫ్యాక్టరీ నుంచి నిషేధిత మెథాంఫెటమైన్ , 427 కిలోల ఇతర డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత మెథాంఫెటమైన్ మొత్తం విలువ రూ.14 లక్షలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో ఒకరిని అరెస్టు చేశారు. అంక్లేశ్వర్ జీఐడీసీ ప్రాంతంలో ఉన్న అవసార్ ఎంటర్‌ప్రైజ్ నుంచి ఈ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు..ఈ పదార్థాలు నిర్ధారణ కోసం ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీకి పంపించారు. భరూచ్ జిల్లా , సూరత్ పోలీసుల బృందం ఆదివారం రాత్రి ఫ్యాక్టరీపై దాడి చేసినట్లు స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆనంద్ చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా రూ.14.10 లక్షల విలువైన 141 గ్రాముల ఎండీని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఒకరిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కేసు విచారణ కొనసాగుతోంది. దీనికి ముందు..అంతకుముందు అక్టోబర్ 13న గుజరాత్ ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి అంక్లేశ్వర్‌లోని అవ్కార్ డ్రగ్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీ నుంచి రూ.5000 కోట్ల విలువైన 500 కిలోలకు పైగా కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జరిగిన వారం తర్వాత, ఇక్కడ మరో దాడి జరిగింది. దీనికి కొద్ది రోజుల ముందు కూడా ఢిల్లీ పోలీసులు రాజధానిలోని గోదాముపై దాడి చేసి 562 కిలోల కొకైన్, 40 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీలోని రమేష్ నగర్‌లోని ఓ దుకాణంపై దాడి చేయగా, అక్కడ నుంచి 208 కిలోల కొకైన్ లభ్యమైంది. అక్రమంగా..ఈ నిషేధిత డ్రగ్స్ అంకాలేశ్వర్‌కు చెందిన అవ్కార్ డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీ నుంచి వచ్చిన ఫార్మా సొల్యూషన్ సర్వీసెస్ కంపెనీకి చెందినదని విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. అయితే వరుసగా గుజరాత్, ఢిల్లీ వంటి ప్రాంతాల్లోనే ఈ డ్రగ్స్ దొరకడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. గుజరాత్ తీర ప్రాంతానికి చేరువలో ఉన్న క్రమంలో సులంభంగా దుండగులు అక్రమంగా డ్రగ్స్ రవాణా చేసి దేశంలో విక్రయించేందుకు సిద్ధమవుతున్నారని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎప్పటికప్పుడు సోదాలు చేస్తూ అధికారులను అప్రమత్తం చేసినట్లు ఉన్నతాధికారులు అంటున్నారు.

## ట్రంప్ కోసం లాటరీ తీస్తున్న మస్క్... రోజుకు రూ.8.4 కోట్లు!



**వాషింగ్టన్-నవభూమి:** నవంబర్ 5వ తేదీన అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్ల అధ్యక్ష అభ్యర్థిగా వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్.. రిపబ్లికన్స్ అభ్యర్థిగా మాజీ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్.. ప్రత్యర్థిపై విమర్శనాస్త్రాలతో, ప్రజలపై హామీల వర్షాలతో ప్రచార కార్యక్రమాలతో దూసుకెళ్లిపోతున్నారు. ఇక వీరికి బ్యాక్ బోన్ గా పలు టీమ్ లు సపోర్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... కమలా హారిస్ కోసం వైట్ డ్యూడ్స్ ఫర్ హారిస్, డెమోక్రాటిక్ నేషనల్ ఫైనాన్స్ కమిటీ, ఏఏపీఐ విక్టరీ ఫండ్ మొదలైన సంస్థలు పని చేస్తుండగా... ట్రంప్ కి కూడా ఇలాంటి సంస్థలతో పాటు ఎలాన్ మస్క్ సహాయ సహకారాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. అవును... డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యే వరకూ ఆయన వెంటే ఉంటానంటూ స్పేస్ ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రకటించిన సంగతి తెలిసిందే. వాక్ స్వాతంత్ర్యం, తుపాకీ హక్కులపై తాము రూపొందించిన పిటిషన్ పై సంతకాలు చేసే స్వింగ్ స్టేట్లలో రిజిస్టర్ అయిన ప్రతీ ఓటరుకు 47 డాలర్లు ఇస్తామని ఇప్పటికే ప్రకటించారు. ఈ క్రమంలో ఎలాన్ మస్క్ సరికొత్త అలోచనను తెరపైకి తెచ్చారు. ఇందులో భాగంగా... పెన్సిల్వేనియాలో రిజిస్టర్డ్ ఓటర్ల నుంచి రోజూ డ్రా తీస్తామని.. వారిలో ఎంపికైన ఓటరుకు 1 మిలియన్ డాలర్స్ (సుమారు రూ.8.4) కోట్లు అందజేస్తామని తెలిపారు. నవంబర్ 5 వరకూ ఈ లాటరీ కొనసాగుతుందని వెల్లడించారు. దీంతో... ట్రంప్ కోసం మస్క్ తన అసాధారణ సంపదను ఉపయోగిస్తున్నాడనే చర్చ తెరపైకి వచ్చింది. అయితే... అమెరికా ఎన్నికల చట్ట ప్రకారం ఇలా తాయిలాలు ప్రకటించడం చట్టబద్ధమేనని అంటున్నారు. ఇది ట్రంప్ కు ఓటు వేసే వారిని గుర్తించేందుకు జరిగే ప్రయత్నమే తప్ప.. అభ్యర్థికి ఓటుకోసం నేరుగా డబ్బు చెల్లించడం కిందకు రాదని చెబుతున్నారు.

## వైరల్ డిమాండ్... "గడ్డాన్ని వదులుకో.. లేదా, గర్ల్ ఫ్రెండ్‌ని వదులుకో"!




**న్యూఢిల్లీ- నవభూమి:** సాధారణంగా ఒకప్పుడు.. గెడ్డం పెంచుకుని తిరుగుతుంటే.. లవ్ ఫెయిల్యూర్ అనో, వారికి ఉన్నన్ని కష్టాలు ఎవరికీ లేవనో అనుకునేవారు! అయితే.. ఇటీవల కాలంలో చాలా మంది అబ్బాయిలు వెరైటీ స్టైల్స్ లో గడ్డం పెంచుకుంటున్నారు. చియాన్ విక్రమ్ ని చూసో, కేజీఎఫ్ ఎఫెక్టో కానీ.. ఇటీవల కాలంలో ఈ ట్రెండ్ కాస్త ఎక్కువగానే కొనసాగుతోంది. రకరకాల పేర్లతో వెరైటీ వెరైటీ గడ్డాలు పెంచుతున్నారు. వాటి కోసం ప్రత్యేకమైన ఆయిల్, స్పెషల్ క్రీమ్ / జెల్ లు మెయింటైన్ చేస్తున్నారు. ఇక మరికొంతమందికైతే గడ్డం పెంచడం అసలూ ఇష్టం ఉండదు. మార్నింగ్ క్లీన్ షేవ్ చేసుకోవడం వారికి రొటీన్. అలాకాకపోతే జెంటిల్ మేన్ లుక్ రాదని, సమాజం తమను చూసే చూపు మారుతుందని భావిస్తుంటారు. మరికొంతమందైతే తన గర్ల్ ఫ్రెండ్ కి ఇష్టమని చెప్పి మరీ గడ్డం పెంచుతుంటారు. 'గడ్డం పెంచితే ఆ రఫ్ లుక్ నీకు చాలా బాగుంటుంది' అని ఆమె అనడమే ఆలస్యం! ఈ నేపథ్యంలో... తమకు మాత్రం గడ్డం ఉన్నవాళ్లంటే ఇష్టంలేదని చెబుతూ రోడ్డుపై ర్యాలీ తీసి మరీ నిరసన చేపట్టారు.

**కొంతమంది యువతులు!**

అవును... మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో కాలేజీ అమ్మాయిలు ర్యాలీ చేపట్టి మరీ నిరసన తెలిపారు. దానికి కారణం... వాళ్లకు గడ్డం ఉన్న వాళ్లంటే ఇష్టం లేదంట. గడ్డంలా మాస్కులు ధరించి, ఫ్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. ఈ సందర్భంగా... "బియర్డ్ హటావో.. నైతో, గర్ల్ ఫ్రెండ్ భూల్ జావో" (గడ్డాన్ని వదులుకో.. లేదా, గర్ల్ ఫ్రెండ్ ని వదులుకో) అని రాసి ఉన్న ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఇదే సమయంలో... "గడ్డం తీసేయండి.. ప్రేమను పొందుకోండి" అని నినాదాలు చేశారు. ఇది చూసిన గడ్డం ఉన్నవాళ్లు షాకవుతున్నారంట!

## అయోధ్య వివాద పరిష్కారం కోసం దేవుడ్ని ప్రార్థించా.. జస్టిస్ చంద్రచూడ్ ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ- నవభూమి:** దేశ చరిత్రలో ఒక వివాదం శతాబ్దానికిపైగా నానుతూ వచ్చింది. చివరకు దేశ అత్యున్నత ధర్మాసనం తీర్పుతో సద్దుమణిగింది. అదే అయోధ్య రామజన్మ భూమిపై వివాదం. తీవ్ర ఉద్రిక్తతను రాజేసిన ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్( 2019లో తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయోధ్యలో వివాదంలో ఉన్న భూమి రాములవారికి చెందిందేనని అయిదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం తీర్పు ఇవ్వడం, కేంద్ర ప్రభుత్వం రాముల వారి గుడి నిర్మాణానికి సిద్ధం కావడం, ఆలయ నిర్మాణం పూర్తి కావడం అన్ని చకచకా జరిగిపోయాయి.

ఈ ఏడాది జనవరిలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అయోధ్య ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. అయితే కీలక తీర్పు వెలువరించిన జస్టిస్ డీవై చంద్రచూడ్ తొలిసారిగా ఈ అంశంపై మాట్లాడారు. వివాదాలు అలుముకున్న ఈ కేసును డీల్ చేస్తున్నప్పుడు తనకు ఎదురైన అనుభవాలను మీడియాతో పంచుకున్నారు. తన స్వగ్రామమైన మహారాష్ట్రలోని కన్హెర్సర్‌ను జస్టిస్ చంద్రచూడ్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు సన్మాన సభ ఏర్పాటుచేశారు. రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదానికి పరిష్కారం కోసం తాను దేవుడిని ప్రార్థించానని, విశ్వాసం ఉంటే దేవుడు మార్గాన్ని చూపిస్తాడని జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. తరుచూ కేసులు వస్తుంటాయని, కానీ కొన్ని పరిష్కారం చూపలేనంత క్లిష్టంగా ఉంటాయన్నారు. అయోధ్య విషయంలోనూ అదే జరిగిందని తెలిపారు. 'మా వద్దకు తరచూ చాలా కేసులు వస్తుంటాయి. కానీ మేం కొన్నింటికి ఒక్క పరిష్కారంతో రాలేం. అయోధ్యలోని రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదం కేసు విచారణ సమయంలో మూడు నెలల పాటు మాకు అలాగే జరిగింది. నేను భగవంతుడి ఎదుట నిలబడి పరిష్కారం చూపమని వేడుకున్నా' అని జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. తాను రోజూ దేవుడ్ని పూజిస్తానని ఆయన అన్నారు. భగవంతుడిపై నమ్మకం ఉంటే తప్పకుండా సమస్యకు పరిష్కారం చూపుతాడని తెలిపారు.

## భగ్గుమన్న గ్రూపు తగాదాలు.. కాల్పుల్లో ఒకరి మృతి




**న్యూఢిల్లీ- నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం సాయిత్రం కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. జహంగీర్‌పురిలో రెండు గ్రూపుల మధ్య చెలరేగిన కాల్పుల్లో ఒకరు మృతి చెందగా, ఇరువురు గాయపడ్డారు. ఇరు గ్రూపుల మధ్య మాటామాటా పెరిగి కాల్పులకు దారితీసినట్టు చెబుతున్నారు. కాల్పుల్లో మరణించిన వ్యక్తిని దీపక్ (35)గా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం, 900 వాలీ గలిలోని పార్క్ సమీపంలో దీపక్ తన సోదరుడు, కొందరు మిత్రులతో కలిసి ఉండగా, నరేంద్ర, సూరజ్ అనే ఇద్దరు తమ గ్రూపుతో అక్కడికి చేరుకున్నారు. రెండు గ్రూపుల మధ్య మాటామాటా పెరిగి క్షణాల్లో హింసాత్మకంగా మారింది. పది రౌండ్ల వరకూ కాల్పులు జరిగాయి. దీపక్ మెడకు, కాలికి, వెనుకవైపు బుల్లెట్లు తగలడంతో హుటాహుటిన సమీపంలోని బీజేఆర్ఎం ఆసుపత్రికి తరలించాడు. అయితే అప్పటికే అతను మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ కాల్పుల ఘటనలో నరేంద్ర, సూరజ్ కూడా గాయపడటంతో ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. ఇరు గ్రూపుల మధ్య చిరకాల తగాదా వల్లే ఈ ఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. నరేంద్ర, సూరజ్‌లను అరెస్టు చేసి, షూటింగ్ ఘటనతో ప్రమేయమున్న తక్కిన వారి కోసం గాలిస్తున్నారు. కాగా, జహంగీర్‌పురిలో గ్యాంగ్‌ల మధ్య హింసాత్మక ఘటనలు పెరుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఓటీటీలోకి హాలీవుడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఫ్యూరియోసా మ్యాడ్ మ్యాక్స్'



హాలీవుడ్ ఇండస్ట్రీ నుంచి వచ్చిన సూపర్ హిట్ ఫ్రాంచైజీల్లో 'మ్యాడ్ మ్యాక్స్' ఒకటి. యాక్షన్, అడ్వెంచర్, సర్వైవల్ జానర్‌లో వచ్చిన ఈ సిరీస్ చిత్రాలు యావత్ సినీ ప్రియుల్ని విపరీతంగా ఆకట్టుకున్నాయి. 1979లో 'మ్యాడ్ మ్యాక్స్' పేరుతో ప్రారంభమైన ఈ ఫ్రాంఛైజీ ఆ తర్వాత 1981లో మ్యాడ్ మ్యాక్స్ 2 (ది రోడ్ వారియర్) 1985లో మ్యాడ్ మ్యాక్స్3 (బియాండ్ థండర్‌డోమ్), 2015లో మ్యాడ్ మ్యాక్స్ (ఫ్యూరీ రోడ్) అనే నాలుగు భాగాలుగా వచ్చి ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులను విశేషంగా అలరించింది.మొదటి మూడు భాగాలలో మెల్ గిబ్సన్ హీరోగా నటించగా.. నాలుగో చిత్రం 'మ్యాడ్ మ్యాక్స్: ఫ్యూరీ రోడ్'లో టామ్ హార్డీ హీరోగా నటించారు. అయితే ఈ ఫ్రాంచైజీ నుంచి రీసెంట్‌గా మరో చిత్రం వచ్చిన విషయం తెలిసిందే. ఫ్యూరియోసా: ఏ మ్యాడ్ మ్యాక్స్ సాగా (%ఖీబతీఱశీ: ా మీఱు మీఱఞ ూఱస్త్రు%) అంటూ వచ్చిన ఈ చిత్రం 2015 లో వచ్చిన మ్యాడ్ మ్యాక్స్ (ఫ్యూరీ రోడ్) సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చింది. మే 23న వరల్డ్ వైడ్‌గా విడుదల అయిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా ఇప్పటికే ఓటీటీలోకి వచ్చిన విషయం తెలిసిందే.

నవచిత్ర





మీనాక్షి

# మీనాక్షికి మంచి రోజులొచ్చినట్టేనా..?

సుశాంత్

హీరోగా వచ్చిన ఇచ్చుట వాహనములు నిలపరాదు సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది మీనాక్షి చౌదరి. ఆ తర్వాత వరుసగా యువ హీరోల సరసన ఛాన్స్ అందుకుంది. ఐతే మహేష్ బాబుతో గుంటూరు కారం, తమిళ హీరో దళపతి విజయ్ తో గోట్ సినిమాలో నటించిన మీనాక్షి ఆ సినిమాలతో పెద్దగా మెస్మరైజ్ చేసింది ఏమి లేదు. ఐతే అమ్మడు మాత్రం ఇప్పుడు వరుస సినిమాలతో రాబోతుంది. ముఖ్యంగా నెల రోజుల్లోనే 3 సినిమాలతో తన లక్ టెస్ట్ చేసుకుంటుంది మీనాక్షి చౌదరి. మీనాక్షి చౌదరి ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ తో లక్కీ భాస్కర్ సినిమా చేస్తుంది. ఆ సినిమా నవంబర్ ఫస్ట్ వీక్ రిలీజ్ అవుతుంది. ఇదే కాకుండా విశ్వక్ సేన్ తో మెకానిక్ రాకీ, వరుణ్ తేజ్ మట్కా సినిమాల్లో నటిస్తుంది. ఐతే ఈ సినిమాలన్నిటిలో కూడా మీనాక్షి లీడ్ హీరోయిన్ గా నటించడం విశేషం. తప్పకుండా ఈ సినిమాల ఫలితాలు అమ్మడి కెరీర్‌కి మంచి బూస్ట్ ఇస్తాయని చెప్పొచ్చు. మంచి ఫాంలోకి రావాల్సిన టైంలో మీనాక్షి ఇలా సైడ్ రోల్స్ చేయడం తో ఆడియన్స్ షాక్ అయ్యారు. కానీ అమ్మడు త్వరగానే తిరిగి కరెక్ట్ రూట్ లోకి వెళ్తుంది. రాబోతున్న సినిమాల్లో ఏ ఒక్క రోల్ క్లిక్ అయినా సరే మీనాక్షికి మంచి రోజులు వచ్చినట్టే అని చెప్పొచ్చు. అటు మహేష్, విజయ్ లాంటి హీరోలతో చేసినా యువ హీరోలకు అమ్మడు బెస్ట్ ఆప్షన్ అనిపిస్తుంది. ఎలాగు తన ఛార్మింగ్ తో ఎట్రాక్ట్ చేస్తున్న ఈమె కొద్దిగా ట్రై చేస్తే సౌత్ టాప్ హీరోయిన్ రేంజ్ కి వెళ్లే ఛాన్స్ కూడా ఉంది. మీనాక్షి కూడా తన ప్రతి సినిమాకు తన ఫుల్ ఎఫర్ట్స్ పెట్టేస్తుంది. రాబోయే సినిమాలకు అమ్మడికి కాస్త లక్ ఫేవర్ చేస్తే మాత్రం మీనాక్షి మేనియా కొనసాగించే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. మరి మీనాక్షి లక్ ఎలా ఉంది.. ఈ 3 సిని మాల తర్వాత అమ్మడి ఫేట్ మారుతుందా లేదా విశ్వక్, దుల్కర్, వరుణ్ తేజ్ ముగ్గురు యువ హీరోల తో మీనాక్షి మూవీస్ ఆమె కెరీర్‌కు ఎంత మేరకు హెల్ప్ అవుతాయన్నది చూడాలి.


# చైతూ శోభిత పెళ్లి పనులు షురూ



అక్కినేని వారి ఇంట పెళ్లి సందడి మొదలైంది. నాగ చైతన్యకి ఇటీవలే హీరోయిన్ శోభితా ధూళిపాళతో వివాహ నిశ్చితార్థం అయింది. అక్కినేని ఫ్యాన్స్‌తో పాటు తెలుగు సినిమా ఇండస్ట్రీకి చెందిన వారు చాలా మంది ఎప్పుడు వీరి పెళ్లి జరగబోతుంది అంటూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పెళ్లి తేది విషయంలో గత కొన్ని రోజులుగా ఉన్న సస్పెన్స్‌కి తెర దించుతూ పెళ్లి ఏర్పాట్లు మొదలు అయ్యాయి. శోబితా ధూళిపాళ ఇంట పెళ్లి ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి. వైభవంగా శోభితా ఇంట వేడుక జరిగింది. అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మణిరత్నం దర్శకత్వంలో సాయి పల్లవి? నాగ చైతన్య, శోభిత సుదీర్ఘ కాలంగా ప్రేమలో ఉన్న విషయం తెల్సిందే. వీరిద్దరి పెళ్లికి ఇరు కుటుంబాల నుంచి పెద్దల అంగీకారం లభించడంతో ఆగస్టులో వివాహ నిశ్చితార్థం జరిగింది. వివాహం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. పెళ్లికి సినీ ప్రముఖులతో పాటు అక్కినేని, దగ్గుబాటి ఫ్యామిలీకి సన్నిహితంగా ఉండే ఇండస్ట్రీ వర్గాల వారు హాజరు అయ్యే అవకాశాలు ఉన్నాయి. నిశ్చితార్థం చాలా సింపుల్‌గా జరిగినా వివాహం మాత్రం వైభవంగా జరగబోతుందని సమాచారం అందుతోంది. అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు జరుగుతున్నాయని శోభిత ఫ్యామిలీ నుంచి వచ్చిన ఈ స్టిల్స్ చూస్తే అర్థం అవుతోంది. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో శోభిత సాంప్రదాయబద్దమైన చీర కట్టులో కనిపించి నెటిజన్స్ దృష్టిని ఆకర్షించింది. రెండు రోజుల ముందు చైతూతో కలిసి మోడ్రన్ డ్రెస్‌లో కనిపించి విమర్శలు ఎదుర్కొన్న శోభిత తక్కువ సమయంలోనే ఇలా చీర కట్టులో కనిపించి మెప్పించిందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి శోభిత పెళ్లి ఏర్పాట్లకు సంబంధించిన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అతి త్వరలోనే వీరి వివాహ వేడుక జరుగబోతుందని క్లారిటీ వచ్చింది. ఇద్దరు కలిసి ఈ మధ్య కాలంలో షాపింగ్స్ తో పాటు, పార్టీలకు హాజరు అవుతూ లైఫ్ ని ఎంజాయ్ చేస్తున్న ఫోటోలు, వీడియోలు షేర్ అవుతూనే ఉన్నాయి.

నాగ చైతన్య సినిమాల విషయానికి వస్తే తండేల్ సినిమాలో ప్రస్తుతం నటిస్తున్నాడు. గీతా ఆర్ట్స్ బ్యానర్ లో రూపొందుతున్న ఆ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్లుగా సినిమాను రూపొందిస్తున్నారు. నాగ చైతన్య పెళ్లి తర్వాత మళ్లీ సినిమాలతో బిజీ అవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. అంతే కాకుండా శోభిత తో కలిసి నాగ చైతన్య నటించాలని చాలా మంది ఆశ పడుతున్నారు. గతంతో సమంతను వివాహం చేసుకున్న తర్వాత ఆమెతో కలిసి నటించేందుకు ఆసక్తి చూపించిన నాగ చైతన్య తప్పకుండా శోభిత తో సినిమా చేసే అవకాశాలు ఉన్నాయని అంతా అంటున్నారు.

# వరుణ్ తేజ్ 'మట్కా' నుంచి సలోని ఫస్ట్ లుక్ రిలీజ్



రాయే రాయే రాయే రాయే రాయే సలోని జాము రాతిరేలా సందుచూసి జంప్ జిలాని అంటూ కుర్రకారుని ఉర్రుతలు ఊగించిన టాలీవుడ్ భామ సలోనీ చాలా రోజులకు తెరపై కనిపించబోతుంది. ఆమె కీలక పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం మట్కా వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం నుంచి తాజాగా సలోని ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో సలోని పద్మ అనే పాత్రలో నటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.మెగా హీరో వరుణ్ తేజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు పలాస 1978 సినిమా ఫేం కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాను నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. 1958–1982 మధ్య కాలంలో దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఒక వాస్తవ సంఘటనను ఆధారం చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది. వైజాగ్ నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో వరుణ్ నాలుగు భిన్న గెటప్పుల్లో కనిపించనున్నారు. నవీన్ చంద్ర, కిశోర్, రవీంద్ర విజయ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు జీవి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.

# ప్రభాస్ బర్త్‌డే స్పెషల్.. 'రాజా సాబ్' నుంచి క్రేజీ అప్‌డేట్



ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ హీరో ఎవరంటే వెంటనే గుర్తోచ్చేది పాన్ ఇండియా స్టార్ ప్రభాస్. గతేడాది సలార్‌తో బ్లాక్ బస్టర్ అందుకున్న ఇతడు.. లేటెస్ట్‌గా కల్కి 2898 ఏడీతో మరో బ్లాక్ బస్టర్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం ఈ రెండు సినిమాలకు సీక్వెల్స్ రానున్నాయి. అయితే సినిమాలతో పాటు ప్రభాస్ మరో మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ డైరెక్టర్ భలే భలే మొగాడివోయ్ ఫేమ్ మారుతి దర్శకత్వంలో ప్రభాస్ చేస్తున్న తాజా చిత్రం రాజా సాబ్ ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది.అయితే అక్టోబర్ 23న ప్రభాస్ బర్త్‌డే కావడంతో ఇప్పటినుంచే వేడుకలు మొదలుపెట్టారు అభిమానులు. ఇక బర్త్‌డే రోజు అతడు నటించే సినిమాల నుంచి అప్‌డేట్‌లు కూడా రానున్నాయి. ఇదిలావుంటే డార్లింగ్ బర్త్‌డే కానుకగా రాజాసాబ్ నుంచి ఈరోజు సాయంత్రం 4.05 గంటలకు స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రిద్ధి కుమార్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో మెరవనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్?పై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# ఫ్యాషన్ వీక్‌కే ప్రత్యేక ఆకర్షణగా.. ర్యాంప్‌పై మృణాళ్ ఠాకూర్ మెరుపులు



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్ ప్లేలో ఉంటుంది బాలీవుడ్ భామ మృణాళ్ ఠాకూర్. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంది ఈ మరాఠీ ముద్దుగుమ్మ. ఎప్పటికప్పుడు మెస్మరైజింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తుంది మృణాళ్ ఠాకూర్. ఈ బ్యూటీ తాజాగా బాంబ్బే టైమ్స్ ఫ్యాషన్ వీక్ 2024లో సందడి చేసింది.సిల్వర్ కోటెడ్ ఫ్లోరల్ డిజైన్డ్ వైట్ కాస్ట్యూమ్స్‌లో హొయలుపోతూ ర్యాంప్ వాక్ చేసింది. అనూష రెడ్డి స్టన్నింగ్ అవుట్ ఫిట్‌లో ధగ ధగ మెరిసిపోతూ ఫ్యాషన్ వీక్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఫొటోలు, విజువల్స్ ఇప్పుడు నెటిజన్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.మృణాళ్ ఠాకూర్ ప్రస్తుతం హిందీలో నటిస్తుండగా.. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. కాగా కొన్ని రోజుల క్రితం పాపులర్ కోసం కెమెరాకు స్టన్నింగ్ ఫోజులివ్వగా.. బ్లాక్ అండ్ గ్రీన్ కాస్ట్యూమ్స్‌లో మెరిసిపోతున్న మృణాళ్ ఠాకూర్ స్టిల్స్ ఇప్పటికే నెట్టింటిని షేక్ చేస్తున్నాయి.

# క్రేజీ న్యూస్.. ఎన్‌బీకే 109లో బాబిడియోల్ విలన్



నందమూరి బాలకృష్ణ ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఎన్‌బీకే 109. బాబీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా, శ్రద్దా శ్రీనాథ్ ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు.తాజాగా ఈ చిత్రం కొత్త షెడ్యూల్ గురించి ఆసక్తిక వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. అన్‌స్టాపబుల్ సీజన్ 4లో భాగంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పెషల్ ఎపిసోడ్‌కు సంబంధించిన షూటింగ్ ఆదివారం పూర్తయింది. ఇక తన నెక్స్ట్ ప్రాజెక్ట్ ఎన్‌బీకే 109 షూటింగ్‌పై ఫోకస్ పెట్టబోతున్నాడు బాలయ్య. తాజా టాక్ ప్రకారం నేడు చౌటుప్పల్‌లో ఎన్‌బీకే 109 కొత్త షెడ్యూల్ చిత్రీకరణ షురూ అయినట్టు ఫిలిం నగర్ సర్కిల్ సమాచారం.ఓ వైపు రాజకీయాలు, మరోవైపు పాలిటిక్స్.. ఇంకో వైపు టాక్ షో.. ఆరు పదుల వయస్సు దాటినా ఇలా బ్యాక్ టు బ్యాక్ బిజీ షెడ్యూల్‌తో తీరిక లేకుండా ఉన్న బాలకృష్ణ కమిట్‌మెంట్‌కు ఫిదా అయిపోతున్నారు అభిమానులు. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశి, సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

# సర్ఫరాజ్‌ను చూసైనా క్రికెటర్లకు ఆ పరీక్ష ఆపేయండి.. గవాస్కర్ డిమాండ్



జాతీయ జట్టులోకి రావాలంటే ఫామ్ ఒక్కటే కాదు ఫిట్‌నెస్ నిరూపించుకోవాలి. కొన్నిసార్లు ప్రతిభావంతులు కూడా ఫిట్‌నెస్ పరీక్షలో విఫలమైన జట్టులో చోటు కోల్పోయిన సందర్భాలు చాలానే. అయితే.. ఫిట్‌గా లేకున్నా సరే మైదానంలో శతకాల మోత మోగించిన సర్ఫరాజ్ ఖాన్ అందర్నీ అవాక్కయ్యేలా చేశాడు. బెంగళూరు టెస్టులో అతడి 150 పరుగుల ఇన్నింగ్స్ చూసినవాళ్లంతా ఫిట్‌నెస్ ఒక్కటే కాదు ప్రతిభ కూడా కొలమానమే అంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ రంజీల్లో టన్నుల కొద్దీ పరుగులు సాధించిన సర్ఫరాజ్ ఖాన్‌కు జట్టులో మాత్రం చోటు దక్కలేదు. అందుకు కఠినమైన 'యో యో' టెస్టు ఓ కారణం అని తెలిసిందే. అందుకని ఇకనైనా క్రికెటర్లకు యోయో టెస్టులు నిర్వహించకండి అని గవాస్కర్ భారత క్రికెట్ నియంత్రణ మండలికి విన్నవించాడు. యో యో టెస్టుల పేరుతో ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను అంచనా వేయకండి. ఈ పరీక్షలకు బదులు వాళ్లు మానసికంగా ఎంత బలంగా ఉన్నారో తెలుసుకోండి అని గవాస్కర్ తెలిపాడు.అంతేకాదు ఓ క్రికెటర్ సత్తువను, ఫిట్‌నెస్‌ను పక్కాగా అంచనా వేసేందుకు ఈ పద్ధతి చాలా మంచిదని భారత లెజెండ్ వెల్లడించాడు.' దేశవాళీ క్రికెట్‌లో సర్ఫరాజ్ పరుగుల వరద పారించాడు. అయినా సరే అతడిని సెలెక్టర్లు ఎంపిక చేయలేదు. అందుకు భారత సెలెక్టర్ల బుర్రలో తిరిగే ఫిట్‌నెస్ ఆలోచనలే కారణం. భారతీయుల్లో చాలామంది సన్నని నడుము ఉండదుగా' అని గవాస్కర్ యోయో టెస్టు రద్దు ఎంత ముఖ్యమో వివరించాడు.

# దక్షిణాఫ్రికా బౌలర్ అరుదైన ఘనత.. 300 టెస్టు వికెట్ల క్లబ్‌లో రబాడ



దక్షిణాఫ్రికా బౌలర్ కాగిసో రబాడ అరుదైన ఘనత సాధించాడు. టెస్టుల్లో 300 వికెట్లు బౌలర్ల జాబితాలో ఆయన చోటు దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికా తరఫున టెస్టుల్లో 300 వికెట్లు తీసిన ఆరో బౌలర్‌గా రబాడా నిలిచాడు. కేవలం 65 టెస్టు మ్యాచ్‌లలోనే రబాడా ఈ ఘనత సా ది ం చ డ ం గ మ నా ర్హం. రబాడా కంటే మరో ఐదుగురు బౌలర్‌లు దక్షిణాఫ్రికా 300 టెస్టు వికెట్లు సాధించారు. వారిలో డేల్ స్టెయిన్ షాన్ పొలాక్ (421 వికెట్లు), ఎన్తిని (390 వికెట్లు), డొనాల్డ్ (330 వికెట్లు), మోర్కెల్ (309 వికెట్లు) ఉన్నారు. అంటే దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా స్టెయిన్ ముందు వరుసలో ఉన్నారు. ఇక ఓవరాల్‌గా చూసుకుంటే ఈ జాబితాలో శ్రీలంక బౌలింగ్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ 800 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నారు.

నవక్రీడ

# సుల్తాన్ జోహార్ కప్‌లో భారత్ గెలుపు జోరు



జోహార్ బహ్రు(మలేషియా): ప్రతిష్మాత్మక సుల్తాన్ జోహార్ కప్‌లో భారత జూనియర్ హాకీ జట్టు వరుస విజయాల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో యువ భారత్ 6–4 తేడాతో గ్రేట్‌బ్రిటన్‌పై అద్భుత విజయం సాధించింది. ఇరు జట్లు ఆది నుంచే తమదైన దూకుడు కొనసాగించారు.భారత్ తరఫున దిల్‌రాజ్‌సింగ్ (17ని, 50ని), శార్దనంద్‌తివారీ (20ని, 50ని) రెండేసి గోల్స్ చేయగా, కొనైన్ దాద్(7ని), మన్మీత్‌సింగ్(26ని) ఒక్కో గోల్ నమోదు చేశారు. రోరీ పెన్రోజ్(2ని, 15ని), మిచెల్ రోడెన్(46ని, 59ని) డబుల్ గోల్స్‌తో ఆకట్టుకున్నారు. మ్యాచ్ మొదలైన రెండో నిమిషానికే బ్రిటన్ గోల్ ఖాతా తెరువగా, ఆ తర్వాత పుంజుకున్న భారత్ పోటీలోకి వచ్చింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**